www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



తిరుమల కొండకూ ‘ఉచిత బస్సు’

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ వెల్లడి

ఉచిత ప్రయాణానికి స్మార్ట్ కార్డులు

మహిళలకు త్వరలో అందజేస్తాం

ఆధార్ జిరాక్స్‌కూ ఓకే: ఆర్టీసీ ఎండీ

మంగళవారం విజయవాడ సిటీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

13

బుధవారం | 20-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 165 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి మ.1:59 తదుపరి త్రయోదశి, నక్షత్రం: పునర్వసు రా.12:27 తదుపరి పుష్యమి, వర్జ్యం: మ.12:47-2:20, దుర్ముహూర్తం: ఉ.11:53-12:43, అమృతఘడియలు: రా.10:07-11:40, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:02, సూర్యాస్తమయం: 6:34 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మనసుంటే సాధ్యమే!

పేదరికంపై పీ4 అస్త్రం

ఆర్థిక అసమానతలు తొలగిపోతాయి

ఇది మానవతాదృక్పథంతో చేసే కార్యక్రమం

శక్తి ఉన్న ప్రతి వ్యక్తీ మరొకరికి తోడ్పడాలి

నేటి బంగారు కుటుంబాలు రేపు మార్గదర్శులుగా మారాలి

15 లక్షల బంగారు కుటుంబాలు టార్గెట్

నేనూ 250 కుటుంబాలను తీసుకున్నా

ఆదాయం, మంచి మనసు ఉంటేనే ప్రజలకు సంక్షేమం ఇవ్వగలం

ఆడబిడ్డలు బయటకు వస్తే ఆర్థిక విప్లవమే

అందుకే ఉచిత బస్సు పథకం: సీఎం

పీ-4.. మానవతాదృక్పథంతో చేసే స్వచ్ఛంద కార్యక్రమం. ఇందులో బలవంతం లేదు. పాల్గొన్నవారికి గొప్ప తృప్తి కలుగుతుంది.


-సీఎం చంద్రబాబు



మంగళగిరిలో నిర్వహించిన పీ4 ప్రారంభోత్సవంలో కుప్పం నియోజకవర్గం నుంచి తాను దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలతో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ‘మరణం తర్వాత కూడా పదిమంది మనల్ని గుర్తుపెట్టుకోవాలి. అలా జీవించగలిగితే... అంతకు మించిన సార్థకత మరొకటి ఉండదు. ఏ మాత్రం మనసున్నా పీ-4 ఆచరణ సాధ్యమే’ అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 అమలును మంగళవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బంగారు కుటుంబాల సభ్యులు, మార్గదర్శులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సీఎం ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీ4 ద్వారా శక్తి ఉన్న ప్రతి వ్యక్తీ

మిగతా 13వ పేజీలో...



మార్గదర్శిగా పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పల్లికొండ హేమలత మార్గదర్శిగా మారారు. తన ఊరికి చెందిన అనాథ వృద్ధురాలు చర్ల కనికరంను దత్తత తీసుకుని ఆమెను కన్నతల్లిలా చూసుకుంటున్నారు. హేమలతను ముఖ్యమంత్రి మంగళవారం సన్మానించి అభినందించారు.

రాష్ట్రానికి రతన్ హారం!

ఐదు నగరాల్లో రతన్‌టాటా ఇన్నోవేషన్ కేంద్రాలకు శ్రీకారం

మంగళగిరిలో ఆవిష్కరణల ‘హబ్’

విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖల్లో సెంటర్లు

రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా స్థానిక యువత సృజనకు పదును

ఆవిష్కరణల ద్వారా ఆర్థికానికి దన్ను

వచ్చే ఐదేళ్లలో లక్ష మందికి ఉపాధి

నేడు మంగళగిరిలో హబ్‌ను ప్రారంభించనున్న చంద్రబాబు

10

ఆవిష్కరణ అనేది మెట్రో నగరాలు, కొన్ని సంస్థలకు మాత్రమే పరిమితం కాదు. ఇది అందరి హక్కు! మట్టి నుంచి మాణిక్యాలు లభించినట్టు సరైన వేదికలు కల్పిస్తే.. ఒకింత ఊతమిస్తే.. వెనుక బడిన సమాజం నుంచి వేలాది మంది ఆవిష్కర్తలు పుట్టుకొస్తారు.

- రతన్ టాటా

రతన్‌టాటా ఆవిష్కరణల ‘హబ్’ కేవలం ఓ భవనం కాదు. ‘ప్రజలే ప్రధానం’ నినాదంతో.. వారి భవిష్యత్తును భవ్యంగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చే సాధనం. ఆవిష్కరణలకు చేయూతనిచ్చి... పారిశ్రామికవేత్తలను తయారు చేసే వేదిక!

- రతన్ టాటా ఇన్నోవేషన్ సంస్థ



సునీత దంపతులపై కేసు కొట్టివేత

సీబీఐ అధికారి రాంసింగ్‌కూ సుప్రీంలో ఊరట

చట్టాన్ని దుర్వినియోగపరచడానికే కేసంటూ ఆగ్రహం



వివేకా కేసులో నిందితుల కస్టోడియల్ విచారణ, బెయిళ్ల రద్దుపై మీ అభిప్రాయం తెలపండి

తదుపరి దర్యాప్తు అవసరమా? లేదా? చెప్పండి

సీబీఐని ఆదేశించిన సర్వోన్నత న్యాయస్థానం

అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయండి: లూథ్రా

గుండెపోటు అంటూ పెద్ద డ్రామాలాడారు: సీబీఐ

ఆ డ్రామాలకు స్వస్తి చెబుతామన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్‌లకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు ఆధారంగా వారిపై పులివెందుల పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆ కేసులను క్వాష్ చేస్తున్నట్లు (కొట్టివేత) ప్రకటించింది. చట్టాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని వ్యాఖ్యానించింది. వివేకా హత్య కేసులో దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఇంకొందరి ప్రమేయం ఉందని చెప్పాలంటూ తనను సునీత, రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్ బెదిరించారని కృష్ణారెడ్డి.. రాంసింగ్ తనపై దౌర్జన్యం చేశారని నిందితుడు గజ్జల ఉదయకుమార్‌రెడ్డి చేసిన ఫిర్యాదుల ఆధారంగా పులివెందుల పోలీసులు

మిగతా 13వ పేజీలో...



ఆన్‌లైన్ బెట్టింగ్ నేరం!

కేంద్రం కీలక నిర్ణయం.. బిల్లుకు క్యాబినెట్ ఓకే

నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం

బెట్టింగ్ సొమ్మును బ్యాంకులు బదిలీ చేయొద్దు

రియల్-మనీ గేమింగ్‌పై ప్రచారం నిషేధం

బిల్లులో పలు ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 19: విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటమాడుతున్న ‘ఆన్‌లైన్ బెట్టింగ్’ను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిజిటల్ వేదికల ద్వారా నగదు పందాలను నేరంగా పరిగణిస్తూ ‘ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు’ను సిద్ధం చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ బిల్లుకు ఆమోద ముద్ర పడింది. బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టవచ్చని సమాచారం. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే అన్ని నగదు ఆధారిత గేమింగ్

మిగతా 2వ పేజీలో...

ఇక రైళ్లలోనూ లగేజీపై నియంత్రణ

ఇప్పటికే ఉన్న నిబంధనలను కఠినతరం చేసేందుకు సిద్ధమైన రైల్వే

ఏసీ ఫస్ట్ క్లాస్ ప్రయాణికులైతే 70 కిలోల దాకా అనుమతి

ఏసీ సెకండ్ క్లాస్‌కు 50, ఏసీ థర్డ్ క్లాస్, స్లీపర్ పరిమితి 40 కిలోలు

జనరల్ బోగీలో 35 కిలోలే.. ప్రస్తుతానికి ఢిల్లీ పరిధిలోనే అమలు



న్యూఢిల్లీ, ఆగస్టు 19: విమానాల్లో వెళ్లేటప్పుడు మనం తీసుకెళ్లే సామాను బరువుపై నియంత్రణలుంటాయి. నిర్ణీత బరువుకు మించితే అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. చాలామందికి తెలియని విషయమేంటంటే.. రైళ్లలో మనం తీసుకెళ్లగలిగే సామాను బరువు మీద కూడా అలాంటి నియంత్రణలే ఉన్నాయి. కానీ.. ఇన్నాళ్లూ దాన్ని పట్టించుకోవట్లేదు. ఇకపై ఆ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని రైల్వే శాఖ ఒక నిర్ణయానికి వచ్చింది. దాని ప్రకారం.. ప్రస్తుతానికి కొన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు

మిగతా 2వ పేజీలో...



సీఎం అయినా.. పీఎం అయినా.. అరెస్టయితే ఔట్

30 రోజులు జైల్లో ఉంటే పదవి ఊడినట్లే!.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రులకూ వర్తింపు

ఐదేళ్లు, ఆపై శిక్ష పడే క్రిమినల్ కేసుల్లోనే.. రాజ్యాంగ సవరణకు కేంద్రం సమాయత్తం

నేడు లోక్‌సభలో మూడు బిల్లులు ప్రవేశపెట్టనున్న షా.. అనంతరం పార్లమెంటరీ కమిటీకి

విపక్ష ప్రభుత్వాలను కూల్చే కుట్ర.. ఎన్డీఏ ముఖ్యమంత్రులను ముట్టుకోరు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఐదు సంవత్సరాలు, అంతకు మించి శిక్షపడే అవకాశమున్న తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో అరెస్టయి 30 రోజులు జైల్లో ఉండే మంత్రులను 31వ రోజు పదవి నుంచి తొలగించే కీలక బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్రంలో ప్రధానమంత్రి సహా మంత్రులంతా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహా మంత్రులంతా ఈ బిల్లు పరిధిలోకి వస్తారు. మంత్రిమండలి ఉన్న కేంద్ర పాలిత ప్రాంతాలకూ వర్తించే విధంగా బిల్లును రూపొందించారు. నేరారోపణలతో అరెస్టయిన మంత్రులు రాజీనామా చేయాలని ఏ చట్టంలోనూ, రాజ్యాంగ నిబంధనల్లోనూ లేదు. కానీ, రాజీనామా చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ గత ఏడాది మద్యం కుంభకోణంలో అరెస్టయిన కేజ్రీవాల్ తొలిసారిగా ఈ సంప్రదాయాన్ని ఉల్లంఘించారు. జైలు నుంచే ప్రభుత్వ పాలన చేసేందుకు ప్రయత్నించి సుప్రీంకోర్టు చేతిలోనూ చీవాట్లు తిన్నారు. తమిళనాడులోనూ అరెస్టయిన మంత్రి సెంథిల్ బాలాజీ విషయంలో సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కావొద్దన్న ఉద్దేశంతో

మిగతా 2వ పేజీలో...



కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా తప్పుడు కేసులు పెట్టించి, విపక్ష ముఖ్యమంత్రులను జైలుపాలు చేసే కుట్రలో భాగంగానే ఈ బిల్లులు తెస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించడానికి సాధ్యం కాని విపక్ష సీఎంలను తొలగించి అక్కడ అధికారాన్ని చేజిక్కించుకొనే కుట్ర.

- అభిషేక్ సింఘ్వీ

6 వేల మంది విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు

ట్రంప్ సర్కారు తాజా నిర్ణయం

చట్టాల్ని ఉల్లంఘించారంటూ ఆరోపణ

పాలస్తీనాకు మద్దతు తెలిపినందుకు కూడా పలువురిపై వేటు

2



2

పత్తి దిగుమతిపై సుంకం రద్దు!

2022లో పొడుగు పింజ పత్తిపై వేసిన 11% పన్ను సెప్టెంబరు 30 వరకు నిలుపుదల

వస్త్ర పరిశ్రమ విజ్ఞప్తి మేరకు కేంద్రం నిర్ణయం

ట్రంప్ 50% బాదుడుతో కుదేలైన పరిశ్రమ

ఇండియా అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

ఉపరాష్ట్రపతి పదవికి సుప్రీం మాజీ జడ్జిని ఖరారు చేసిన ప్రతిపక్ష కూటమి

రేవంత్, ఖర్గే మంతనాల్లో ఆయన పేరు

సుదర్శన్‌రెడ్డిని ఒప్పించింది రేవంత్‌రెడ్డే

పేరు చెప్పగానే కూటమి నేతల ఆమోదం

ఖర్గే అభ్యర్థనపై ఢిల్లీకి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

రేపు మధ్యాహ్నం అభ్యర్థిగా నామినేషన్



న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని నిలబెట్టాలని ఇండియా కూటమి ఏకగ్రీవంగా నిర్ణయించింది. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వయంగా ప్రతిపాదించారు. ఇండియా కూటమి నేతలందరూ ముక్తకంఠంతో మద్దతు తెలిపారు. సమావేశంలో

మిగతా 14వ పేజీలో...



విజయవాడ రైల్వే వంతెన వద్ద కృష్ణమ్మ పరవళ్లు

కృష్ణానదికి భారీగా వరద

ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి హెచ్చరిక జారీ

సముద్రంలోకి 4.66 లక్షల క్యూసెక్కులు

శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతలకు పెరిగిన వరద ఉధృతి

గోదావరిలో తగ్గుతూ, పెరుగుతూ ప్రవాహం

10 లక్షల క్యూసెక్కులకు పెరగొచ్చని అంచనా

బలహీనపడిన వాయుగుండం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కృష్ణానదిలో వరద ఉధృతి పెరుగుతోంది. శ్రీశైలం డ్యాం నిండుకుండను తలపిస్తోంది. జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి 3,85,224 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, మంగళ వారం రాత్రి 882 అడుగులకు చేరింది. 198.81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో 10 క్రస్ట్‌గేట్లను 14 అడుగుల మేర ఎత్తి 3,45,240 క్యూసెక్కులు.. కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ ఉత్పాదన ద్వారా 65,509 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జునసాగర్‌కు

మిగతా 14వ పేజీలో...

తప్పుడు పోస్టుల దండుపాళ్యం బ్యాచ్‌పై కఠిన చర్యలు

అసత్య ప్రచారాలు చేసే వారిపై చర్యలకు ప్రత్యేక చట్టం తెస్తాం

అమరావతి ఎక్కడ మునిగింది?

వైసీపీ దుష్ప్రచారంపై హోం మంత్రి అనిత ఫైర్



అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించి అభద్రతా భావానికి గురి చేసే దండుపాళ్యం బ్యాచ్‌పై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. దీనిపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకురానున్నట్లు ఆమె స్పష్టం చేశారు. మంగళవారం ఆమె అమరావతి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ‘ఎన్నికల్లో

మిగతా 12వ పేజీలో...

శ్రీకాంత్‌కు పెరోల్‌పై దర్యాప్తు

దీని వెనుక ఎంతటి స్థాయి అధికారులు ఉన్నా చర్యలు

ఇలాంటి అసాంఘిక శక్తులను పెంచి పోషించిన జగన్

కూటమి ప్రభుత్వంలో వారి ఆటలు సాగవు: అనిత

కుట్రతోనే దుష్ప్రచారం

జగన్ మీడియాపై చర్యలు తీసుకోండి

తుళ్లూరు పోలీసులకు రైతుల ఫిర్యాదు

12

మిస్ యూనివర్స్ ఇండియాగా మాణికా విశ్వకర్మ



జైపూర్, ఆగస్టు 19: మిస్ యూనివర్స్ ఇండియా-2025గా రాజస్థాన్‌లోని గంగానగర్ జిల్లా వాసి మాణికా విశ్వకర్మ (22) ఎన్నికయ్యారు. ఈ ఏడాది చివర్లో థాయిలాండ్‌లో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరపున ఆమె ప్రాతినిధ్యం వహిస్తారు. జైపూర్‌లోని జీ-స్టూడియోలో జరిగిన పోటీల్లో ఎంపికైన మాణికా విశ్వకర్మకు 2024 మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా మంగళవారం తెల్లవారుజామున కిరీట ధారణ చేశారు. తాను ఈ స్థాయికి చేరుకోవడానికి తన కుటుంబం/ సామాజిక వర్గం స్థిరమైన మద్దతే కారణమని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో మాణికా విశ్వకర్మ చెప్పారు. పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడం కంటే మహిళావిద్యకే తాను ఓటేస్తానన్నారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా మిస్ యూనివర్స్ ఇండియా సంస్థ యజమాని నిఖిల్ ఆనంద్, సినీ కథా నాయిక ఊర్వశీ రౌటేలా, అష్లేయ్ రొబెల్లొ, సినీ నిర్మాత ఫర్హాద్ సామ్జీ వ్యవహరించారు.

దేశద్రోహం కేసులో సీనియర్ జర్నలిస్టులు

» సిద్ధార్థ్, కరణ్ థాపర్‌కు గువాహటి పోలీసుల సమన్లు



కరణ్ థాపర్, సిద్ధార్థ్ వరదరాజన్

గువాహటీ, ఆగస్టు 19: దేశద్రోహం అభియోగాలతో నమోదు చేసిన కేసులో సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్‌లకు గువాహటీ పోలీసులు సమన్లు జారీ చేశారు. ఈనెల 22న గువాహటీలోని క్రైమ్ బ్రాంచ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ సమన్లు వరదరాజన్‌కు ఈనెల 14నే అందగా, కరణ్ థాపర్ సోమవారం అందుకున్నారు. బీఎన్ఎస్(భారతీయ న్యాయ సంహిత)లోని సెక్షన్లు 152, 196, 197(1)(డీ)/3(6), 353, 45, 61తో నమోదు చేసిన ఎఫ్ఐఆర్(03/2025)ను ప్రస్తావిస్తూ.. క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సౌమర్జ్యోతి రాయ్ తాజా సమన్లను జారీ చేశారు. 'విచారణకు హాజరు కాకుంటే మిమ్మల్ని అరెస్టు చేయాల్సి ఉంటుంది' అని స్పష్టం చేశారు. వీరిద్దరిపై దేశద్రోహం అభియోగాలను నమోదు చేయడంపై జర్నలిస్టు సంఘాలు విస్మయం వ్యక్తం చేశాయి. క్రైమ్ బ్రాంచ్ ద్వారా జర్నలిస్టులపై అసోం పోలీసులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ది ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా(పీసీఐ), ఇండియన్ ఉమెన్ ప్రెస్ కార్ప్స్ ఆరోపించాయి. కరణ్ థాపర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 'ది వైర్' న్యూస్ వెబ్‌సైట్‌పై 2నెలల వ్యవధిలోనే అసోం పోలీసులు రెండు కేసులు నమోదు చేశారని పేర్కొన్నాయి.

6వేల మంది విద్యార్థి వీసాలు రద్దు

» అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయం

వాషింగ్టన్, ఆగస్టు 19: అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులపై ట్రంప్ సర్కారు కొరడా ఝుళిపిస్తోంది. చట్టాలను ఉల్లంఘించడంతో పాటు దేశంలో అనధికారికంగా ఎక్కువ కాలం నివసించడం తదితర కారణాలతో ఆ దేశ విదేశాంగ శాఖ 6 వేల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థి వీసాలను రద్దు చేసింది. వీరిలో ఎక్కువ శాతం మంది దాడులు, దోపిడీలకు పాల్పడటం, డ్రగ్స్, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, ఉగ్రవాదానికి మద్దతు పలకడం వంటి ఉల్లంఘనలకు పాల్పడినట్లు బీబీసీ కథనం పేర్కొంది. వీసాలు రద్దయిన 6వేల మందిలో 4వేల మంది చట్టాలను ఉల్లంఘించారని, మరో 200 నుంచి 300 మంది వరకూ ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్లు వివరించింది. ఉగ్రవాదానికి మద్దతు పలకడం అంటే ఏమిటో విదేశాంగ శాఖ స్పష్టత ఇవ్వనప్పటికీ పాలస్తీనాకు మద్దతుగా నిరసనలు తెలిపిన విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఓపెన్ డోర్స్ సంస్థ నివేదిక ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంలో 210కి పైగా దేశాల నుంచి 11లక్షల మందికి పైగా విదేశీ విద్యార్థులు అమెరికాలోని కాలేజీల్లో చేరారు.

రాయల్ నేవీలో తొలిసారిగా హిందూ పూజారి

» హిమాచల్ ప్రదేశ్‌వాసికి అవకాశం



లండన్, ఆగస్టు 19: బ్రిటన్‌లోని రాయల్ నేవీలో తొలిసారిగా హిందూ పూజారి నియమితులయ్యారు. నేవీ అధికారులకు హిందూ ఆధ్యాత్మిక విషయాలను బోధించడానికి బ్రిటన్‌లో నివసిస్తున్న హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన భాను అత్రీకి ఈ అవకాశం లభించింది. రాయల్ నేవీలోని తొలి క్రైస్తవేతర పూజారి ఈయనే కావడం విశేషం. ఈ పదవిలో నియమించే ముందు ఆయనకు కఠినమైన మిలటరీ శిక్షణ ఇచ్చారు. యుద్ధనౌక హెచ్ఎంఎస్ ఐరన్ డ్యూక్‌లో మూడు వారాల పాటు సముద్రంలో శిక్షణ పొందారు.

అరెస్టయితే ఔట్!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం తాజా బిల్లును తీసుకొస్తోందని భావిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెడతారు. అవి 1) నూటా ముప్పయవ రాజ్యాంగ సవరణ బిల్లు 2) కేంద్ర పాలిత ప్రాంతాల సవరణ బిల్లు 3) జమ్మూ కశ్మీరు పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు. మూడు బిల్లులూ అరెస్టయిన మంత్రులను తొలగించేందుకు ఉద్దేశించినవి. మొదటిది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినవి కాగా, రెండోది కేంద్ర పాలిత ప్రాంతాలది, మూడోది జమ్మూ కశ్మీరు ప్రభుత్వానికి సంబంధించినది. ఈ మూడు బిల్లులను పార్లమెంటు సంయుక్త కమిటీ పరిశీలనకు పంపాలని అమిత్‌షా తీర్మానాన్ని కూడా పెడతారు. ఈ బిల్లుల ప్రకారం వరుసగా 30 రోజులపాటు జైల్లో ఉన్న మంత్రి రాజీనామా చేయకపోతే 31వ రోజు ఆటోమాటిక్‌గా అతని పదవి రద్దవుతుంది. అయితే, ఆ నేరం ఐదు సంవత్సరాలు, అంతకు మించి శిక్షపడే అర్హత ఉన్న నేరమై ఉండాలి. ఏకంగా ప్రధానమంత్రి పదవిని కూడా చేయబోయే చట్టం పరిధిలోకి తీసుకురావడం చర్చనీయాంశం అయ్యింది.

విపక్షాలను బలహీనం చేసే కుట్ర: కాంగ్రెస్

ప్రభుత్వం ప్రకటించిన మూడు బిల్లులను తప్పుడు కేసుల ద్వారా ముఖ్యమంత్రులను తొలగించి, విపక్షాలను బలహీనం చేసే కుట్రతో రూపొందించారని కాంగ్రెస్ ఆరోపించింది. కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా తప్పుడు కేసులు పెట్టించి, విపక్ష ముఖ్యమంత్రులను జైలుపాలు చేసే కుట్రలో భాగంగా ఈ బిల్లులు తెస్తున్నారని మండిపడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించలేని పరిస్థితుల్లో విపక్ష ముఖ్యమంత్రులను తొలగించడం ద్వారా అక్కడ అధికారాన్ని చేజిక్కించుకొనే కుట్ర చేయడమే ఈ బిల్లుల ఉద్దేశమని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ అన్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ ముఖ్యమంత్రిని ఒక్కరిని కూడా ముట్టుకోరని వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన ట్వీట్ చేశారు. రాహుల్‌గాంధీ ఓట్ అధికార యాత్ర నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ బిల్లులను తీసుకొస్తున్నారని అన్నారు.



రూ.62వేల కోట్లతో 97 యుద్ధ విమానాలు


» కొనుగోలుకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 19: దేశంలో తయారయ్యే తేలికపాటి యుద్ధ విమానా (లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్-ఎల్‌సీఏ)లు కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.62వేల కోట్ల వ్యయంతో ఎల్‌సీఏ మార్క్ 1ఏ తరహాకు చెందిన 97 యుద్ధ విమానాలు కొనుగోలు చేయాలని మంగళవారం ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) వీటిని రూపొందించనుంది. ఇంతకుముందు రూ.40వేల కోట్ల వ్యయంతో 83 ఎల్‌ఏసీ మార్క్ 1ఏ యుద్ధ విమానాలు కొనుగోలుకు ఆర్డర్ పెట్టింది. ఇది రెండో ఆర్డర్ కావడం గమనార్హం. మిగ్-21 యుద్ధ విమానాలకు బదులుగా భారత వాయుసేన వీటిని ఉపయోగించనుంది.

భారత్‌కు 50 మంది వ్యోమగాములు అవసరం: శుభాన్షు శుక్లాతో ప్రధాని

న్యూఢిల్లీ, ఆగస్టు 19 : అంతరిక్ష పరిశోధనా రంగంలో భవిష్యత్తులో చేపట్టబోయే ప్రయోగాల కోసం 40 నుంచి 50 మంది వ్యోముగాములతో కూడిన బృందాన్ని భారత్ సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు వెళ్లొచ్చిన తొలి భారతీయుడు శుభాన్షు శుక్లా ప్రధాని మోదీని సోమవారం స్వయంగా కలిశారు. ఐఎస్ఎస్ యాత్రలో తనకు ఎదురైన అనుభవాలను శుభాన్షు ప్రధానితో పంచుకున్నారు.

లోకం తీరు





రాధాకృష్ణన్‌ను సన్మానిస్తున్న ప్రధాని మోదీ

రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొందాం

» విపక్షాలకు విజ్ఞప్తి చేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఉపరాష్ట్రపతి పదవికి రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని విపక్షాలను ప్రధాని మోదీ కోరారు. ప్రజాసేవలో సుదీర్ఘకాలం కొనసాగుతున్న ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకొందామని విజ్ఞప్తిచేశారు. ఎన్డీయే కూటమి ఎంపీలతో మంగళవారం ప్రధాని సమావేశమయ్యారు. రాధాకృష్ణన్‌ను ఎంపీలకు పరిచయం చేశారు. ఈ భేటీ వివరాలను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. సింధూ జలాల విషయంలో తొలిప్రధాని నెహ్రూ వ్యవహరించిన తీరును ఈ సమావేశంలో మోదీ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. నెహ్రూ దేశాన్ని రెండుసార్లు విభజించారని విమర్శించారు. పార్లమెంటు ఆమోదం లేకుండానే పాక్‌తో సింధూజలాల ఒప్పందాన్ని కుదుర్చుకుని ఆయన సంతకాలు చేశారని విమర్శించారు. తన వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచుకోవడం కోసం దేశ ప్రయోజనాలను నెహ్రూ తాకట్టుపెట్టారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా సింధూజలాల్లో 80 శాతం హక్కు పాకిస్థాన్‌కు పోయిందన్నారు. అందువల్ల ఇది రైతు వ్యతిరేక ఒప్పందమని, విలువైన జలాలు మన రైతులకు అందకుండాపోయాయని ఆయన తెలిపారు.

బిహార్లో ఒక్క ఓటూ తస్కరించనివ్వం

» ఓట్ల చోరీలో ఈసీ-బీజేపీ భాగస్వామ్యం

» 'ఓటర్ అధికార యాత్ర'లో రాహుల్

నవాడా, ఆగస్టు 19: ఓట్ల దొంగతనంలో ఎన్నికల కమిషన్ (ఈసీ), బీజేపీ భాగస్వాములని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా బిహార్లో ఒక్క ఓటును కూడా తస్కరించనివ్వబోమని స్పష్టంచేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహులే ప్రధానమంత్రి అవుతారని ఆర్జేడీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ అన్నారు. 'ఓటర్ అధికార యాత్ర'లో మూడోరోజు మంగళవారం వారు నవాడాలో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. 'ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఎన్నికల కమిషనర్లు ఓటు హక్కును ప్రజల నుంచి లాక్కుంటున్నారు. హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఎన్నికలను ఇలాగే దొంగిలించారు. మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నడుమ మేజిక్ చేసి కోటి మంది కొత్త ఓటర్లను చేర్చారు. మెషీన్‌లో చదవగలిగే ఓటర్ల జాబితాలను మాకివ్వాలని ఈసీని మేం కోరాం. కానీ కమిషన్ దానితోపాటు సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వడానికీ నిరాకరించింది. ఇప్పుడు బిహార్లో కొత్త తరహాలో మీ కళ్ల ముందే ఓట్ల చోరీ చేస్తున్నారు. కానీ, బిహార్‌లో ఒక్క ఓటును కూడా దొంగిలించనివ్వం' అని రాహుల్ స్పష్టంచేశారు. ఇప్పుడు మీ ఓట్లు తీసేస్తారు.. తర్వాత రేషన్ కార్డులు తొలగిస్తారు.. అనంతరం మీ భూములు లాక్కుంటారు.. వాటిని అదానీ, అంబానీలకు ఇస్తారని ఆరోపించారు. తప్పుడు చట్టాలు, జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు ఇవన్నీ వారికి మేలు చేయడానికేనని తెలిపారు. అంతకుముందు ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓ వ్యక్తిని రాహుల్ పిలిచి మాట్లాడించారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను పోలింగ్ ఏజెంటుగా ఉన్నానని.. ఎస్ఐఆర్‌లో తన పేరు తొలగించారని అతడు చెప్పాడు. బిహార్లో ఇలాంటివారు లక్షల మంది ఉన్నారని.. వారి ఓట్లను జాబితాల నుంచి తొలగించారని రాహుల్ అన్నారు. ఇదిలా ఉండగా, వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దామని తేజస్వి యాదవ్ ఈ ర్యాలీలో పిలుపిచ్చారు. ఆయన కారణంగానే ప్రధాని మోదీ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారని చెప్పారు.

ఓట్లు ఉన్నా లేవని చెప్పించారు: నడ్డా

తన కుటుంబంలోని ఆరుగురు ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారంటూ యాత్రలో రాహుల్, తేజస్వి సమక్షంలో చెప్పిన మహిళ.. ఆ తర్వాత అదేమీ లేదని స్పష్టంచేసింది. తనకు చదువు లేదని.. తన కుటుంబ సభ్యుల ఓట్లను తీసివేసినట్లు చెప్పాలని కొందరు చెప్పడంతో.. అదే చెప్పానని.. జాబితాల్లో తమ పేర్లు ఉన్నాయని తెలిపింది. ఆమె వీడియోను కేంద్ర మంత్రి నడ్డా 'ఎక్స్'లో షేర్ చేశారు. 'నా అబద్ధం బయటపడినా నేను అక్కడే ఉన్నాను. వాస్తవం బహిర్గతమైంది. నేను జోకర్‌గా మారాను. అయినా అక్కడే నిలబడి ఉన్నాను' అనే చరణాలున్న పాటను కూడా జతచేసి రాహుల్‌ను ఎద్దేవాచేశారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌ను తిరస్కరిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై జోక్యం చేసుకొనేందుకు నిరాకరించింది. 2024లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ చేతన్ అహిరే అనే విక్రోలికి చెందిన ఓటర్ పిటిషన్ వేశారు.

ఇక రైళ్లల్లోనూ లగేజీపై నియంత్రణ

(మొదటి పేజీ తరువాయి)

తమ లగేజీ బరువును ఎలక్ట్రానిక్ తూకాలపై తూయించుకోవాల్సి ఉంటుంది. పరిమితికి మించి బరువు ఉంటే.. దానిపై అదనపు రుసుము లేదా జరిమానా విధిస్తారు. ఏసీ మొదటితరగతి ప్రయాణికులైతే.. ఒక్కొక్కరూ 70 కిలోల దాకా బరువున్న లగేజీని తీసుకెళ్లొచ్చు. దీనిపై మార్జినల్ అలవెన్స్.. 15 కిలోలు. అంటే 85 కిలోల దాకా అదనపు రుసుము లేకుండా తీసుకెళ్లే వీలుంది. అదనపు రుసుముతో 150 కిలోల దాకా తీసుకెళ్లొచ్చు. ఏసీ రెండో తరగతి ప్రయాణికులు 60 కిలోలు, అదనపు రుసుముతో 100 కిలోల దాకా తీసుకెళ్లొచ్చు. ఏసీ మూడో తరగతి, స్లీపర్ క్లాస్ ప్రయాణికులు 50 కిలోల దాకా లగేజీని తీసుకెళ్లే వీలుంది. అదనపు రుసుముతో 80 కిలోల దాకా తీసుకెళ్లొచ్చు. జనరల్ ప్రయాణికులు 45 కిలోల దాకా బరువున్న సామాను తీసుకెళ్లొచ్చు. అదనపు రుసుముతో 70 కిలోల దాకా తీసుకెళ్లొచ్చు. ప్రస్తుతానికి ఈ నిర్ణయాన్ని జాతీయ రాజధాని ప్రాంత జోన్‌లోని ప్రయాగరాజ్ జంక్షన్, ప్రయాగరాజ్ ఛివ్‌కి, సుబేదార్ గంజ్, కాన్పూర్ సెంట్రల్, మీర్జాపూర్, టుండ్లా, అలీగఢ్ జంక్షన్, గోవింద్‌పురి, ఇటావా స్టేషన్లలో అమలు చేయనున్నారు. ఈ స్టేషన్లకు వచ్చే ప్రయాణికులు తమ లగేజీ బరువును తూయించుకుని, అవి నిర్ణీత పరిమితిలో ఉన్నట్టు నిర్ధారించుకున్నాకే వారిని ప్లాట్‌ఫారాలపైకి అనుమతిస్తారు. కాగా.. విమానాశ్రయాల తరహాలోనే ఇకపై రైల్వే ప్లాట్‌ఫామ్‌లపై కూడా దుస్తులు, పాదరక్షలు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు సంబంధించిన ప్రముఖ బ్రాండ్ల దుకాణాలు కనిపించనున్నాయి. రైల్వే ఆదాయం పెంచుకోవడంతో పాటు.. విమానాశ్రయాల తరహా అనుభూతిని ప్రయాణికులకు కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు రైల్వే శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

భారత్‌కు అరుదైన ఖనిజాలు, ఎరువులు

» టన్నెల్ నిర్మాణ యంత్రాలు కూడా..

» సరఫరా చేసేందుకు చైనా ఓకే

» ప్రధాని మోదీ, అజిత్ దోవల్‌తో చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ భేటీ

» ఈ నెల 31న చైనా వెళ్లనున్న మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 19: బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కీలకమైన అరుదైన ఖనిజాలను, కీలకమైన ఎరువులను భారత్‌కు సరఫరా చేసేందుకు చైనా ముందుకొచ్చింది. చైనా కంపెనీలు అరుదైన ఖనిజాలు, ఎరువులు, టన్నెల్ బోరింగ్ యంత్రాలను భారత్‌కు ఎగుమతి చేయడంపై ఉన్న నియంత్రణలను సడలించేందుకు అంగీకరించింది. ఢిల్లీలో విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమైన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఈ మేరకు హామీ ఇచ్చినట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. రెండు రోజుల పర్యటన కోసం ఢిల్లీ వచ్చిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ మంగళవారం ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. చైనా, భారత్ మధ్య గల్వాన్ ఘటన అనంతర ఉద్రిక్తతలను తగ్గించడం, ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం పునరుద్ధరణతో పాటు అమెరికా సుంకాల ప్రభావంపై వారు చర్చలు జరిపినట్టు తెలిసింది. ముఖ్యంగా సరిహద్దుల వద్ద ఉద్రిక్తతల తగ్గింపు కోసం చేపట్టిన 'ప్రత్యేక ప్రతినిధుల (స్పెషల్ రిప్రజెంటేటివ్స్) చర్చల' ప్రక్రియలో భాగంగా దోవల్‌తో వాంగ్‌యీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయని, సంబంధాలు మెరుగుపడుతున్నాయని ఈ సందర్భంగా దోవల్ పేర్కొన్నారు. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఆగస్టు 31న చైనా వెళ్లనున్నారని తెలిపారు.

పత్తి దిగుమతిపై సుంకం రద్దు!

» వస్త్ర పరిశ్రమ విజ్ఞప్తికి కేంద్రం ఓకే

న్యూఢిల్లీ, ఆగస్టు 19: అమెరికా సుంకాల దెబ్బకు కకావికలమైన భారతీయ వస్త్ర పరిశ్రమను కాపాడేందుకు కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. పొడుగు పింజ పత్తిపై 2022లో విధించిన 11% దిగుమతి సుంకాన్ని సెప్టెంబరు 30వరకు నిలిపేసింది. భారత వస్త్ర పరిశ్రమల సమాఖ్య చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం వెలువడింది. మూడేళ్ల క్రితం తన ఆదాయాన్ని పెంచుకొనేందుకు, దేశీయంగా పొడుగు పింజ పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్రం ఈ సుంకాన్ని విధించింది. ఇప్పుడు అమెరికాతో సుంకాల వివాదాన్ని పరిష్కరించుకొనే ప్రయత్నాలు కొలిక్కి రాని నేపథ్యంలో దేశీయ వస్త్ర వ్యాపారాన్ని కాపాడుకొనే ప్రయత్నంలో భాగంగా దాన్ని తాత్కాలికంగా నిలిపేసింది. దీనివల్ల ఆస్ట్రేలియా, అమెరికా పత్తి రైతులకు ఊరట లభించనుంది. ఇది భారతీయ వస్త్ర వ్యాపారులకు కూడా శుభవార్తే. వారికి తక్కువ ధరకు నాణ్యమైన అమెరికా పొడుగు పింజ పత్తి లభించనుంది. తక్కువ ధరకు నాణ్యమైన వస్త్రాలు ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఆన్‌లైన్ బెట్టింగ్.. నేరం!

(మొదటి పేజీ తరువాయి)

లావాదేవీలపై నిషేధం అమలులోకి వస్తుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. చట్టాన్ని ఉల్లంఘించే వారికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపాయి. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల తరఫున ఎవరైనా ప్రచారం చేస్తే జరిమానా విధించేందుకు కూడా ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. అంతేకాకుండా.. రియల్ మనీ ఆన్‌లైన్ గేమ్స్‌కు సంబంధించిన సొమ్మును బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు బదిలీ చేయకూడదన్న నిబంధనను ఈ బిల్లులో పొందుపరిచారు. దీని ప్రకారం రియల్-మనీ ఆన్‌లైన్ గేమింగ్‌పై ప్రచారం చేయడం పూర్తిగా నిషిద్ధం. నమోదు కాని గేమింగ్ ప్లాట్‌ఫాంలపైనా కఠిన చర్యలను ప్రతిపాదించారు. గతంలోనే ఆన్‌లైన్ గేమింగ్‌పై దృష్టి పెట్టిన కేంద్రం... 2023 అక్టోబరులోనే ఆ ప్లాట్‌ఫాంలపై 28 శాతం వస్తు సేవ పన్ను (జీఎస్టీ) విధించింది. ఆన్‌లైన్ గేమ్స్‌లో గెలుచుకున్న సొమ్ముపై 2024-25 నుంచి 30 శాతం పన్ను వసూలు చేస్తోంది. విదేశీ ఆన్‌లైన్ గేమింగ్ ఆపరేటర్లను కూడా మన దేశ పన్ను పరిధిలోకి తెచ్చింది. 2022 నుంచి ఇప్పటి వరకు 1,400కు పైగా బెట్టింగ్ వెబ్‌సైట్లను, ప్లాట్‌ఫాంలను స్తంభింపజేసింది. పిల్లల్లో ఆన్‌లైన్ గేమింగ్ ఒక వ్యసనంగా మారి.. వారి జీవితాలను ప్రమాదంలో పడేస్తున్న నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ ఇప్పటికే తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. కాగా, 'బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నియంత్రణ అంశం రాష్ట్రాల జాబితాలో ఉంది. రియల్-మనీ గేమింగ్‌పై ఉక్కుపాదం మోపడంతో పాటు దేశమంతా ఒకే తరహా నిబంధనలతో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అడ్డుకట్ట వేయవచ్చని కేంద్రం భావిస్తోంది.


మహారాష్ట్రలో వర్ష బీభత్సం

» థానేలో 8మంది మృతి

» ముంబైలో మంగళవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 30సెం.మీ వాన

» 250కి పైగా విమానాలపై ప్రభావం

ముంబై, ఆగస్టు 19: మహారాష్ట్రలో వర్ష బీభత్సం కొనసాగుతోంది. భారీ వర్షాల కారణంగా నాందేడ్ జిల్లాలో 8మంది చనిపోయారు. ముంబైలో మంగళవారం రికార్డు స్థాయిలో 30సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెగని వర్షాలతో ముంబైలో అన్ని రకాల ప్రయాణ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. ముంబై ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లే (లేదా) ఎయిర్‌పోర్టుకు వచ్చే దాదాపు 250విమాన సర్వీసులపై ఈ ప్రభావం పడింది. ఎనిమిది విమానాలను దారి మళ్లించాల్సి వచ్చింది. విమాన సర్వీసులు సగటున 45నిమిషాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముంబైలో మిథీ నది ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో ఐదు వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఛత్రపతి శివాజీ టెర్మినస్ నుంచి కుర్లా రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై 8అంగుళాల ఎత్తులో నీరు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో రైలు సర్వీసులను నిలిపివేశారు. ముంబైలో ఆగస్టులో కురిసే మొత్తం సగటు వర్షపాతంలో దాదాపు సగం వాన ఈ రెండు రోజుల్లోనే కురిసిందని అధికారులు వెల్లడించారు. స్కూళ్లకు ఇప్పటికే సెలవులు ప్రకటించారు. బాంబే హైకోర్టు కూడా బుధవారం మధ్యాహ్నం 12.30గంటల వరకే పని చేసింది. వర్షాలతో మహారాష్ట్రలో 10లక్షల ఎకరాల పంట నీట మునిగింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ(ఐఎండీ) కొంకణ్ తీరంలోని ముంబై, థానే, రాయగఢ్, రత్నగిరి, పాల్ఘడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. బుధవారం ఈ జిల్లాల్లో అతి భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.



భారీ వర్షాలతో ముంబైలో మోనో రైలు మధ్యలోనే ఆగిపోయింది. ఆ సమయంలో అందులో దాదాపు 500మంది ప్రయాణికులు ఉన్నారు. కరెంటు సరఫరాలో సమస్యతోనే రైలు నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. మైసూరు కాలనీ, భక్తి పార్క్ స్టేషన్ల మధ్య సాయంత్రం 6.15గంటలకు రైలు ఆగిపోయింది. ప్రయాణికులు రెండు గంటల పాటు అందులోనే ఉండిపోయారు. అధికారులు కిటికీలు పగులగొట్టి క్రేన్లు, నిచ్చెనల సాయంతో వారిని కిందికి దింపారు.

'వారంలో 90గంటలు పని' వ్యాఖ్యలు

నా భార్యకు కూడా నచ్చలేదు!

» ఎల్అండ్‌టీ సీఎండీ సుబ్రమణ్యన్ వివరణ



న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఆదివారాలతో కలిపి వారంలో 90 గంటల పాటు పని చేయాలంటూ గతంలో తాను చేసిన వ్యాఖ్యలు తన భార్యకు కూడా నచ్చలేదని ఎల్అండ్‌టీ కంపెనీ సీఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తెలిపారు. ప్రాజెక్టుల్లో చోటు చేసుకుంటున్న జాప్యం, తమ వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలోనే తాను ఒత్తిడికి గురై, అప్పట్లో ఆ వ్యాఖ్యలు చేశానన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు తాను యథాలాపంగా ఆ జవాబు ఇచ్చానని, ఆ మాటలు రికార్డవుతున్నాయని తనకు తెలియదన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో 'సిందూర్'

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఉగ్రవాదంపై యుద్ధం చేసిన ఆపరేషన్ సిందూర్‌ను ఎన్‌సీఈఆర్‌టీ తాజా పుస్తకాల్లో పాఠాలుగా పొందుపరిచింది. రెండు అనుబంధ పుస్తకాలను రూపొందించి 3 నుంచి 12 తరగతుల విద్యార్థులకు పాఠాలుగా నిర్ణయించింది. దీనిని కేవలం ఉగ్రవాదానికి సైన్యం స్పందనగా మాత్రమే చూడకుండా, శాంతి పరిరక్షణ కోసం చేసే ప్రతిజ్ఞగా పాఠాలు రూపొందించింది. పహల్గాంలో జరిగిన దాడిలో బాధితులైన వారికి గౌరవం కలిగించేలా చూడడం కూడా మరో ఆశయం. పాకిస్థాన్ మిలటరీ, రాజకీయ నాయకత్వం ప్రత్యక్షంగా ఇచ్చిన ఆదేశాల మేరకే పహల్గాం దాడులు జరిగినట్టు పాఠాల్లో పేర్కొంది.

రండి... దరఖాస్తు చేయండి!

నూతన బార్ పాలసీ విజయవంతానికి ఎక్సైజ్ శాఖ తీవ్ర ప్రయత్నాలు

- గతానికి భిన్నంగా విస్తృత ప్రచారం
- నిబంధనలపై వ్యతిరేకతతో కొత్త వ్యూహం
- రెండు రోజుల్లో ఒక్క దరఖాస్తూ రాలేదు
- లక్ష్యం మాత్రం 3,360 అప్లికేషన్లు
- అధికారులతో మంత్రి కొల్లు వర్చువల్ భేటీ
- బార్లకు ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 'గత పాలసీతో పోలిస్తే భారీగా లైసెన్స్ ఫీజులు తగ్గించాం. దరఖాస్తు రుసుములు ఏకీకృతం చేశాం. లైసెన్స్ ఫీజులను ఆరు వాయిదాల్లో కట్టే వెసులుబాటు కల్పించాం. పనివేళలు పెంచాం' అంటూ ఎక్సైజ్ శాఖ గతానికి భిన్నంగా నూతన బార్ పాలసీపై విస్తృత ప్రచారం ప్రారంభించింది. మీడియా సమావేశాలు పెట్టి మరీ పాలసీపై ప్రచారం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నడూ లేనివిధంగా తొలిసారి ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ ప్రెస్‌మీట్ పెట్టి మరీ కొత్త పాలసీలో వ్యాపారులకు చేకూర్చిన ప్రయోజనాలను వివరించారు. పాలసీ నిబంధనలపై మద్యం వ్యాపారుల్లో వ్యతిరేకత ఉంది. జిల్లాల వారీగా ముందుగానే సమావేశాలు నిర్వహించుకున్న వారు.. పాలసీలో పాల్గొన కూడదని నిర్ణయించుకున్నారు. దీంతో పాలసీపై ప్రతికూలత ఏర్పడుతుందని గ్రహించిన ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాలసీ విఫలమవుతుందనే ప్రచారం పెరగడంతో.. విజయవంతం చేయాలని జిల్లాల అధికారులను ఆదేశిస్తున్నారు.

నాలుగు దరఖాస్తులు వస్తేనే..

సాధారణంగా ఏ పాలసీలోనైనా బార్‌గానీ, షాపుగానీ కావాలంటే ఒక దరఖాస్తు సమర్పిస్తారు. కొంతమంది ఎక్కువ దరఖాస్తులు వేస్తే ఎక్కువ అవకాశం ఉంటుందని భావించి ఆ విధంగా చేస్తారు. అయితే ఈ బార్ పాలసీలో ఒక దరఖాస్తు అంటే నాలుగు దరఖాస్తులు వేయాలనే నిబంధన అనధికారికంగా అమలవుతోంది. ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీసి లైసెన్స్ కేటాయిస్తారు. మూడు వచ్చినా లాటరీ తీయరు. అందువల్ల ఫలానా బార్ కావాలనుకునే వ్యాపారి తప్పనిసరిగా నాలుగు దరఖాస్తులు సమర్పించాలి. ఎందుకంటే షాపుల పాలసీ తరహాలో బార్లకు ఎక్కువ దరఖాస్తులు రావు. 2022లో పాలసీ ప్రకటించినప్పుడు సగటున ఒక బార్‌కు 1.5 దరఖాస్తులు వచ్చాయి. పెద్ద నగరాల్లో ఒకటికి మించి దరఖాస్తులు ఎక్కడా దాఖలు కాలేదు.

రిజిస్ట్రేషనే.. ఫీజు చెల్లించలేదు!

ఈనెల 18 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించగా.. 50 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కానీ రూ.5 లక్షల రుసుము ఎవరూ చెల్లించలేదు. దీంతో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. 840 బార్లకు కనీసం నాలుగు చొప్పున అంటే 3,360 దరఖాస్తులు రావాలి. గతేడాది మద్యం షాపుల పాలసీ సమయంలో ఏ షాపునకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచారు. దానివల్ల ఎక్కడ పోటీ తక్కువ ఉందో.. ఆ షాపులకు కొత్తవారు దరఖాస్తు చేశారు. అయితే కొత్త బార్ పాలసీకి దరఖాస్తులు పెద్దగా రావేమోనన్న ప్రచారం నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య అందరికీ కనిపించకుండా వెబ్‌సైట్‌లో మార్పులు చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే వివరాలు కనిపించేలా చేశారు. అలాగే మంగళవారం ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఉన్నతాధికారులు... జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాలసీ వ్యాపారులకు అనుకూలంగా ఉందని, విస్తృత ప్రచారంతో వీలైనంత ఎక్కువ దరఖాస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్సైజ్‌లో అతిపెద్ద పాలసీగా భావించే షాపుల పాలసీ సమయంలోనూ ఇంత ప్రచారం చేయలేదు. గీత కులాలకు 340 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చిన విషయాన్ని కూడా ఉన్నతాధికారులు దాచిపెట్టారు.

ఇవీ ప్రతికూలతలు

ఒకదానికి ఫీజు రూ.5 లక్షల చొప్పున నాలుగు దరఖాస్తులు సమర్పించాలంటే రూ.20 లక్షలు వెచ్చించాలి. ఇది వ్యాపారులకు పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు బార్లకు ఇచ్చే మద్యంపై అదనంగా 15 శాతం ఏఆర్ఈటీ పన్ను వసూలు చేస్తున్నారు. దీన్ని తొలగించాలని వ్యాపారులు తీవ్ర ప్రయత్నాలు చేసినా ఆర్థిక శాఖ అంగీకరించలేదు. అలాగే మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లకు అవకాశం ఇచ్చి, అక్కడే తాగే వెసులుబాటు కల్పించారు. మరోవైపు 80 శాతానికి పైగా బార్లకు లైసెన్స్ ఫీజులు పెరిగాయి. గత పాలసీలో గొప్పలకు పోయి కొంత మంది భారీగా వేలం పాడి బార్లు దక్కించుకున్నారు. ఆ బార్లకే లైసెన్స్ ఫీజులు తగ్గాయి. ఈ నేపథ్యంలో బార్ వ్యాపారానికి దూరంగా ఉండాలని ప్రస్తుత లైసెన్సీలు భావిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ వ్యతిరేకత తీవ్రంగా ఉంది.


అటవీశాఖ స్వాధీనం చేసుకున్న విదేశీ పక్షులు

విదేశీ పక్షుల అక్రమ రవాణా గుట్టురట్టు

పలాస, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియన్ ఫించెస్, కోన్యూర్ జాతికి చెందిన విదేశీ రామచిలకలను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని శ్రీకాకుళం కాశీబుగ్గ అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కోల్‌కతాకు చెందిన రోంటిదాస్, అమృత్‌గ్యాన్ అనే వ్యక్తులు కారులో విదేశీ పక్షులను చెన్నైకు తరలిస్తూ మార్గమధ్యంలో పలాస జాతీయ రహదారి నీలావతి రైల్వేగేటు వద్ద ఉన్న ఓ లాడ్జిలో సోమవారం రాత్రి బస చేశారు. కారులోని పక్షుల అరుపులు విన్న లాడ్జి సిబ్బంది పరిశీలించి, కాశీబుగ్గ అటవీ అధికారి మురళీకృష్ణనాయుడుకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆయన రోంటిదాస్, అమృత్‌గ్యాన్‌ను, కారును అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 236 పక్షులు అందులో కిక్కిరిసి ఉన్నట్టు గుర్తించారు. వన్యప్రాణుల రక్షణ చట్టం ప్రకారం నిందితులపై కేసు నమోదు చేశామని, పక్షులను విశాఖపట్నం జంతు ప్రదర్శనశాలకు తరలిస్తున్నామని అధికారులు తెలిపారు.

కల్తీసారా తాగిన వారి వీసాలు రద్దు

- దేశ బహిష్కరణకు కువైత్ నిర్ణయం
- మళ్లీ రాకుండా జీవితకాల నిషేధం
- ఇప్పటివరకు ఏడుగురు ప్రవాసాంధ్రుల మృతి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

మద్య నిషేధం అమలులో ఉన్న కువైత్‌లో కల్తీ సారా కలకలం కొనసాగుతోంది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కువైత్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఈ దుర్ఘటన అనంతరం భారతీయులు, ఇతర విదేశీ కార్మికులు నివసిస్తున్న ప్రాంతాల్లో పోలీసులు రేయింబవళ్లు తనిఖీలు చేస్తున్నారు. వీసా, ఇంటి చిరునామాలో ఎలాంటి లొసుగులు కనిపించినా అరెస్టు చేసి జైలుకు తరలిస్తున్నారు. కల్తీ సారాతోపాటు వ్యభిచారం, ఇతర నేరాలకు నెలవైన జ్లీబ్ అల్ శూయుఖ్ అనే ప్రాంతాన్ని పూర్తిగా నేలమట్టం చేసి, దాన్ని పునర్నిర్మించే ప్రతిపాదనను కూడా కువైత్ ప్రభుత్వం పరిశీలిస్తోంది. 8 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ఉన్న ఈ ప్రాంతం అనేక నేరాలకు అడ్డాగా మారింది. ఇక్కడ ప్రవాసాంధ్ర కార్మికులు, ఇతర భారతీయులు, బంగ్లాదేశీయులు నివసిస్తున్నారు. కల్తీ సారా సేవించి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న భారతీయులతో సహ విదేశీయులందరూ కోలుకున్న అనంతరం వారందరి వీసాలు రద్దు చేసి దేశ బహిష్కరణ విధించడంతో పాటు వారు జీవితంలో మళ్లీ తమదేశంలో అడుగు పెట్టకుండా నిషేధించాలని కువైత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇస్లామిక్ చట్టం అమలులో ఉన్న కువైత్‌లో సారా విక్రయం, వినియోగం నిషేధం. దీన్ని ఉల్లంఘించినందుకు ఈ చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు కువైత్ అధికారులు ప్రకటించారు. కల్తీ సారా తాగిన వారిలో 40 మంది భారతీయులు సహా మొత్తం 160 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో చాలామంది కంటిచూపు శాశ్వతంగా కల్పోయారు.

మరికొందరి కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటున్నారు. కల్తీ సారా మృతుల్లో ఏడుగురు ప్రవాసాంధ్రులు ఉన్నారు. వారిలో నలుగురు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు కాగా, మిగిలిన ముగ్గురూ ఉమ్మడి కడప జిల్లాకు చెందిన వారని సమాచారం.

అనకాపల్లి జిల్లాలో 736 కిలోల

గంజాయి స్వాధీనం

- 22 మంది అరెస్టు

అనకాపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు 736 కిలోల గంజాయిని స్వాధీనం చేసున్నారు. ఇందుకు సంబంధించి 22 మందిని అరెస్టు చేశారు. వి.మాడుగుల మండలం శంకరం పంచాయతీ బొడ్డరేవు గ్రామ సమీపంలో 320 కిలోల గంజాయిని సోమవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా 16 మందిని అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు పరారయ్యారని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి మంగళవారం విలేకరులకు తెలిపారు. అలాగే గొలుగొండ మండలం కొమిర శివారు ప్రాంతంలో 216 కిలోల గంజాయిని పట్టుకొని, ముగ్గురిని అరెస్టు చేశారు. అదేవిధంగా పాయకరావుపేట మండలం సీతారాంపురం జంక్షన్ వద్ద సుమారు 200 కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో విషాదం

- అగ్నిపథ్‌లో పాల్గొన్న యువకుడి మృతి


సాయికిరణ్(ఫైల్)

కాకినాడ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని కాపాడాలని ఎన్నో ఆశలతో కాకినాడలో జరుగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వచ్చి పరుగు పందెంలో పాల్గొన్న యువకుడు అస్వస్థతకు గురయ్యాడు. మృతుడి తండ్రి అప్పలనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం శ్రీహరినాయుడుపేటకు చెందిన గండ్రేటి సాయికిరణ్ (20) డిగ్రీ వరకు చదువుకుని పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. మొదటి నుంచీ దేశ రక్షణ కోసం సైనికుడు అవ్వాలనే లక్ష్యంతో ఉండేవాడు. ఈ క్రమంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతోందని తెలుసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. పోటీలో మంగళవారం పాల్గొనాల్సి ఉండడంతో సోమవారం అర్ధరాత్రి కాకినాడ చేరుకున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు 1600 మీటర్ల పరుగు పందేనికి హాజరయ్యాడు. కొంత దూరం వెళ్లేసరికి సాయికిరణ్ హృదయ స్పందన అధికమై ఒక్కసారిగా కుప్పకూలాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతన్ని ఆర్మీ సిబ్బంది హుటాహుటిన సుమారు ఐదు గంటల ప్రాంతంలో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో ప్రథమ చికిత్స అనంతరం మెడికల్ వార్డు (ఎం3)కు తరలించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సాయికిరణ్ మరణించినట్టు వైద్యులు అప్పలనాయుడుకు చెప్పారు. ఆ వార్త విన్న ఆయన కన్నీరుమున్నీరుగా విలపిస్తూ కుప్పకూలిపోయాడు. ఎవరిపైనైనా ఫిర్యాదు చేస్తే పోస్టుమార్టం నిర్వహించి శరీరాన్ని కోస్తారని భయపడి కుమారుడి మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లారు. కాగా.. ఈ వ్యవహారంపై ఎటువంటి పోలీసు కేసు నమోదు కాలేదు.

రైతు సంక్షేమమే టీడీపీ మొదటి ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు
- అనంతపురం జిల్లా కణేకల్లులో 'అన్నదాత సుఖీభవ' విజయోత్సవ ర్యాలీ


అనంతపురం జిల్లా కణేకల్లులో 'అన్నదాత సుఖీభవ' విజయోత్సవ ర్యాలీ


ట్రాక్టర్ నడుపుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి టీడీపీ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. అనంతపురం జిల్లా కణేకల్లు మండల కేంద్రంలో 'అన్నదాత సుఖీభవ' విజయోత్సవ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. సుమారు 500 ట్రాక్టర్లతో రైతులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీని చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అమలు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ సహా అనేక హామీలను అమలు చేశామని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రూ.3,174 కోట్లు అందించామని, ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడికి సాయపడ్డామని వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువ నాయకుడు లోకేశ్ సారథ్యంలో రాష్ట్రంలో ప్రజా రంజక పాలనను కూటమి ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. పింఛన్ల సొమ్ము పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలను అందించి, దేశంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి ఏపీ ప్రభుత్వం చేసిందని తెలిపారు.

శ్రీవారి నామస్మరణతో శక్తి పెరుగుతుంది: నైనా జైస్వాల్


తిరుమల ఆలయ సమీపంలో నైనా జైస్వాల్

తిరుమల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి నామస్మరణతో భక్తుల్లో శక్తి పెరుగుతుందని టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ టోర్నమెంట్లకు సిద్ధమవుతున్నానని చెప్పారు.

ఏఐపై పట్టు.. రూ.2.5 కోట్ల ప్యాకేజీ

- రైల్వేకోడూరు యువకుడికి అమెరికాలో భారీ వేతనం


యశ్వంత్

రైల్వేకోడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్ నాలుగో సంవత్సరంలోనే క్యాంపస్ సెలెక్షన్స్‌లో రూ.కోటి వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం సంపాదించిన రైల్వేకోడూరు యువకుడు.. ఆపై కృత్రిమ మేథ (ఏఐ)పై పట్టు సాధించి ఇప్పుడు ఏకంగా రూ.2.5 కోట్ల వార్షిక ప్యాకేజీతో ఉన్నత ఉద్యోగం సాధించాడు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు పట్టణం సూర్యానగర్‌కు చెందిన అదునుకోట చంద్రశేఖర్, మాధవి దంపతుల కుమారుడు అదునుకోట యశ్వంత్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్ పూర్తిచేశాడు. అక్కడ నాలుగో ఏడాది చదువుతుండగానే క్యాంపస్ సెలెక్షన్స్‌లో అమెరికాకు చెందిన థర్డ్ ఏఐ కంపెనీ అతనికి రూ.కోటి వార్షిక వేతనం చెల్లించేందుకు ముందుకొచ్చింది. 2022 నుంచి ఆ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న యశ్వంత్.. ఏఐపై మరింత పట్టు సాధించి రెండు వారాల క్రితమే కాలిఫోర్నియాకు చెందిన సర్వీస్ నౌ కంపెనీలో రూ.2.5 కోట్ల వార్షిక ప్యాకేజీతో మంచి ఉద్యోగం సాధించాడు. చిన్న ప్రింటింగ్ ప్రెస్‌తో జీవనం సాగిస్తున్న యశ్వంత్ తల్లిదండ్రులు తమ కుమారుడికి రెండున్నర కోట్ల వార్షిక వేతనంతో ఉద్యోగం రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, తనలాగే చదవాలనుకునే వారి కోసం త్వరలోనే కెరీర్ గైడెన్స్‌ను ప్రారంభిస్తానని యశ్వంత్ తెలిపాడు. చిన్నప్పటి నుంచి ఎలా చదవాలి, రోజుకు ఎన్ని గంటలు చదవాలి, ఏ యే సబ్జెక్టుల్లో పట్టుసాధించాలి, ఏ సబ్జెక్టు తీసుకుంటే క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉపయోగపడతాయి వంటి సూచనలు ఇస్తానని చెప్పాడు.

గాడి తప్పితే ఎమ్మెల్యేలనూ ఉపేక్షించం: పల్లా

- టీడీపీ కేంద్ర కార్యాలయానికి అనంతపురం పంచాయితీ

అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గాడి తప్పిన ఎమ్మెల్యేల చర్యలను పార్టీ చూస్తూ ఊరుకోబోదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి నడుమ వర్గపోరు వివాదం మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరింది. పార్టీ కార్యాలయానికి వచ్చిన ప్రభాకర్ చౌదరి.. పల్లాను కలిసి అనంతపురంలో జరిగిన ఘటనలను వివరించారు. అనంతరం పల్లా విలేకరులతో మాట్లాడుతూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎమ్మెల్యే అయినా ఉపేక్షించేది లేదన్నారు. కఠిన చర్యలకు వెనుకాబోమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల వ్యవహార శైలిని చంద్రబాబు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఎమ్మెల్యేలు వ్యక్తిగతంగా చేసే తప్పుల వల్ల పార్టీ నష్టపోతోందని, ఇలాంటి పరిస్థితిని ఉపేక్షించేది లేదని చంద్రబాబు స్పష్టంగా పార్టీ శ్రేణులకు తెలియజేయమన్నారని చెప్పారు. కొన్ని సందర్భాల్లో తప్పుడు ప్రచారాలు, ఫేక్ వీడియోల ద్వారా ఎమ్మెల్యేల మీద కుట్రలు జరుగుతున్నాయని, ఇలాంటి వ్యవహారాల్లో ఎమ్మెల్యేలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతపురం ఘటనపై తాను ఎవ్వరినీ పిలిపించలేదని, ఏం జరిగిందో విచారణ చేసి అధినేతకు నివేదిక ఇస్తామని చెప్పారు. కాగా, ప్రభాకర్ చౌదరి విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీకి, ప్రజలకు ఇబ్బంది కలిగినప్పుడు బాధ్యతగా స్పందించి అధిష్ఠానానికి వాస్తవాలను వివరించాలనే వచ్చానన్నారు. 'సీటే వదులుకున్నా.. నాకు గ్రూపులతో పని లేదు. భవిష్యత్తులో పోటీ చేసే ఆలోచన కూడా లేనప్పుడు గ్రూపు రాజకీయాలు చేయాల్సిన అవసరం నాకు లేదు' అని స్పష్టం చేశారు.

విశాఖ ఉక్కు ఎప్పటికీ ప్రైవేటుపరం కాదు

విశాఖ ఉక్కు ప్రైవేటుపరమవుతోందంటూ వైసీపీకి అనుబంధంగా ఉన్న కొంత మంది నాయకులు, కార్మిక సంఘాల నేతలు చేస్తున్న ప్రచారం నిరాధారమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఎప్పటికీ ప్రైవేటుపరం కాబోదన్నారు. సీఎం చంద్రబాబు ఉక్కు ప్లాంటు పరిరక్షణకు కృషి చేస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ.14 వేల కోట్లు తెచ్చి ప్లాంటుకు ఆర్థిక ఊపిరి పోశారని చెప్పారు. ప్లాంటును పూర్తి స్థాయిలో లాభాల్లోకి తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తప్పుడు ప్రచారాలు చేసే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్చకుల సమస్యలు పరిష్కరిస్తాం

- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాం ప్రసాద్ వెల్లడి

అర్చకుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాం ప్రసాద్ చెప్పారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం బ్రాహ్మణ సాధికార సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సంక్షేమం కోసం టీడీపీ తీసుకొచ్చిన జీవో 76ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, దాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానన్నారు.

జైలునే వైసీపీ కేంద్ర కార్యాలయం చేసుకోండి

- జెండా ఎగరేయలేరు కానీ జైలు యాత్రలు చేస్తారు: నక్కా

మద్యం కుంభకోణంలో అరెస్టైన మిథున్ రెడ్డిని పరామర్శించేందుకు జగన్ రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్తుండటం సిగ్గుచేటని ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమ మద్యం, హత్య, కిడ్నాప్ కేసుల్లో అరెస్టై, జైలులో ఉన్న వారిని పరామర్శించేందుకు జగన్ జైలు యాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. త్వరలో రాజమండ్రి సెంట్రల్ జైలునే వైసీపీ కేంద్ర కార్యాలయంగా చేసుకున్నా ఆశ్చర్యపోనక్కరలేదన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు జాతీయజెండా ఎగురవేయలేని జగన్ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వేసుకుని జైలు యాత్రలు మాత్రం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

రాహుల్ పోరాటం అభినందనీయం: రామకృష్ణ

తణుకు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఆ పార్టీ జిల్లా మహాసభలకు విచ్చేసి మాట్లాడారు. 'మోదీ ప్రభుత్వంలో ఓట్లు తొలగించే ప్రక్రియతో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఓట్ల చోరీ విషయంలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ చేసే పోరాటాన్ని అభినందించాలి. ఆధారాలతో ఓట్ల తొలగింపు చేసినట్లు చెప్పినా ఎన్నికల సంఘం ప్రమాణ పత్రాలు సమర్పించాలని అడగడం సరికాదు. బీజేపీ ఏజెంటుగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోంది' అని రామకృష్ణ విమర్శించారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

విజయవాడ (గాంధీనగర్), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ (ఏపీపీజేఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు లక్ష్మణ్(విజయవాడ), లావణ్యకుమార్ (తిరుపతి), సాయికుమార్(తిరుపతి) విజేతలుగా నిలిచారు. అవార్డుల ప్రదానోత్సవం విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగింది. విజేతలకు ఆంధ్రప్రదేశ్ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ సురేష్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన ప్రతి చిత్రం స్ఫూర్తిదాయకం, సందేశాత్మకమన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఫొటో జర్నలిస్టులు నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, వాటిలోని లోటుపాట్లను సరిదిద్దడంలో ఫొటోగ్రాఫర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఫొటోగ్రఫీ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన సీనియర్ జర్నలిస్టు పీవీ కృష్ణారావు, సీనియర్ ఫొటో జర్నలిస్టులు సీహెచ్‌వీ మస్తాన్, సీహెచ్ నారాయణరావు, ఐఅండ్‌పీఆర్ శాఖలో సీనియర్ ఫొటోగ్రాఫర్ ప్రసాద్‌ను సత్కరించారు.



అవార్డులు సాధించిన ఫొటో జర్నలిస్టులు

36 పాక్ వాట్సాప్ గ్రూపుల్లో నూర్ మహమ్మద్

- ధర్మవరం వాసి ఉగ్ర లింకులపై ఫోకస్
- నూర్ కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్


కొత్వాల్ నూర్ మహమ్మద్

పుట్టపర్తి/ధర్మవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ధర్మవరం వాసి కొత్వాల్ నూర్ మహమ్మద్‌కు ఉన్న ఉగ్రలింకులను కనిపెట్టేందుకు పోలీసులు దర్యాప్తు వేగాన్ని పెంచారు. పాకిస్థాన్‌కు చెందిన 36 వాట్సాప్ గ్రూపుల్లో అతడు యాక్టివ్‌గా ఉన్నట్లు గుర్తించారు. ఆ గ్రూపులు ఏంటి? వాటిలో కార్యకలాపాలు ఏంటి? ఏమి సమాచారాన్ని ఆ గ్రూపుల్లో పంచుకున్నాడనేది విశ్లేషిస్తున్నారు. దీని కోసం అతని మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. కాగా, పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ సహా ఆరు ఉగ్రవాద సంస్థల వాట్సాప్ గ్రూపుల్లో నూర్ మహమ్మద్ చురుగ్గా ఉన్నట్లు ఇప్పటికే తేలింది. మరో 30 పాక్ వాట్సాప్ గ్రూపుల్లోనూ ఉన్నాడని తాజాగా వెల్లడైంది. ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు నూర్ మహమ్మద్‌ను కస్టడీకి తీసుకోవాలని నిర్ణయించారు. కడప సెంట్రల్ జైల్‌లో ఉన్న అతన్ని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ధర్మవరం కోర్టులో పోలీసులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. కాగా, నూర్ మహమ్మద్‌ను అదుపులోకి తీసుకున్న సమయంలో ఇచ్చిన సమాచారం ఆధారంగా ఉగ్ర లింకులు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోనూ ఉన్నట్లు తేలింది. ఆ రాష్ట్రాలకు చెందిన ఇద్దరితో సంబంధాలు నెరిపినట్లు పోలీసులు గుర్తించారని సమాచారం. వారిని అదుపులోకి తీసుకుని విచారించేందుకు ప్రత్యేక పోలీసులు బృందాలు ఆ రాష్ట్రాలకు వెళ్లినట్లు తెలిసింది.

పరారీలో ప్రియురాలు

నూర్ మహమ్మద్ అరెస్టు తరువాత అతడి ప్రియురాలు, సన్నిహితులు కొందరు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నూర్ మహమ్మద్‌తో ఎవరెవరు సన్నిహితంగా వ్యవహరించారు, వారు ఎక్కడెక్కడ దాక్కున్నారో గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. నూర్ ఫోన్ కాల్స్ ఆధారంగా వీరిని గుర్తిస్తున్నారు. దీంతో స్థానికంగా అతనితో కలిసి తిరిగినవారిలో గుబులు మొదలైంది.

300 కూలికి వెళితే.. రూ.40 లక్షల వజ్రం దొరికింది

- కర్నూలు జిల్లాలో తుగ్గలిలో కూలీని వరించిన అదృష్టం
- అక్కడికక్కడే 40 లక్షలు చెల్లించిన వజ్రాల వ్యాపారి

తుగ్గలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మూడొందల రూపాయల కూలికి వెళ్లిన ఓ వ్యక్తిని అదృష్టం వజ్రం రూపంలో వరించడంతో రూ.40 లక్షలతో ఇంటికి తిరిగొచ్చాడు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో మంగళవారం పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న కూలికి విలువైన వజ్రం లభ్యమైంది. మట్టి పనులు చేస్తున్న సమయంలో భూమిలో ఆయనకు మెరిసిపోతున్న వజ్రం కనిపించింది. మొదట అదొక సాధారణ రాయి అనుకున్న ఆ కూలీ.. ఆ తర్వాత దాన్ని స్థానిక వజ్రాల వ్యాపారికి చూపించాడు. అది రాయి కాదు విలువైన వజ్రం అని చెప్పిన ఆ వ్యాపారి.. వెంటనే దాన్ని రూ.40 లక్షలకు కొనుగోలు చేశాడు. సాధారణంగా వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామస్థులు, ఎక్కడెక్కడి నుంచో ఈ ప్రాంతానికి వచ్చి వజ్రాల కోసం అన్వేషణ సాగిస్తుంటారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం సశేషం

అటు రష్యా అధ్యక్షుడు, ఇటు అమెరికా అధ్యక్షుడు భారీ భద్రత మధ్య ఆర్భాటంగా తరలివెళ్ళిన అలాస్కా సమావేశం హిట్టయిందా లేదా అన్నది వేరే సంగతి, కానీ, వీరిద్దరి కలయికే చూడముచ్చటైన దృశ్యం. వందలేళ్ళక్రితం రష్యా చక్రవర్తుల నుంచి అమెరికా చవుకగా కొనేసిన అలస్కాను ఎంపిక చేయడంలో ట్రంప్ తెలివి తేటలున్నాయో, ఏ దేశమేగినా అరెస్టయ్యే ప్రమాదం ఉన్న పుతిన్ తనదేశ సరిహద్దులకు దూరంగా పోదల్చుకోక అలాస్కా కోసం ఒత్తిడిచేశారో తెలియదు. పుతిన్‌కు ట్రంప్ ఎర్రతివాచీ పరిచినా, అమెరికాకు చెందిన నాలుగు ఎఫ్–35 విమానాలు, ఒక బీటూ బాంబర్ రష్యా అధ్యక్షుడి దిశగా ఎగురుతున్న ఆ దృశ్యాలు ఎన్నటికీ మరిచిపోలేనివి. ఓ నాలుగు విమానం బొమ్మలతో సాక్షాత్తూ రష్యా అధ్యక్షుడినే బెదిరించి దారికి తెచ్చుకోగలవా ట్రంప్ అంటూ సామాజిక మాధ్యమాల్లో ఎగతాళి చేసినవారికి, ఈ విమానవిన్యాసాల్లో ముఖస్తుతి ఉన్నది తప్ప, బెదిరింపులు లేవని తెలియకపోదు.

దీనికి కొనసాగింపుగా, మరో దృశ్యం కూడా ప్రపంచం చూసింది. మొన్న ఫిబ్రవరిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని బయటకు గెంటేసిన అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు ఆలింగనాల స్థాయిలో ఎక్కడ లేని ఆప్యాయతలూ కనబరిచారు. ఆర్నెల్ల క్రితం జెలెన్‌స్కీ దుస్తులు పరమచెత్తగా ఉన్నాయని మొఖం మీదే చెప్పేసిన అమెరికా పాత్రికేయుడికి కూడా ఇప్పుడు ఉక్రెయిన్ అధ్యక్షుడూ, ఆయన సూటూ తెగ నచ్చేశాయి. అవును, నాకూ అలాగే అనిపించింది, నేనూ అదే చెప్పాను అన్నారు ట్రంప్ ఆనందంగా. జెలెన్‌స్కీకి దక్కిన స్వాగత సత్కారాలు, మర్యాదలు, భేటీలో పూచిన నవ్వులపువ్వులు చూసిన వారికి అప్పట్లో అమెరికా అధ్యక్షుడు ఇదే వ్యక్తిని ఛీత్కరించి బయటకు పంపేసిన దృశ్యాలు గుర్తుకు రాకతప్పవు. మహాబలుడైన పుతిన్ ముందు నువ్వెంత, నీకున్న ఆయుధ బలమెంత అంటూ అవమానించి, కయ్యానికి కాలుదువ్వింది నువ్వేనంటూ అచ్చం పుతిన్ పరిభాషలో చెడామడా ఏకేయడం విస్మరించలేనివి. ఆ తరువాత ఉక్రెయిన్ అధ్యక్షుడు ఖరీదైన కప్పం సమర్పించుకోవడానికి సిద్ధపడిన ప్రభావం కూడా ఇప్పుడు కనిపిస్తున్న మార్పుకు ఒక కారణం కావచ్చు.

పుతిన్‌తో భేటీ తరువాత, జెలెన్‌స్కీ మీద అమెరికా అధ్యక్షుడికి ఇలా ఎక్కడలేని ప్రేమాభిమానాలు పొంగుకొచ్చే ప్రమాదం ఉన్నదని తెలుసు కాబట్టే, ఏడు యూరప్ దేశాల నాయకులూ వెంట పరిగెత్తుకొచ్చారు. జెలెన్‌స్కీ మీద ఒత్తిడితెచ్చి పుతిన్ కోరుతున్న ఉక్రెయిన్ భూభాగాలను ట్రంప్ ఎక్కడ ధార పోస్తాడోనని వీరి అనుమానం. వీరితో కరచాలనాలు, ఫోటోసెషన్లు, ఇతరత్రా మర్యాదలకు లోటేమీ చేయలేదు కానీ, పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడటానికి వీరందరినీ నలభైనిముషాలపాటు ట్రంప్ నిరీక్షణలో ఉంచారని మాత్రం వార్తలు వచ్చాయి. మళ్లీ కలుద్దాం అంటూ, ఈమారు మాస్కోలో అని పుతిన్ అలాస్కాలోనే ట్రంప్‌తో ఓ మాట న్నారు. మాస్కోలో భేటీకి జెలెన్‌స్కీ అంగీకరించడని అమెరికా, రష్యా అధ్యక్షులకు తెలియదనుకోలేం. పుతిన్ రమ్మనడం, జెలెన్‌స్కీ సహా ఆయన పక్షాన ఉన్నవాళ్ళంతా దానిని కాదనడం జరిగిపోయాయి. ఏదో ఒకరోజు, అందరికీ అంగీకారమైన చోట పుతిన్–జెలెన్‌స్కీ కలిసి కూర్చొని మాట్లాడుకుంటారని ట్రంప్ నమ్ముతున్నప్పటికీ, అది ఇప్పట్లో సాధ్యపడకపోవచ్చును. కాల్పుల విరమణ తరువాతే ఇటువంటి భేటీలకు సార్థకత ఉంటుందని యూరప్ నాయకుల వాదన. భూదానం సహా తన డిమాండ్లన్నింటికీ ఒప్పుకుంటే నేరుగా శాంతి ఒప్పందం మీదే సంతకాలు చేసుకోవచ్చునన్న పుతిన్ ప్రతిపాదన ట్రంప్‌కు కూడా ఇంపుగా ఉంది. కాల్పుల విరమణకు ఒప్పుకోని పక్షంలో పుతిన్ చాలా పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అలాస్కా బయలుదేరే ముందు హెచ్చరించిన ట్రంప్, వెనక్కు వచ్చిన తరువాత పుతిన్ పక్షానే మాట్లాడుతున్నట్టు యూరప్ దేశాధినేతలకు అనిపిస్తోంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడానికి ట్రంప్ అదే పనిగా కష్టపడుతున్నారు. అధికారంలోకి రాగానే ఆప్తమిత్రుడు పుతిన్‌కు ఓ మాటచెబితే యుద్ధం ఆగిపోతుందనుకున్నారు ఆయన. అది జరగకపోగా, ఆయుధాలకు, ఆంక్షలకు, హెచ్చరికలకూ కూడా బెదరకపోవడంతో మిత్రదేశాలమీద ఆర్థిక ఒత్తిడి పెంచి రష్యాను దారికి తెచ్చే ప్రయత్నం సాగిస్తున్నారు. యుద్ధం ఆపడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నప్పటికీ, పుతిన్ ఆవహించి ఉన్నంతకాలం అది సాధ్య పడదని యూరప్ దేశాధినేతల నమ్మకం.

మిర్యాలగూడ రైస్ మిల్లుల్లో, హైదరాబాద్ భవన నిర్మాణ రంగంలో పనిచేసే బిహారీ కూలీలు ఓటు వేయడానికి తమ స్వంత రాష్ట్రానికి వెళ్ళకపోవచ్చు. అదే విధంగా బెంగళూరు లేదా దుబాయిలో పనిచేసే తెలుగు ప్రవాసులు తమ స్వస్థలాలకు రాకపోవచ్చు. అంత మాత్రాన ఆ శ్రమ జీవుల ఓటు హక్కును తీసివేయడం సమంజసం కాదు.

వలస కార్మికుల ఓటుహక్కు ప్రాముఖ్యత

బిహార్‌లో నిర్వహిస్తోన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఆ ఒక్క రాష్ట్రానికే పరిమితం కాదు. సమీప భవిష్యత్తులోనే దేశవ్యాప్తంగా జరగనున్న ఈ సవరణ ప్రక్రియ, తమ తమ మాతృస్థలాలను వీడి ఉపాధికై వలసబాట పట్టిన లక్షలాది భారతీయులపై తప్పక ప్రభావం చూపుతుంది.

అశేష ప్రశ్నలకు తావిచ్చిన బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో తమ ఓటు హక్కును కోల్పోయిన వారిలో అత్యధికులు జీవనోపాధికై ఇతర ప్రాంతాలకు వెళ్ళినవారే. స్వరాష్ట్రంలో ఆర్థికాభివృద్ధికి అవకాశాలు అరకొరగా ఉండడం అనివార్యంగా ఉపాధి వలసలకు దారితీస్తోంది. ఇలా బతుకుతెరువు అన్వేషించు కుంటూ వెళ్లేవారు పేదలు, నిరక్షరాస్యులే అన్నది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. కోవిడ్ సంక్షోభ కాలంలో ప్రత్యేకంగా నడిపిన రైళ్ళ ద్వారా తమ స్వస్థలాలకు తిరిగి వచ్చిన వారి నుంచి మాత్రమే దేశంలో వలస కార్మికుల వివరాలు (అత్యంత స్వల్పంగానే అయినప్పటికీ) అధికారవర్గాలకు తెలిశాయి. ఇంతకు మించి, ఆ వలస పక్షుల గురించి మరే సమాచారం లేదు. ఈ పరిస్థితుల దృష్ట్యా వలస కార్మికులను గుర్తించి ఒక అంచనాకు రావడం ఏమంత సులువు కాదు.

గల్ఫ్ లేఖ

పేదవాడికి మిగిలి ఉన్న ఏకైక ఆస్తి ఓటు హక్కు. అయితే అది కూడా ఇప్పుడు ప్రశ్నార్థకమవుతోంది. మరణించిన లేదా శాశ్వతంగా స్వస్థలాన్ని వదిలి వెళ్ళిపోయిన వారు లేదా చొరబాటుదారులు ఓటర్లుగా ఉండకూడదు. ఈ విషయంలో ఎవరికీ మరో అభిప్రాయం లేదు. కన్న ఊరులో బతుకు భారం కావడంతో తాత్కాలికంగా పరాయి ప్రదేశానికి పొట్టకూటికై వెళ్ళిన వారి ఓటు హక్కును తొలగించడం న్యాయమేనా? బతకడానికి బయటకు వెళ్ళినవారిని ఏ విధంగా, ఏ ప్రాతిపదికన గుర్తించాలో చట్టబద్ధమైన నిర్దిష్ట మార్గదర్శకాలు లేవు. 'ప్రజా ప్రాతినిధ్య చట్టం–1950' లోని నిబంధన 20లో 'సాధారణ నివాసి' (ఆర్డినర్లీ రెసిడెంట్) నిర్వచనం సైతం స్పష్టంగా లేదు.



ఉపాధి వలసల విషయానికి వస్తే, బిహార్ రాష్ట్రంలో ముఖ్యంగా అంతర్జాతీయ వలసలలో అగ్రగామిగా ఉన్న జిల్లా గోపాల్ గంజ్. తాజాగా అత్యధిక ఓటర్లు గల్లంతయింది కూడా ఈ జిల్లాలోనే కావడం గమనార్హం. మూడు లక్షల పది వేలకు పైగా ఓట్లను తొలగించడంతో జిల్లాలో ఓట్ల సంఖ్య 15 శాతం తగ్గింది. రాష్ట్రీయ జనతా దళ్ అగ్రనాయకుడు లాలూప్రసాద్ యాదవ్ స్వంత జిల్లా అయిన గోపాల్‌గంజ్‌లో ఆరుగురు శాసనసభ్యులు ఉన్నారు. మూడు ప్రధాన పార్టీలు రాష్ట్రీయ జనతాదళ్, భారతీయ జనతా పార్టీ, జనతాదళ్ (యు) పక్షాన ఇద్దరు చొప్పున సమాన ప్రాతినిధ్యం కలిగి ఉన్నాయి. గల్ఫ్ దేశాలలో పనిచేసే బిహారీ ప్రవాసులలో అత్యధికులు గోపాల్ గంజ్ జిల్లావారే. ఎడారి వలసల విషయానికి వస్తే తెలుగునాట తూర్పు గోదావరి లేదా నిజామాబాద్ తరహాలో గోపాల్ గంజ్ కూడా ప్రభావిత జిల్లా. గోపాల్ గంజ్‌తో పాటు బిహార్‌లోని ఇతర జిల్లాల్లో కూడా దేశంలోని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే కార్మికులు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ఈ కారణాన రానున్న శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 'పలయన్ రోకో నౌక్రీ దో' (వలసలు ఆపండి, ఉద్యోగం ఇవ్వండి) అనే నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ ఇవ్వగా వలస వెళ్ళిన బిహారీలను జనతాదళ్ (యు) బిహార్ దివస్ ఉత్సవాలలో భాగంగా ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ వలస కార్మికుల సమస్యల పరిష్కారానికై ధర్నా చేశారు.

మిర్యాలగూడ రైస్ మిల్లుల్లో, హైదరాబాద్ భవన నిర్మాణ రంగంలో పనిచేసే బిహారీ కూలీలు ఓటు వేయడానికి తమ స్వంత రాష్ట్రానికి వెళ్ళకపోవచ్చు. అదే విధంగా బెంగళూరు లేదా దుబాయిలో పనిచేసే తెలుగు ప్రవాసులు తమ స్వస్థలాలకు రాకపోవచ్చు. అంత మాత్రాన ఆ శ్రమ జీవుల ఓటు హక్కును తీసివేయడం సమంజసం కాదు.

దురదృష్టవశాత్తు భారతావనిలో నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల కారణంగా సాధారణ చర్యలు కూడా అసాధారణంగా పరిగణితమవుతున్నాయి. ఇందుకు సహేతుక కారణాలు ఉన్నాయి. ప్రజా జీవితంతో ముడివడి ఉన్న అంశాలలో సంస్కరణల అవసరముంది. అయితే అందుకు ముందుగా, ఇప్పటి వరకు వాటితో ఎదురవుతున్న దుష్పరిణామాల విషయమై విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రతిపాదిత సంస్కరణల ఆవశ్యకతను వివరించడం పాలకుల విజ్ఞతాయుత కర్తవ్యం. ఇంతకంటే ముఖ్యం నిబద్ధత, నిజాయితీ. ఇవి లేకపోవడంతోనే అసలు సమస్య.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సైద్ధాంతిక పోరులో న్యాయకోవిదుడు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'గోవా తొలి లోకాయుక్తగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని నియమించాలనుకుంటున్నాను' అని 2013లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ పరిక్కర్ అధికారులకు, పాలక పార్టీ నేతలకు చెప్పినప్పుడు వారు ఆశ్చర్యపోయారు. 'అదేమిటి సార్, ఆయన ఆలోచనా విధానానికీ మన ఆలోచనా విధానానికీ ఏ మాత్రం సరిపడదు. ఆయన బీజేపీ భావజాలం అంటే ఇష్టపడరు. పైగా స్వతంత్రంగా ఆలోచిస్తారు' అని పార్టీ నేత ఒకరు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'లోకాయుక్త పదవిలో అలా స్వతంత్రంగా ఆలోచించేవారే కావాలి. నిక్కచ్చిగా, నిజాయితీగా వ్యవహరించేవారే ఆ పదవిని సరిగా నిర్వహించగలరు. అలాంటి పదవుల్లో ఉన్నవారు సిద్ధాంతాలకు అతీతంగా ఉండాలి. నేను ఎంతో మంది న్యాయమూర్తుల పేర్లను, వారి నేపథ్యాన్ని పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చాను' అని మనోహర్ పరిక్కర్ జవాబిచ్చారు. ఆ తర్వాత ఆయన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఫోన్ చేశారు. 'మిమ్మల్ని లోకాయుక్తగా నియమించాలనుకుటున్నాను. దయచేసి ఆ పదవి స్వీకరించండి' అని అభ్యర్థించారు. తన ఆలోచనా విధానం వేరని, తాను స్వతంత్రంగా వ్యవహరిస్తానని సుదర్శన్‌రెడ్డి చెప్పినా పరిక్కర్ వినలేదు. 'అవన్నీ నాకు తెలుసు..' అని ఆయన చెప్పారు. దీనితో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గోవా లోకాయుక్త చట్టం ప్రతినొకదాన్ని తెప్పించుకుని అధ్యయనం చేశారు. అందులో ఎన్నో లోపాలున్నాయని, ముఖ్యంగా ఈ చట్టం ప్రకారం ముఖ్యమంత్రిని విచారించే అధికారం లోకాయుక్తకు లేదని తెలుసుకున్నారు. ఆ చట్టాన్ని సవరిస్తేనే లోకాయుక్త పదవిని ఆమోదిస్తానని చెప్పారు. అందుకు పరిక్కర్ ఆమోదించడమే కాక ముఖ్యమంత్రిని కూడా దాని పరిధిలో చేర్చడంతో ఇక కాదనలేక జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆ పదవిని స్వీకరించారు. తన సిబ్బందిని తానే నియమించుకుంటానని చెప్పినా పరిక్కర్ అంగీకరించారు. లోకాయుక్త పదవి స్వీకరించిన తర్వాత ఆయన మొదట మనోహర్ పరిక్కర్‌పై వచ్చిన ఆరోపణలనే విచారణకు స్వీకరించి సీఎంను తన కార్యాలయానికి పిలిపించారు. పరిక్కర్ ఏ మాత్రం సంకోచించకుండా ఎటువంటి మందీ మార్బలం లేకుండా వచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్ల లోకాయుక్త పదవిలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎక్కువ కాలం ఉండలేదు. అయితే తాము నియమించిన వారందరూ తమకు జీ హుజూర్‌గా ఉండాలని భావించే నేటి రాజకీయ నాయకుల్లో ఎందరు మనోహర్ పరిక్కర్ లాగా ఉంటారు? ఎందరు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి లాగా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు?

ఉప రాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి ప్రకటించింది. ఇవాళ ఒక చారిత్రక నేపథ్యంలో జరుగుతున్న ఎన్నిక ఇది. కొద్ది రోజుల క్రితం వరకు ఉప రాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే రాజీనామా చేశారు. ఈ హఠాత్పరిణామం, ఇప్పటి వరకూ ఒక రాజ్యాంగ హోదాగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి పదవి విలువపై చర్చకు దారితీసింది. మరో రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్ పనితీరుపై దాదాపు నెలరోజులుగా వర్షాకాల సమావేశాలు స్తంభించి పోయాయి. ప్రజల ఓట్లనే కొల్లగొడుతున్నారంటూ ప్రతిపక్షాలు వీధి ఆందోళనలకు దిగాయి. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీకి నిలబెట్టేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఎంపిక చేసింది. అయితే నెగ్గుకు రాగలదని చెప్పలేం. గెలుపోటములతో నిమిత్తం లేకుండా ఈ పోటీని సంకేతాత్మక సైద్ధాంతిక పోరుగా మార్చేందుకు, తమ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమ నిర్ణయం దోహదపడుతుందని ఆ కూటమి నేతలు భావిస్తున్నట్లు కనపడుతోంది.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గతంలో ఉపరాష్ట్రపతి పదవి నిర్వహించిన మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హిదయతుల్లా బాటలో నడిచిన న్యాయకోవిదుడు. గోలక్‌నాథ్ కేసులో అప్పటి సీజే కోకా సుబ్బారావుకు బాసటగా నిలిచి ప్రాథమిక హక్కులను పార్లమెంట్ సవరించడానికి వీల్లేదని జస్టిస్ హిదయతుల్లా స్పష్టంగా చెప్పారు. పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించినా సరే, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను కుదించే హక్కు దానికి లేదని, ఎందుకంటే పార్లమెంటు కూడా రాజ్యాంగం ప్రకారం ఏర్పడినదేనని చెప్పిన న్యాయమూర్తి జస్టిస్ హిదయతుల్లా. ఆయన నిర్వహించిన ఉపరాష్ట్రపతి పదవికి దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పోటీ చేయించేందుకు ఇండియా కూటమి నిర్ణయించడం విశేషం. ఎందుకంటే సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న నాలుగున్నరేళ్ల కాలంలో అప్పటి యూపీఏ ప్రభుత్వ నిర్ణయాలు చాలా వాటిని తప్పుపట్టారు. 'సహజవాయువు ప్రజలకు చెందుతుంది. దాన్ని వెలికితీసే కాంట్రాక్టర్ రిలయన్స్ కావచ్చు కాని దాని ధర ప్రభుత్వం నిర్ణయించాల్సిందే'నని విస్పష్టంగా తీర్పు చెప్పిన బెంచ్‌లో ఆయన ఉన్నారు. విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న నల్లధనాన్ని తిరిగి రప్పించడంలో విఫలమైన ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక నేరస్థులపై ప్రభుత్వం మెతకగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. వారిపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను నియమించాలని ఆదేశించారు. 'ద కేసెస్ దట్ ఇండియా ఫర్ గాట్' (భారతదేశం మరిచిపోయిన కేసులు) అన్న పుస్తకంలో ప్రముఖ రాజ్యాంగ నిపుణుడు చింతన్ చంద్రచూడ్ ప్రస్తావించిన పది ముఖ్యమైన తీర్పుల్లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఇచ్చిన తీర్పు కూడా ఉన్నది. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లను ఆదివాసీలతోనే తుదముట్టించేందుకు ఏర్పర్చిన సల్వాజుడుంను రాజ్యాంగ వ్యతిరేకమని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సంచలన తీర్పు ఇచ్చారు. సామాన్యులను, ముఖ్యంగా చదువు రాని అమాయక ఆదివాసీ యువతను హింసాకాండకు పాల్పడేందుకు ప్రోత్సహించకూడదని, ఇలాంటి అనైతిక మార్గాలను రాజ్యాంగ విలువలు అనుమతించబోవని ఆయన విస్పష్టీకరించారు. నిజానికి పీయూసీఎల్ లాంటి పౌర హక్కుల సంస్థలో ఉన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఈ కేసును విచారించకూడదని ఒక అజ్ఞాత లేఖ వచ్చినప్పటికీ ఇరు పక్షాల న్యాయవాదులు ఆయన ఈ కేసును విచారించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రకటించడం విశేషం. 45వ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా అభిశంసనకు ఏడు ప్రతిపక్షాలు సమర్పించిన పిటిషన్‌పై రాజ్యసభ చైర్మన్‌గా ఉన్న నాటి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు నిర్ణయం తీసుకునేముందు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి న్యాయసలహాను తీసుకున్నారు. ఇప్పుడు అదే ఉపరాష్ట్రపతి పదవికి సుదర్శన్‌రెడ్డి పోటీలో ఉండడం యాదృచ్ఛికం.



ఎన్నికల కమిషన్ పనితీరుపై వర్షాకాల సమావేశాలు స్తంభించిపోయాయి. ప్రజల ఓట్లనే కొల్లగొడుతున్నారంటూ ప్రతిపక్షాలు ఆందోళనలకు దిగాయి. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీకి నిలబెట్టేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఎంపిక చేసింది. గెలుపోటములతో నిమిత్తం లేకుండా తమ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ నిర్ణయం దోహదం చేయగలదని ప్రతిపక్ష నేతలు భావిస్తున్నారు.

జగదీప్ దన్‌ఖడ్ స్థానంలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి పదవికి నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంపిక చేయడంలో ఆశ్చర్యం లేదు. మామూలుగా అయితే వాజపేయి – అద్వాణీ తరానికి చెందిన వారందరినీ తప్పించి తన టీమ్ వ్యక్తిని నియమించుకోవడం మోదీకి పరిపాటి. అయితే ఇటీవలి కాలంలో కీలకమైన పదవుల్లో ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారిని నియమించి ఆ సంస్థను సంతృప్తిపరిచే ప్రయత్నాలను మోదీ చేయడం మారుతున్న పరిస్థితులకు నిదర్శనం. 'బీజేపీకి ఆ అండదండలు అవసరం లేదు' అని పార్టీ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా గత ఏడాది అన్నప్పుడున్న పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులకూ తేడా కనిపిస్తోంది.

రాధాకృష్ణన్ సామాన్య వ్యక్తి కాదు. ఆయన 16 సంవత్సరాల చిరుప్రాయంలోనే ఆర్‌ఎస్‌ఎస్‌కు అంకితమయ్యారు. 'సంఘ్' తిరుప్పూర్ టౌన్ సంఘ చాలక్‌గా తర్వాత జిల్లా సంఘ్ చాలక్‌గా పనిచేసిన తర్వాత 1974లో ఎమర్జెన్సీకి ముందు జనసంఘ్‌లో చేరారు. 1980లో భారతీయ జనతా పార్టీ ఏర్పడ్డప్పుడు రాధాకృష్ణన్ అటల్ బిహారీ వాజపేయికి సహాయకుడుగా ఉన్నారు. బీజేపీ భావజాలానికి ఆయన నిబద్ధత తిరుగులేనిది. తమిళనాడులో 19 వేల కిలోమీటర్ల పాటు యాత్ర చేసి తమిళనాడులో బీజేపీ అంటే రాధాకృష్ణన్ అనేంతగా కృషి చేశారు. 1998లో రాధాకృష్ణన్ పోటీ చేసిన కోయంబత్తూర్ నియోజకవర్గంలో ప్రచారం చేసేందుకు బీజేపీ నేత లాల్ కృష్ణ అద్వాణీ వచ్చినప్పుడే ఆయన పాల్గొనాల్సిన ఎన్నికల సభలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ బాంబులు పేలి 85 మంది మరణించారు. ఒక పత్రికా విలేఖరికి ఇంటర్వ్యూ ఇవ్వడం వల్ల అద్వాణీ కోయంబత్తూర్‌కు ఆలస్యంగా వచ్చారు. ఆయనను రిసీవ్ చేసుకునేందుకు రాధాకృష్ణన్ విమానాశ్రయానికి వచ్చారు. వారిద్దరూ సకాలంలో సభకు చేరుకుని ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. సంఘ్‌ను రాధాకృష్ణన్ కోయంబత్తూర్‌లో బలోపేతం చేసినందుకే తీవ్రవాదులు ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నారనేది స్పష్టమయింది. ఆ ఎన్నికల్లో కోయంబత్తూర్‌లో హిందూ ఓట్లు సంఘటితమై రాధాకృష్ణన్ అఖండ మెజారిటీతో గెలిచారు.

రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడమే కాదు, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కూడా మోదీ తన ప్రసంగంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని, ఆ రాజ్యాంగాన్ని రూపొందించడంలో నెహ్రూ, పటేల్ లాంటి నేతల మేధస్సును ప్రశంసించడంతో తన ప్రసంగాన్ని మొదలు పెట్టిన మోదీ తర్వాత రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను కీర్తించారు. గతంలో వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు కూడా ఆర్‌ఎస్‌ఎస్‌ను తన ఆత్మగా అభివర్ణించినప్పటికీ ఎర్రకోటపై ఎప్పుడూ ఆ సంస్థను కొనియాడలేదు. ఆర్‌ఎస్‌ఎస్‌ను అతి పెద్ద ప్రభుత్వేతర సంస్థ(ఎన్జీవో)గా మోదీ అభివర్ణించడం ఆశ్చర్యకరం. మోదీ అభిప్రాయం ఎలా ఉన్నా, ఎన్జీవోగా మాత్రమే ఉండేందుకే సంఘ్ ఇష్టపడుతుందా అన్నది ప్రధానం.


(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఉద్యమ సాహిత్యానికి జీవగర్ర

తెలుగు సాహిత్యంలో ఉద్యమ సాహిత్యానికి ప్రత్యేక స్థానం కల్పించిన ప్రముఖ పరిశోధకుడు, రచయిత డా. కె. ముత్యం మన మధ్య నుంచి భౌతికంగా దూరమై నేటికి సంవత్సర కాలం. నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజా చైతన్యాన్ని రచనల ద్వారా వెలుగులోకి తెచ్చిన మహానుభావుడు. ఆయన జీవితం, రచనలు, పరిశోధనలు అన్నీ తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

1958 ఏప్రిల్ 14న నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం బాచనపల్లిలో జన్మించిన ముత్యం తెలుగు, ఇంగ్లీష్, సంస్కృతం, ఫిలాసఫీ, లింగ్విస్టిక్, ఎంఈడీ, ఎల్ఎల్‌బి విద్యను అభ్యసించి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ కోర్సులో శిక్షణ పొందాడు. అనేక కష్టనష్టాలను ఓర్చి ఆఖరికి శాతవాహన యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తొమ్మిదేళ్ళపాటు సేవలు అందించాడు.

ఉస్మానియా యూనివర్సిటీ పీడీఎస్‌యూ అభ్యర్థిగా 1981–82లో ప్రతిష్టాత్మకమైన ఆర్ట్స్ కళాశాల ప్రెసిడెంట్‌గా గెలుపొందాడు. అప్పట్లో ఆర్ట్స్ కాలేజి ప్రెసిడెంట్ అంటే ఎమ్మెల్యేతో సమానమైన గుర్తింపు ఉండేది. ముత్యం విద్యార్థి నాయకుడిగా ఎన్నికయ్యే నాటికి బీసీ, ఈబీసీలకు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు ఇచ్చేది కాదు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను కూడగట్టి ఉద్యమాన్ని లేవదీసి ప్రభుత్వం దిగొచ్చేలా చేసి, విద్యార్థుల డిమాండ్లను పరిష్కరింప చేశాడు. మొట్టమొదటగా బీసీ, ఈబీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రావడంలో విద్యార్థి నాయకుడిగా ముత్యానిది కీలక పాత్ర.



"మీకు పానం బాగలేకున్న ఎందుకు రాసుడు? హాయిగా రెస్ట్ తీసుకోవచ్చు కదా," అని ఎవరైనా అంటే, "ప్రజా జీవితంలో ప్రాణాలు కోల్పోయిన వీరుల త్యాగాలు వృథా కావడం నాకు ఇష్టం లేదు. నా బాధ్యతగా రాస్తున్న. మనం రాయకపోతే ఇంకెవరూ రాయరు," అని సున్నితంగా బదులిచ్చి, మరణించే వరకు రాస్తూనే ఉన్నారు కె. ముత్యం.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి బయ్యా సూర్య నారాయణ పర్యవేక్షణలో "శ్రీకాకుళ ఉద్యమం–సాహిత్యంపై దాని ప్రభావం" అనే అంశంపై పీహెచ్‌డీ చేసి పట్టా పొందారు. ఈ పరిశోధన ద్వారా ఉత్తరాంధ్రలో జరిగిన ప్రజా ఉద్యమాలు, వాటి సాహిత్య ప్రతిబింబాలను చారిత్రక, సామాజిక, సాంస్కృతిక కోణాల్లో విశ్లేషించారు. ఈ పరిశోధనకోసం క్షేత్ర పర్యటనలో భాగంగా శ్రీకాకుళంతో ఆయనకు విడదీయరాని బంధం ఏర్పడింది. పరిశోధన అనంతరం అందుకోసం రికార్డు చేసిన ప్రజా చైతన్య జీవితాలు, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక, జానపద ఘట్టాలు తన రచనల రూపంలో జీవం పోసుకున్నాయి. ఈ పాయలో నుంచి వచ్చినవే– 'శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం', 'సునాముది జీవధార', 'గరిమెళ్ళ సాహిత్యం – జాతీయోద్యమం' (రెండు సంపుటాలు), 'సుబ్బారావు పాణిగ్రాహి జీవితం–చరిత్ర', 'బంకుపల్లి మల్లయ్యశాస్త్రి జీవిత దృశ్యం', గంటి రాజేశ్వరరావు జీవితంపై 'ప్రవహిస్తున్న జ్ఞాపకం', 'స్వాతంత్ర్యోద్యమం – గరిమెళ్ళ', 'శిల్లా రాజుల రెడ్డి జీవితం – కవిత్వం', 'నేను శ్రీకాకుళం జయమ్మను'... మొదలైన రచనలు.

ముత్యం సాహిత్య కృషిని నిశితంగా పరిశీలిస్తే– శ్రీకాకుళ ఉద్యమ నేపథ్యంగా ఎంత రాశారో అంతే ఉధృతంగా తెలంగాణ ప్రాంత సాహిత్య కృషి గురించీ రాశారు. చిందు యక్షగాన కళాకారిణి చిందుల ఎల్లమ్మ జీవితాన్ని 'నేను చిందుల ఎల్లమ్మను' పేరుతో రచించారు. ఈ పుస్తకం పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయిలో పాఠ్యాంశంగా ఉండడం విశేషం. కానీ రచయితగా డా. కె ముత్యంను ఇంటర్మీడియట్ బోర్డు గుర్తించకపోవడం విచారకరం. ఇట్లా తెలంగాణ భాషా, చరిత్ర, సామాజిక, సాంస్కృతిక అంశాలపై ఎన్నో పుస్తకాలు తెచ్చారు. అట్లనే 'చిందుల ఎల్లమ్మ యాది', 'తెలంగాణ శాస్త్రాలు' పేరుతో నిజామాబాద్ ప్రాంత ఐదువేల సామెతలు సేకరించి ముద్రించాడు. 'శాయరి రామాయణం' (ప్రాంతీయ సంప్రదాయ సాహిత్యం) కొత్త ఛందస్సును వెలుగులోకి తెచ్చాడు. ఇంకా 'మట్టి రంగును ఎంచుకున్న కుంచె', 'బాచనపల్లి–తెలంగాణలో ఒక గుట్టల కింద పల్లె', 'సర్వదేవభట్ల రామనాథం జీవితం', 'పెండిప్రోలు', 'సోయం గంగులు', 'మేర మల్లేశం', 'పోరాట పాటలు', 'బత్తుల వెంకటేశ్వరరావు జీవన రేఖలు'... ఇవన్నీ తెలంగాణ ప్రాంతం నేపథ్యంగా వచ్చిన రచనలే. నిజామాబాద్ ప్రాంత జానపద పాటలను సేకరించి పెట్టాడు. ఇవి ఇంకా ముద్రణలోకి రావాలి.

ఇక శాతవాహన యూనివర్సిటీ తెలుగు విభాగం నుంచి తొమ్మిదేళ్ళ కాలంలో నాలుగు జాతీయ సెమినార్లు నిర్వహించి తెలంగాణ భాషను, చరిత్రను, సంస్కృతిని, అలభ్య గ్రంథాలను, శాసనాలను గ్రంథస్థం చేసాడు. ఆ క్రమంలోనే ఎందరో విద్యార్థులకు క్షేత్ర స్థాయి పరిశోధనలో శిక్షణ ఇచ్చాడు. బొడ్రాయి, గ్రామ దేవతల ఔన్నత్యాన్ని, అలభ్య గ్రంథాలను, శాసనాలను విద్యార్థుల చేత శోధింపచేశాడు. శాతవాహన యూనివర్సిటీ తెలుగు విభాగం తరపున 'ఉత్తర తెలంగాణ సంస్కృతి చరిత్ర' (2011), 'నేటి ప్రపంచీకరణలో తెలంగాణ భాష, తెలుగు భాష, గిరిజన భాషలు, ప్రామాణికత–అమలు–అస్తిత్వం', 'ఉత్తర తెలంగాణ పల్లె సంస్కృతి–శాతవాహన పరిశోధన వ్యాసాలు', 'తెలంగాణలో అలభ్య శాసనాలు, గ్రంథాలు' (2019) అనే ఉత్తమ గ్రంథాలను ప్రచురించాడు.

అలాగే 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్'లో శిక్షణ పొందిన ముత్యం ప్రజా కళాకారుల సాంస్కృతికోద్యమ కృషిని డాక్యుమెంటరీల రూపంలో ప్రజలకు అందించారు. 'జన జీవన గానం' పేరుతో ప్రజా కళాకారుడు కానూరి వెంకటేశ్వరరావు జీవితాన్ని చిత్రించాడు. 'కొండవీడు' పేరుతో రెడ్డి రాజుల పౌరుషాన్ని, ఔన్నత్యాన్ని నిర్మించాడు. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ లఘుచిత్రంగా రెండు నంది అవార్డులు ప్రకటించింది. నిజామాబాద్ ప్రాంత గ్రామ దేవత 'చిలుకల చిన్నమ్మ' జాతర మహాత్మ్యాన్ని రికార్డు చేశాడు. అంతే కాదు, సులభంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో జ్వాలాముఖి మొదలైన వారితో 'శ్రీకృష్ణుని బాల్య క్రీడలు', 'బెజ్జమహాదేవి', 'తిలక్–ఆర్తగీతం', 'శ్రీశ్రీ కవిత్వం' మొదలైన ఆడియో వీడియో పాఠాలు చెప్పించాడు. వీటిలో కొన్ని టీవీలో ప్రసారమైనాయి.

జీవిత చివరి అంకంలో ఆరోగ్యం సహకరించకున్నా, మంచం మీద ఉండి లేవలేని స్థితిలో కూడా మిత్రుల, విద్యార్థుల, కుటుంబ సహకారంతో ఏడెనిమిది పుస్తకాలు రచించాడు. "మీకు పానం బాగలేకున్న ఎందుకు రాసుడు? హాయిగా రెస్ట్ తీసుకోవచ్చు కదా," అని ఎవరైనా అంటే, "ప్రజా జీవితంలో ప్రాణాలు కోల్పోయిన వీరుల త్యాగాలు వృథా కావడం నాకు ఇష్టం లేదు. నా బాధ్యతగా రాస్తున్న. మనం రాయకపోతే ఇంకెవరూ రాయరు," అని సున్నితంగా బదులిచ్చి, మరణించే వరకు రాస్తూనే ఉన్నారు. "స్వేచ్ఛ కోసం మృతి చెందినవారు మౌనంగా నిద్రించరు; వాళ్ల స్వరం రచయితల గళంలో ప్రతిధ్వనిస్తుంది" అని సల్మాన్ రష్దీ అన్న మాటల్ని నిజం చేసిన గొప్ప రచయిత ముత్యం. ఆయన రచనలపై యూనివర్సిటీ స్థాయిలో పరిశోధనలు జరగాలి.

■ **డా. జీడి రమేష్**

(నేడు డా. కె ముత్యం ప్రథమ వర్ధంతి)

చైనా డ్యామ్‌తో జాగ్రత్త!

ఉగ్రవాదమే ఊపిరిగా జీవిస్తూ– నిరంతరం, నిరంతరాయంగా నెత్తుటేర్లు పారిస్తున్న పాక్‌కు గుణపాఠం చెప్పేందుకు భారత్ ఇటీవల సింధూ జలాలను బిగపట్టింది. పాక్ చిరకాల మిత్రదేశం చైనా– అందుకు తక్షణ ప్రతీకార చర్యగా ఇటీవల బ్రహ్మపుత్ర నదిపై బ్రహ్మాండమైన డ్యామ్ నిర్మాణానికి భారీ ఎత్తున ప్రారంభోత్సవం జరిపింది.


ప్రపంచంలోని దాదాపు 40 శాతం జనాభా 276 అంతర్జాతీయ నదీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తోంది. మొత్తం తాగు, సాగు యోగ్య జలాల్లో 60 శాతం అక్కడి నుంచే లభిస్తున్నాయి. వాటిలో వాటా కోసమే నీటిలో నిప్పులు. 170 బిలియన్ డాలర్ల (సుమారు 15 లక్షల కోట్ల రూపాయల) ఖర్చుతో బ్రహ్మపుత్ర (యార్లంగ్ జాంగ్బో) నదిపై చైనా చేపట్టిన మెడాగ్ డ్యామ్ నిర్మాణం పెను ప్రకంపనలు సృష్టిస్తున్న తీవ్ర విపరిణామం. భారత సరిహద్దుల వెంబడి టిబెట్ పీఠభూమిలో చైనా నిర్మిస్తున్న 60 వేల మెగావాట్ల పంచవర్ష ప్రాజెక్టు ఇది. 'దేశీయ ఆర్థిక అభివృద్ధి కోసమే ఈ భారీ డ్యాం' అని చైనా నమ్మబలుకుతున్నప్పటికీ, అంతరార్థం ఏమిటన్నది లోతుగా పరిశీలించాల్సిందే.

సరిహద్దు దేశాలతో డజన్లకొద్దీ నదులను చైనా పంచుకుంటోంది. వాటిలో చాలా భాగం ఎగువన ఉన్న చైనా నుంచి దిగువకు ప్రవహిస్తున్నవే. దాంతో ఆర్థిక, రాజకీయ, దౌత్య ప్రయోజనాల కోసం ఆ నదీ జలాలను వాడుకొనే అవకాశం చైనా చేజిక్కింది. ఇప్పుడు బ్రహ్మపుత్ర విషయంలోనూ చైనా అనేక ఇతర ప్రయోజనాలను అన్వేషిస్తూ ఉండొచ్చు కూడా. బ్రహ్మపుత్ర జలాల్ని చైనా ఈ డ్యామ్ ద్వారా అడ్డుకున్నా లేక హఠాత్తుగా వదలిపెట్టినా దిగువన ఉన్న అరుణాచల్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో వ్యవసాయం, జీవనోపాధులు కొంతమేరకు దెబ్బతినే ప్రమాదం ఉంది.

నదీ జల వివాదాలపై రెండు దేశాల మధ్య కొన్ని అవగాహన ఒప్పందాలు, నిపుణుల స్థాయి యంత్రాంగం ఉన్నప్పటికీ– అవేవీ క్రియాశీలంగా లేవు. బ్రహ్మపుత్ర నదీ జలాల వివరాల పేరిట ఇప్పటికే భారత్ కొన్ని కోట్ల రూపాయలను భారత్ నష్టపోయింది. ఆ అవగాహనకూ 2014తో కాలం చెల్లింది. ఇప్పటికే సొంత ఉపగ్రహ సమాచారం, రిమోట్ సెన్సింగ్‌పై భారత్ దృష్టి సారించాల్సి ఉంది. బ్రహ్మపుత్ర నదీ జలాల్లో 80 శాతం, ఆ నది భారత భూ భాగంలోకి ప్రవేశించాక హిమనీనదాలు, భారీ వర్షాలు, వరదల ద్వారా జమపడుతున్నవే. పైపెచ్చు చైనా నిర్మిస్తున్న మెడాగ్ మెగా డ్యామ్ ప్రధానంగా జల విద్యుత్ ఉత్పత్తి కోసమే. అందువల్ల, భారీ స్థాయిలో నదీ జలాల్ని అదే పనిగా నిలిపి ఉంచేసుకోవడం అసాధ్యం. ఒకవేళ కొంతమేరకు అడ్డుకున్నా, ఉన్నట్టుండి వదిలేసినా భయపడాల్సినంత భారీ స్థాయిలో విధ్వంసమేమీ జరగదు. కాల్వలు, విస్తృత నీటి పారుదల వ్యవస్థల నిర్మాణం, నిర్వహణ ఇలాంటప్పుడు మనకు కీలకం. ఇందులో భాగంగానే అరుణాచల్ ప్రదేశ్‌లోని సియాంగ్ జిల్లాలో బహుళార్థసాధక నీటి నిల్వ ప్రాజెక్టును ప్రతిపాదించారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న స్థానికులకు నచ్చజెప్పి, ఒప్పించగలిగితే– డ్యామ్ సంబంధిత భయాలకు, నష్టాలకు చెక్ పెట్టే దిశగా ఓ అవరోధాన్ని అధిగమించినట్లే!

– **పి. దత్తారాం ఖత్రీ,** సీనియర్ జర్నలిస్టు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





● పెసర్లంకను చుట్టుముట్టిన వరద నీరు

సస్పెన్షన్‌తో సరా?

● సొసైటీల్లో స్వాహాపై చర్యలు శూన్యం
● రికవరీలు లేకపోవడంతో రైతులు లబోదిబో

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల కోసం.. రైతులకు లబ్ధి చేకూరేలా.. రైతుల సేవలో.. ఉండాల్సిన సహకార సొసైటీలు స్కాంలకు కేంద్రాలుగా మారుతున్నాయి. రైతుల పేరుతో రూ.లక్షల్లో మొత్తంగా రూ.కోట్లలో దోచేసుకుంటున్నారు. అధికారమే అండగా.. అధికారుల సహకారంతో సొసైటీల్లో కుంభకోణాలు వెలుగుచూస్తున్నాయి. వివిధ సంఘాల్లో నిధులు స్వాహా చేసినట్లు విచారణలో వెలుగుచూసినా కఠిన చర్యలు లేవు. దీంతో రైతుల సొమ్ము స్వాహా పరిపాటిగా మారింది. సకాలంలో బాకీలు చెల్లించినా ఇంకా రుణదాతలుగా చూపిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గత వైసీపీ హయాంలో పెద్దఎత్తున నిధులు స్వాహా చేసినట్లు అక్రమాలు వెలుగుచూసినా చర్యలు శూన్యంగా ఉన్నాయి. వైసీపీ హయంలో జీడీసీసీబీ, సహకార బ్యాంకులోని కొందరు అధికారుల సహకారంతోనే తాము చెల్లించిన రుణాలను కాజేశారని రైతులు వాపోతున్నారు. రుణాల కుంభకోణాలపై జీడీసీసీబీ విచారణ జరిపినా ఉద్యోగులపై వేటుతో సరిపెడుతుందే కానీ కఠిన చర్యలు తీసుకోవడం లేదు. గత ఐదేళ్లుగా రుణాల పంపిణీ.. వసూళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ పేరుతోనే అధికారులు కాలం వెళ్లదీస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రైతుల నుంచి కాజేసిన సొమ్మును సదరు ఉద్యోగుల నుంచి రికవరీ చేసే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు.



జొన్నలగడ్డ సొసైటీ కార్యాలయం

రైతులు చెల్లించిన రుణాల సొమ్మును అనేక సొసైటీల్లో వారి పేర్లపై జమ చేయకుండా ఆయా ఉద్యోగులు జేబుల్లో వేసుకున్నారు. వాయిదాల చెల్లింపులకు సంబంధించి రసీదు అడిగితే ఇస్తానులే అంటూ దాటవేస్తూ వచ్చారు. రుణాలకు సంబంధించిన ఫైళ్లను కూడా మాయం చేసినట్లు సమాచారం. కొందరు బ్యాంకు అధికారుల సహకారంతోనే ఉద్యోగులు ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. స్కాంపై నిగ్గు తేల్చి బాధిత రైతులకు న్యాయం చేసే దిశగా డీసీసీబీ స్పందిస్తున్న తీరు అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ పరిస్థితుల్లో న్యాయం చేయాలని బాధిత రైతులు జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావును కోరుతున్నారు.

జొన్నలగడ్డలో రూ.కోటి స్వాహా

పల్నాడు జిల్లా (మిగతా 6వ పేజీలో)



కొల్లూరు : తిప్పలకట్ట వద్ద కోతకు గురవుతున్న భూములు



అరవింద వారధి వద్ద వరద ప్రవాహం

..మహోగ్రం

భారీ వర్షాలు.. ఎగువ నుంచి పోటెత్తుతోన్న వరద.. జలాశయాల నుంచి లక్షల క్యూసెక్కుల నీరు విడుదలతో కృష్ణమ్మ మహోగ్రంగా ప్రవహిస్తోంది. నదిలో గంటగంటకు ప్రవాహ ఉధృతి పెరిగిపోతోంది. కృష్ణమ్మ ఉరకలెత్తుతో సముద్రం దిశగా దూసుకెళ్తోంది. గట్లను తాకుతో ప్రవహిస్తుండటంతో నదీ తీర ప్రాంత గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. అమరేశ్వరాలయం సమీపంలో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చి మూడు కి.మీ వెడల్పుతో ప్రవహిస్తుంది. నదీ తీర ఏటి ఒడ్డున పంట పొలాలను ముంచేస్తూ కృష్ణమ్మ పారుతుంది. నీటి ప్రవాహం ఎక్కువయ్యే అవకాశం ఉందని అధికారుల హెచ్చరికలతో నదీ తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ఉపద్రవం ఎదురైనా ఆదుకునేలా అధికారులు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు.



సీతానగరం కొండపై నుంచి ప్రకాశం బ్యారేజి వరద ఉధృతి

పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

- నదీ తీర గ్రామాల్లో మళ్లీ వరద భయం
- సాగర్ నుంచి 4,09,506 క్యూసెక్కులు విడుదల
- ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 4,68,720 క్యూసెక్కులు
- రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రకాశం బ్యారేజీ
- నదిలో గంటగంటకు పెరుగుతున్న వరద.. అధికారులు అప్రమత్తం
- హార్బర్‌లో కొనసాగుతున్న 3వ నెంబరు ప్రమాద సూచక


కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, తెనాలి,తాడేపల్లి ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి 4,10,186 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నాగార్జున సాగర్ జలాశయం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా 4,09,506 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల అవుతుంది. ప్రకాశం బ్యారేజికి 4,73,065 క్యూసెక్కుల వరద వస్తుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4,68,720 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగరంలో కలిసేందుకు పల్లపు గ్రామాలు, పొలాలను చుట్టేస్తూ ఉకరకలెత్తుతూ కృష్ణమ్మ పరుగులు పెడుతూ ప్రవహిస్తుంది. సాగర్‌తో పాటు పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా (మిగతా 6వ పేజీలో)

ఈ మండలాల్లో.. హైఅలర్ట్

నదిలో వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ముప్పు ఉన్న మండలాల్లో విపత్తుల శాఖ హైఅలర్ట్ ప్రకటించింది. పల్నాడు జిల్లాలో దాచేపల్లి, గురజాల, మాచవరం, మాచర్ల, రెంటచింతల, అమరావతి, అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు, సత్తెనపల్లి మండలాలున్నాయి. గుంటూరు జిల్లాలో తాడేపల్లి, తుళ్లూరు, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర మండలాలను అప్రమత్తం చేశారు. బాపట్ల జిల్లాలో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, నిజాంపట్నం మండలాలను వరద ముప్పు ప్రాంతాలుగా గుర్తించారు.

భయం గుప్పెట్లో లంకలు

ఉధృతంగా ప్రవహిస్తోన్న నీటితో కృష్ణానదీ పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో ఉన్నారు. నీరు గంట గంటకు పెరుగుతుండటంతో ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పెనుమూడి వద్ద మెట్లదాకా నీరు ప్రవహిస్తుంది. కొల్లూరు-కొత్తూరులంక మార్గంలో నది మధ్యలో ఉన్న బాపట్ల జిల్లా చింతర్లంక, గుంటూరు జిల్లాలోని అన్నవరపు లంక మధ్య చప్టాపైకి వరద నీరు చేరడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. పోతార్లంక ఏటి ఒడ్డునున్న పొలాల్లోని అరటి, తమలపాకు, మొక్కజొన్న, పసుపు, కంద పంటలను నీరు ముంచేసింది. అరవింద వారది ఎగువన పడిన గండి నుంచి వరద పెసర్లంక గ్రామాన్ని చుట్టుముట్టింది. పెదపులివర్రు, ఓలేరు, ఘైనేనివారిపాలెం, రాజుకాల్వ, లక్ష్మీపురం, లంకెవానిదిబ్బ, ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు కరకట్టను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆర్సీ అధికారులు ఓలేరు వద్ద 2009లో పడిన గండిప్రాంతాన్ని ఇసుకబస్తాలతో బలపరుస్తున్నారు.



ఓలేరు వద్ద కరకట్టను ఇసుక బస్తాలతో బలపరుస్తున్న దృశ్యం

గుంటూరు రైల్వే డివిజన్‌కు కోత


● 630 కిలోమీటర్లకు తగ్గిపోనున్న పరిధి
● సికింద్రాబాద్ డివిజన్‌లోకి 142 కిలోమీటర్ల సెక్షన్
● చిన్నడివిజన్‌గా ముద్రపడి నిరాదరణకు గురౌతున్న గుంటూరు

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధి గణనీయంగా తగ్గిపోనున్నది. ఇప్పటికే చిన్న డివిజన్‌గా ముద్రపడి నిరాదరణకు గురౌతున్న గుంటూరుకు దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో కూడా సరైన ప్రాధాన్యం దక్కే అవకాశాలు కనిపించడం లేదు. ఇందుకు మూల కారణం విష్ణుపురం సమీపంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు సింగరేణి నుంచి బొగ్గు సరఫరా సులభతరం చేసేందుకు విష్ణుపురం నుంచి పగిడిపల్లి వరకు ప్రస్తుతం గుంటూరు డివిజన్‌లో ఉన్న సెక్షన్ మొత్తాన్ని సికింద్రాబాద్ డివిజన్‌లో కలిపేయబోతున్నారు. అలానే విష్ణుపురం - జాన్‌పహాడ్ సెక్షన్‌ని కూడా సికింద్రాబాద్‌కే ప్రతిపాదించారు. ఈ విధంగా ప్రస్తుత గుంటూరు డివిజన్ నుంచి 142 కిలోమీటర్ల సెక్షన్ సికింద్రాబాద్‌లోకి వెళ్లిపోతుంది. అందుకు ప్రత్యామ్నాయంగా ఒక్క కిలోమీటర్ అదనంగా సెక్షన్ కూడా గుంటూరుకు రాకపోతుండటంపై అసంతృప్తి వ్యక్తమౌతోన్నది.

తగ్గిపోనున్న ఆదాయ వనరులు

ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాల అభ్యంతరాలతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయనున్నారు. ఇందుకు సంబంధించి సవరించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) ఇప్పటికే రైల్వేబోర్డుకు చేరుకున్నది. అందులో గుంటూరు డివిజన్‌కు సరుకు రవాణా రూపంలో ప్రధానంగా వచ్చే ఆదాయం కలిగిన విష్ణుపురం - పగిడిపల్లి సెక్షన్‌ని తొలగిస్తూ ప్రతిపాదించారు. నల్గొండ, మిర్యాలగూడలో ఎఫ్‌సీఐ సైడింగ్‌లు, చిట్యాల, నాగిరెడ్డిపల్లి, విష్ణుపురం వద్ద ఉన్న సరుకు రవాణా హబ్‌లన్నీ ఇక గుంటూరు డివిజన్‌లో ఉండవు. గుంటూరు రైల్వే డివిజన్ 630 కిలోమీటర్ల రూట్, 818 కిలోమీటర్ల రన్నింగ్ ట్రాక్‌తో అవశేష డివిజన్‌గా మారుతుంది. ఇక కొత్త రైళ్లు, స్పెషల్స్ ప్రవేశపెట్టాలన్నా దక్షిణ మధ్య రైల్వే జోన్ దయాదాక్షిణ్యాల పైనే ఆధారపడక తప్పదు. జోనల్ ఇంటర్ ఛేంజ్ పాయింట్ కూడా సికింద్రాబాద్ డివిజన్ నడికుడి వద్ద నుంచి కంట్రోల్ చేయబోతున్నది. కనీసం దానిని కూడా గుంటూరు డివిజన్‌కు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో గుంటూరు, పల్నాడు ప్రాంతాల ఎంపీలు పార్లమెంట్‌లో, రైల్వే మంత్రితో మాట్లాడి డివిజన్ పరిధి తగ్గకుండా చూడాల్సిన అవసరం ఉన్నది.

క్యాన్సర్‌పై సర్వే



● ప్రాథమిక దశలోనే నియంత్రణకు చర్యలు
● 28 రకాల ప్రశ్నావళి.. రేపటి నుంచి సిబ్బందికి శిక్షణ

గుంటూరు మెడికల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ కేసుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో క్యాన్సర్ లక్షణాలతో ఉన్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక సర్వే చేపట్టనున్నది. వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి గురువారం నుంచి సెప్టెంబరు 20 వరకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం అక్టోబరులో ఇంటింటి సర్వే ప్రాంభమవుతుంది. గతంలో ఎన్‌సీడీ 3.0లో 225 ప్రశ్నలతో సర్వే నిర్వహించారు. కొత్తగా జరపబోయే సర్వేలో కేవలం 28 ప్రశ్నలతో ప్రశ్నావళిని రూపొందించారు.

కేసుల గుర్తింపే లక్ష్యంగా..

జిల్లాలో 2024 నవంబరులో జరిపిన ఎన్‌సీడీ 3.0 సర్వే ఫలితాలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను ప్రతిబింబించలేదని వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది. దీంతో ఎన్‌సీడీ 4.0 ద్వారా సర్వేను కేవలం క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిని మాత్రమే గుర్తించేందుకు పరిమితం చేయాలని నిర్ణయించింది. ఈ సర్వేలో మహిళల్లో ఓరల్, సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాల గురించి, పురుషుల్లో ఓరల్ క్యాన్సర్ లక్షణాలపై వివరాలు సేకరిస్తారు. ప్రాథమిక స్థాయిలో పరీక్షలు కూడా చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో సీహెచ్‌వోలు, పట్టణ ప్రాంతాల్లో ఏఎన్‌ఎంలు సర్వేలో పాల్గొంటారు. సర్వేలో అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తే వారిని స్థానిక వైద్యులు మళ్లీ పరీక్షిస్తారు. నిర్ధారిత పరీక్షల అనంతరం వీరిని గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రిలో ప్రివెంటివ్ మెడికల్ ఆంకాలజీ యూనిట్‌కు పంపుతారు.

కొరత సృష్టిస్తే లైసెన్స్ రద్దు

● వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు



గుంటూరు సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి అయితా నాగేశ్వరరావు వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా రైతుల అవసరాలకు తగినంత యూరియా, డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మార్క్‌ఫెడ్ దగ్గర ఐదు వేల మెట్రిక్ టన్నులు, డీలర్ల వద్ద మూడు వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం రోజుకు 500 టన్నులు మాత్రమే యూరియా వినియోగిస్తున్నారని తెలిపారు. తగినంత నిల్వలు ఉన్నా కొందరు డీలర్లు యూరియాను ఎక్కువ ధరకు విక్రయించే ఉద్దేశంతో కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా కనిపిస్తుందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏ గ్రామానికి అయినా యూరియా అవసరమైతే డీడీలతో సంప్రదిస్తే 24 గంటల్లో నిల్వలు సరఫరా చేరుస్తామని తెలిపారు. వారం రోజుల్లో మరో రెండు ర్యాక్ ల యూరియా జిల్లాకు వస్తుందన్నారు.

మంగళగిరిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

● మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు 8
● నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



మంగళగిరి బైపాస్‌లోని మయూరి టెక్ పార్కు

అంబటి మురళి, జగన్ మీడియాపై కేసు నమోదు 6

నేటి నుంచి కోర్టులో ఉద్యోగాలకు రాత పరీక్షలు

టీడీపీ నేతలపై హత్యాయత్నం కేసు కొట్టివేత



కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు(లీగల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్‌తో పాటు 25 మంది నమోదైన హత్యాయత్నం కేసును కొట్టివేస్తూ గుంటూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎ.కమలిని మంగళవారం తీర్పు చెప్పారు. 2021లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ రోజు తమపై దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, చల్లా శేషిరెడ్డి తదితరులు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం 27 మంది టీడీపీ నాయకులపై నమోదైన ఈ కేసును సరైన సాక్షాధారాలతో రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని భావించి న్యాయమూర్తి కేసు కొట్టివేశారు.

నేటి నుంచి కోర్టులో ఉద్యోగాలకు రాత పరీక్షలు

గుంటూరు(లీగల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో జూనియర్ అసిస్టెంట్, స్టెనో గ్రాఫర్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ సబార్డినేట్, డ్రైవర్ తదితర పోస్టుల్లో నియామకాలకు బుధవారం నుంచి ఈ నెల 24 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. కల్యాణ చక్రవర్తి పలు సూచనలు చేశారు. 15 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఐడీ ప్రూఫ్‌తో పాటు హాల్ టికెట్‌ను కచ్చితంగా తీసుకురావాలని పేర్కొన్నారు. హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్‌లో సాంకేతిక సమస్యలు ఎదురైతే, హెల్ప్ డెస్క్ 0863 2372752 నంబరును సంప్రదించాలన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఫైనల్ అని వైవా-వోస్ ఉండదన్నారు. నైపుణ్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. నైపుణ్య పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు తగిన సమయంలో సమాచారం ఇస్తామని తెలిపారు. నిర్దిష్ట వైకల్యం ఉన్నవారు సహాయకుల కోసం అభ్యర్థిస్తే.. ప్రొవిజియో ఫ్రైమ్ టీసీఎస్ సెంటర్ ఇన్‌చార్జి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

ఫిలాటలీ స్కాలర్‌షిప్‌కి దరఖాస్తుల ఆహ్వానం


గుంటూరు(తూర్పు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ దీన్ దయాల్ స్పర్శ్ యోజన ద్వారా నిర్వహించే ఫిలాటలీ స్కాలర్‌షిప్‌కి 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల ఎంపికకు పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గుంటూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఎలమందయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పేర్లతో పాటు పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ చిరునామాకు సెప్టెంబరు 16వ తేదీ లోపు పంపాలన్నారు. 30న రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఫిలాటలీ ప్రాజెక్టు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6 వేలు ఉపకార వేతనం అందిస్తామని తెలిపారు.

21, 22న ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంలో ఉన్న శ్రీ అనంతలక్ష్మి స్పిన్నింగ్ మిల్లులో ఈ నెల 21, 22 తేదీల్లో బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సామినేని చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సామినేని కోటేశ్వరరావు తెలిపారు. సామినేని చారిటబుల్ ట్రస్ట్, కాకతీయ ఫౌండేషన్ సహకా రంతో అత్యాధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ జరిగితే తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తారన్నారు. శిబిరానికి హాజరైన వారికి ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 88865 19121, 99121 17887 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

● 50 రోజులు విస్తృత ప్రచారం



గుంటూరు మెడికల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన, ప్రచార కార్యక్రమాలను మంగళ వారం నుంచి ప్రారంభించారు. గుంటూరు జిల్లాతో సహా రాష్ట్రంలో వంద వేల గ్రామాల్లో ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శాక్స్) ఆదేశాల మేరకు జిల్లాలో 50 రోజుల పాటు ప్రచార కార్యక్రమాలు ఉధృతంగా నిర్వహిస్తా మని (ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్) జిల్లా ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. దేశం లో ఇటీవల జరిగిన సర్వేలో యువతలో 24 శా తం, యువకుల్లో 35 శాతం మందికి మాత్రమే హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన ఉంది. మిగిలిన వారికి పెద్దగా అవగాహన లేదని తే లింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 12న అంతర్జాతీ య యువజన దినోత్సవం సందర్భంగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) నిర్దేశించిన లక్ష్యం మేరకు దేశవ్యాప్తంగా యాభై రోజుల హెచ్‌ఐవీపై అవగాహన, ప్రచార కార్యక్రమాలకు పిలుపు నిచ్చింది. జిల్లాలో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 15 నుంచి 24 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులకు వివిధ రూపాల్లో హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తారు. సోషల్ మీడియా, ఆల్ ఇండియా రేడియో, దూర దర్శన్, ఎఫ్ఎం రేడియో, 12 ప్రధాన రైల్వే స్టేషన్లలో ఆడియో క్లిప్స్, కరపత్రాలు, స్టిక్కర్లు, హోర్డింగ్‌ల ద్వారా ప్రచారం చేస్తారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో మొబైల్ వ్యాన్లు, చంద్రన్న సంచార చికిత్స వాహనాలతో ప్రత్యేక శిబిరాలను నిర్వహించి హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తారు. కళాశాలల్లో యువతకు హెచ్ఐవీపై అవగాహన కల్పించేందుకు రెడ్ రిబ్బన్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తారు. కళాశాల విద్యార్థులకు హెచ్ఐవీపై వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ తదితర పోటీలను నిర్వహిస్తారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినమైన డిసెంబర్ ఒకటిన జరిగే కార్యక్రమంలో వీరికి బహుమతులు ప్రదానం చేస్తారు.

సస్పెన్షన్‌తో సరా..

(5వ పేజీ తరువాయి)

పరిధిలోని జొన్నలగడ్డ సొసైటీలో రుణాల కుంభకోణంపై జీడీసీసీబీ విచారణ చేపట్టగా రూ.కోటి స్వాహా అయి నట్టు సమాచారం. రైతులకు చెల్లించిన రుణాలు బ్యాంకులో జమ చేయకుండా సొసైటీ కార్యదర్శి సద్యాల వీరారెడ్డి, ఉద్యోగి తనబుద్ది కృష్ణారెడ్డి స్వాహా చేసినట్లు విచారణలో అధికారులు తేల్చారు. సదరు ఉద్యోగులను సస్పెండ్ చేసి జీడీసీసీబీ అధికా రులు చేతులు దులుపుకున్నారే కానీ మోసపో యిన రైతులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవన్న విమర్శలున్నాయి. విచారణ నివేదికను గోప్యంగా ఉంచడంపై అనుమానాలకు తావిస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

సహకార సంఘాల ద్వా రా రైతులకు ఏటా రుణాలు పంపిణీ చేస్తారు. ఇందుకు సంబంధించిన జాబితా డీసీసీబీ ప్రధాన కార్యా లయంలో ఉంటుంది. ఏటా సొసైటీ రుణాలపై ఆడిట్ చేయాలి. రికార్డులు, రసీదు పుస్తకాలను తనిఖీ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో నిర్వహిస్తే రుణాల పంపిణీ, వసూళ్లలో అక్రమాలకు తావు ఉండదు. సొసైటీల వారీగా ఉన్న బకాయిలపై ప్రత్యేకం గా విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాంట్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్(కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

గత ప్రభుత్వ వైఫల్యమే పంట పొలాలకు ముప్పు



మాట్లాడుతున్న కృష్ణా వెస్టర్న్, డెల్టా వైస్ ఛైర్మన్ నువ్వుల సునీల్ చౌదరి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో చేసిన తప్పుల ఫలితంగానే పొన్నూరు నియోజకవర్గంలో పంట పొలాలు ముంపునకి గురవుతున్నాయని కృష్ణా వెస్టర్న్, డెల్టా వైస్ ఛైర్మన్ నువ్వుల సునీల్ చౌదరి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలతో పొన్నూరు నియోజకవర్గం మొత్తం మునిగి పోయిందని వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. అంబటి రాంబాబు మంత్రిగా ఉన్నప్పుడు కనీసం కాలువ మరమ్మతులు కూడా చేయలేదన్నారు. చిన్న అంబటి, పెద్ద అంబటి నీటి సంఘాలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు రాజధాని అమరావతి నుంచి నీళ్లను పొన్నూరు నియోజకవర్గానికి మళ్లించారని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే సాగు కాల్వలకు మరమ్మతులు చేపట్టారన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ముంపు పంట పొలాలను పరిశీలించి వెంటనే వాటిని పూడ్చాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. ఇటువంటి ప్రచారాలు చేస్తే అంబటి సోదరులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు జొన్నల మురళీకృష్ణ రెడ్డి, దుద్దుకూరి భూషిబాబు, డి పవన్ కుమార్, జి.రామకృష్ణ, కాసుల హరిబాబు, మోపర్తి శ్రీనివాసరావు, మైలా సుబ్బారావు పాల్గొన్నారు.

స్వల్పకాలిక వరి పైరు సాగు చేసుకోవాలి

● వ్యవసాయశాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యనారాయణ



నీట మునిగిన వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పొన్నూరుటౌన్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంట కో ల్పోయిన రైతులు స్వల్పకాలిక వరి పైరు నాటుకుంటే.. సకాలంలో పంట చేతికి వస్తుందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాల యం శాస్త్రవేత్త డాక్టర్ పి.వి సత్యనారాయణ అన్నారు. మండల పరి ధిలోని గొల్లమూడిపాడు, దండమూడి, పచ్చలతాడిపర్రు, నిడుబ్రోలు గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను మంగళవారం శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. రైతులకు పలు సూచనలను సభ్యులు చేశారు. పైరు దెబ్బతిన్న పంట పొలాల్లో ఎన్ఐఆర్ 3354, ఆర్ఎన్ 51 5088, ఎంటీయూ 1282, 1224 రకాలు తెచ్చుకొని పలుచగా నా టుకోవాలని సూచించారు. వెద పైరు కుళ్లిన ప్రాంతాల్లో స్వల్పకాలిక వరి నారు తెచ్చుకొని నాటుకోవాలని సూచించారు. అలాగే పూర్తిగా దెబ్బతిన్న పొలాలను దమ్ము చేసుకొని.. మొలకెత్తిన విత్తనాలను వెద జల్లుకోవడంతో త్వరగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వర్షాలకు ముందు ఎరువులు వేయని పొలాల్లో పంట దెబ్బ తినలేదన్నారు. ప్ర ధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.మోహన్ రెడ్డి, డాక్టర్ ఎస్.ప్రతిభాశ్రీ, డాక్టర్ ఆర్.కృష్ణనాయక్, డాక్టర్ పి.కిషోర్‌శర్మ, డాక్టర్ రాజేష్ చౌదరి, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

..మహోగ్రం

(5వ పేజీ తరువాయి)

అధికారులకు దిగువకు విడుదల చేస్తున్నారు. బుధవారానికి వరద ప్రవాహం 5.5 లక్షలకు చేరే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలకు కలెక్ట ర్ల ఆదేశాలు జారీ చేశారు. ముంపుతో బాపట్ల జి ల్లాలో అత్యధిక నష్టం ఏర్పడే పరిస్థితి ఉండటంతో కలెక్టర్ వెంకటమురళి అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రధాన ఘాట్ల వద్ద సిబ్బంది ని కాపలా ఉంచారు. వరద ఉధృతికి పంట భూము లు భారీగా కోత పడుతున్నాయి. గ్రామాలకు వెళ్లే రోడ్లపైగా, చప్టాలను ముంచేస్తూ కృష్ణమ్మ ప్రవాహం తో కొన్ని లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపో యాయి. ఎక్కడికక్కడ పోలీసు, రెవెన్యూ, పంచాయ తీరాజ్ అధికారులు నదిలో నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కరకట్ట పొడవునా గండ్లుపడే ప్రమాదం ఉన్న చోట్ల అధికా రులు ఇసుక మూటలు సిద్ధం చేస్తున్నారు. అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా రాత్రి పూట గస్తీని పెంచారు. లంక భూముల్లోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. బుధవారానికి రెండో ప్రమాద హెచ్చరికకు చేరువలో బ్యారేజీ వద్ద ప్రవా హం పెరిగే పరిస్థితి ఉండవచ్చని అధికారులు అంచ నా వేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో 3వ రోజు మంగళవారం 3వ నెంబరు ప్రమాదసూచిక కొనసాగుతుంది.

ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి అనగాని

ప్రజలు ఆందోళన చెందొద్దని, సోషల్ మీడి యాలో జరిగే వదంతులను నమ్మవద్దని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఎటువం టి విపత్తులనైన ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తుఫాన్ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చెయ్యాలని అధికా రులకు సూచించారు. కరకట్ట వెంబడి ఉన్న పరిస్థి తిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికా రులను ఆదేశించారు. లోతట్టుప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు.

9 అడుగుల ఎత్తులో ప్రవాహం..

ఎగువ జలాశయాల కంటే, ప్రకాశం బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతంలో పడిన వర్షాలకు వస్తున్న వరద నీరే ఎక్కువగా ఉంది. మున్నేరు, కీసర వాగు ల నుంచి 17,590 క్యూసెక్కులు, పాలేరు నుంచి 5,625 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజికి చేరు తోంది. అత్యధికంగా పులిచింతల నీటితో కలిపి వజి నేపల్లి వాగు నుంచి 3,86,730 క్యూసెక్కుల వరద బ్యారేజికి చేరుతోంది. మంగళవారం 4,73,065 క్యూ సెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజికి చేరుకోగా 4,68,720 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ 69 గేట్లను 10 అడుగుల మేర పైకి లేపి నీటిని వదులుతుండ టంతో నదిలో నీటి ప్రవాహం 9 అడుగుల ఎత్తులో ఉంది. వరద ప్రమాద హెచ్చరికలు మైకు ద్వారా చేశామని, తీరంలోని గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలు, పోలీసు సిబ్బందిని, నీటిపారు దల శాఖల అధికారులను సమ న్వయ పరిచి, ముంపు ఏర్పడే ప్రాంతాలను గుర్తించి, ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతా లకు తరలించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ చెప్పారు.

నేటి నుంచి డైట్ సెట్ వెబ్ ఆప్షన్స్

గుంటూరు (విద్య) ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డైట్ సెట్ వెబ్ ఆప్షన్స్ కౌన్సెలింగ్ బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి సీట్లకు..ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తామని వివరించారు. సెప్టెంబర్ ఒకటిన తరగతుల ప్రారంభమవుతాయని వివరించారు.

అంబటి మురళి, జగన్ మీడియాపై కేసు నమోదు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఆగస్టు19(ఆంధ్రజ్యో తి): వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ, జగన్ మీడియాపై చేబ్రోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో చేబ్రోలు మండలంలో రికార్డు స్థాయిలో 23.4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదయింది. ఈ ప్రభావంతో మండలంలో పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఈ నీట మునిగిన పంట పొలాలను పరిశీలించడానికి ఈ నెల 16న విచ్చేసిన అంబటి మురళీకృష్ణ కొండవీటి వాగు ప్రవాహాన్ని పొన్నూరు పై వదిలివేయడంతోనే పంట పొలాలు నీట ముని గాయని మాట్లాడారు. అంబటి మురళి చేసిన ఈ వ్యాఖ్యలు అసత్యాలని, ఈ వ్యాఖ్యలు ఆధారంగా సా క్షి చానల్‌లో అసత్య కథనాలను ప్రసారం చేశారని దీంతో రైతులు భయభ్రాంతులకు గురై ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు అప్పాపురం చానల్ ఇన్‌చార్జి వెంకట రమణ చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఈ రమణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటకృష్ణ అంబటి మురళి, జగన్ మీడియాపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

దోమ కాటుతో ఐదు రకాల వ్యాధులు

గుంటూరు మెడికల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దోమ కాటును నివారిస్తే డెంగీ, మలేరియా, మెదడు వాపు, చికున్ గున్యా తదితర ఐదు రకాల ప్రమాదకరమైన వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. విజయలక్ష్మి తెలిపారు. బుధవారం వరల్డ్ మస్కిటో డే సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రచార చిత్రాలు, ఫ్లెక్సీని ఆమె ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్ బాబు, డీఐవో డాక్టర్ ఎ.శ్రావణిబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, డీహెచ్‌ఎన్‌వో డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగుల ఫిర్యాదులను పరిష్కరిస్తాం

● హెచ్‌డీఎస్ సభ్యుడు డాక్టర్ ఉమాశంకర్ వెల్లడి

గుంటూరు మెడికల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సును సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, ఆసుపత్రి అభివృద్ధి సంఘం సభ్యుడు, గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ సమక్షంలో మంగళవారం తెరిచారు. ఓపీ విభాగంలోని ఈ బాక్సులో మొత్తం పది ఫిర్యాదులు అందాయి. చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యుల నుంచి ఆసుపత్రిపై అందే ఫిర్యాదులను స్వీకరించేందుకు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఈ బాక్సును ఏర్పాటు చేయించారు. డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ఫిర్యాదులను పరిశీలించామని, త్వరలో జరిగే ఆసుపత్రి అభివృద్ధి సమావేశంలో చర్చించి తగిన విధంగా పరిష్కరిస్తామని తెలిపారు. అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



అందిన ఫిర్యాదులతో ఉమాశంకర్, రమణ యశస్వి

జీతాలు జమ చేయడంలో ఎస్టీవో నిర్లక్ష్యం : ఎస్టీయూ

గుంటూరు (విద్య) ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బదిలీలు పొందిన ఉపాధ్యాయుల జీతాలు జమ చేయడంలో ఎస్టీవోలు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఎస్టీయూ అధ్యక్ష కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ నెలకి జీత భత్యాలు రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఎస్టీవోలు ఉపాధ్యాయులకు జమ చేయడం జరిగిందన్నారు. కానీ, దుగ్గిరాల మండల పరిధిలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు, బదిలీల సమాచారం అందలేదనే కారణంగా సదరు ఎస్టీవో జీతాలు జమ చేయడం లేదని ఆరోపించారు. ఈ విషయమై ప్రశ్నిస్తే.. ఎస్టీఓ కక్షపూరితంగా హెచ్‌ఎంలపై కోత విధించారన్నారు. దుగ్గిరాల మండలంలోని చింతలపూడి, కొల్లిపర మండలంలోని నిర్రిపురంలో పనిచేసే ఉపాధ్యాయులకు జారీ చేసిన నోటీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు డీటీఓ చంద్రశేఖర్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు. కొర్రి విజయ్‌కుమార్, శ్యాం బాబు, వెంకయ్య, రాజు, ప్రకాశరావు, అన్వర్ బాషా పాల్గొన్నారు.



డీటీఓ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అర్చకుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళ్తా

● బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్

గుంటూరు సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నో సంవత్సరాల నుంచి అపరిష్కృతంగా ఉన్న అర్చకుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్ హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం అర్చక జేఏసీ బృందం రాష్ట్ర నాయకులు తనను కలిసిన సందర్భంగా ఆయన ఈ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉన్న అర్చకులకు టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని అర్చక జేఏసీ బృందం రాష్ట్ర నాయకులు జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి, ఎం. ఏ.శేషాచార్యులు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బుచ్చిరాంప్రసాద్‌ను అర్చక జేఏసీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏ.అక్కయలింగ శర్మ, టి.రామకృష్ణమాచార్యులు, వైకుంఠ ప్రసాద్, ఎస్ సర్వేశ్వర శర్మ, యేడిద చక్రవర్తి, జి.కృష్ణమాచార్యులు, ఏ.రవికుమార్, దేవి రఘురాం, ఎన్.శేషగిరిరావు, బి.గోపీచంద్, సీహెచ్ శేషాచార్యులు, వి.రామానుచార్యులు, వై అంజనేయులు, డి.వాసుదేవ చార్యులు, డి.చక్రధరమ్, శ్రీనివాసాచార్యులు, అనంత చక్రవర్తి, తరుణ్ పాల్గొన్నారు.



బుచ్చి రాంప్రసాద్‌ను సన్మానిస్తున్న అర్చక జేఏసీ బృందం రాష్ట్ర నాయకులు జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి, ఎంఏ శేషాచార్యులు తదితరులు

శోభాయమానంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత మండపాల్లో గణేష్ ఉత్సవాలు శోభాయమానంగా నిర్వహించాలని గణేష్ ఉత్సవ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రరాజు అన్నారు. మంగళవారం బ్రాడీపేట విద్యా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితో ఎవరికి ఇబ్బంది లేని విధంగా మండపాలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి శ్రీలక్ష్మీపతి మాట్లాడుతూ గణేష్ ఉత్సవ సమితి సంప్రదిస్తే ప్రభుత్వ అనుమతులు ఇప్పిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 81064 33594 నంబరుకు సంప్రదించాలని సూచించారు. మదన్ పురోహిత్, హరిహరనాయుడు, ప్రవీణ్ కుమార్, కందుల అంజనేయులు, రవి శ్రీనివాస్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రరాజు

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వార్డుల వారీగా అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన మంగళవారం శ్రీనివాసరావుతోట, సాయి నగర్, పొత్తూరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నాణ్యత ప్రమాణాలు పాటించని ప్రాంతాల్లో సంబంధిత అధికారులు, కార్యదర్శులే బాధ్యత వహించాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో చెత్త కుప్పలు, బ్లాక్ స్పాట్స్ లేకుండా ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించారు. పీజీఆర్ఎస్‌కి పొత్తూరు నుంచి ఇచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ వెంకటరమణ ఉన్నారు. అన్న క్యాంటీన్లకు వచ్చే ప్రజల అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా తీసుకోవాలని కమిషనర్ అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. మిర్చి యార్డు దగ్గరలోని క్యాంటీన్‌ని ఆయన పరిశీలించారు. ప్రజాభిప్రాయంతో మెనూ, సమయాలు మార్పులు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నోడల్ అధికారులు తమకు కేటాయించిన క్యాంటీన్లలో మౌలిక వసతులు, ఆహార సరఫరా ఇండెంట్లను పరిశీలించాలన్నారు.



మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు



మంతెన వెంకట సత్యనారాయణ రాజును సత్కరిస్తున్న దాసరి రాజా మాస్టారు

సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్‌కు సత్కారం

గుంటూరు(తూర్పు),ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం కార్యక్రమాల కో-ఆర్డినేటర్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ రాజును రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాస్టారు మంగళవారం ఘనంగా సత్కరించారు. పశ్చిమ గోదావరి జిల్లా లోని ఉండి మండలం, పాందువ్వ గ్రామానికి చెందిన రాజు కష్టపడి ఈ స్థాయికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఇంతటి గౌరవం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, కిలారు రాజేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

గుంటూరు (విద్య) ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీహెచ్ వెంకట్ సూచించారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. విద్యార్థినులు క్రమశిక్షణ పాటిస్తూ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జ్యోత్స్న కుమారి, యువజన సంక్షేమ శాఖ మేనేజర్ బి.రాధిక, మానవతా సేవ సంస్థ ప్రతినిధులు సాంబశివరావు, విజయ్, ప్రత్యూష సుబ్బారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

24న టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ పరీక్షలు

గుంటూరు (విద్య) ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్స్ లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలు ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాలలో రెగ్యులర్, ఒకసారి తప్పిన అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. సంబంధిత హాల్ టికెట్లను బీఎస్సీ ఏపీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకుని ఏదైనా ఒక గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జియావుద్దీన్

గుంటూరు(లీగల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో మంగళవారం న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభించారు. కార్యాలయ సిబ్బంది, మాజీ సైనిక ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించి ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా లీగల్ ఎయిడ్ క్లినిక్ ను సంప్రదించాలన్నారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో న్యాయ సేవలు అందించేందుకు గాను ప్యానెల్ అడ్వొకేట్‌గా పి.రాజేష్ లింగం, పారా లీగల్ వలంటీర్ గా పి. శిరీషలను నియమించారు. సైనిక సంక్షేమ ఆఫీసర్ ఆర్.గుణశీల, మాజీ సైనిక ఉద్యోగులు, లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సిల్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా అవకతవకలపై సీఈసీ సమాధానం చెప్పాలి

● కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల బయటపెట్టిన ఓటర్ల జాబితా అవకతవకలపై కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) స్పష్టమైన సమాధానం చెప్పాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పిలుపు మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఓట్ చోర్ గద్దీ చోర్ అనే నినాదంతో ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి హిమనీ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. పూలమాలలతో నివాళులర్పించి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. గత ఎన్నికల్లో లక్షల దొంగ ఓట్లతో కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చిందని రాహుల్‌గాంధీ ప్రశ్నిస్తే సీఈసీ వద్ద సరైన సమాధానం లేదన్నారు. బీహార్‌లో 65 లక్షల పైచిలుకు ఓట్లు తొలగించారని దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఓట్ల అవకతవకలపై రాహుల్‌గాంధీ చేస్తోన్న ఉద్యమానికి ప్రజలు మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్ శ్రీపతి ప్రకాశం, బిళ్ళా సునీల్, గడ్డం పాల్ విజయ్‌కుమార్, సలీమ్, గాదె నాగేశ్వరరావు, తోడేటి సందీప్, బ్రహ్మం, షేక్ ఉస్మాన్, అడుసుమల్లి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నేడు సంజీవయ్యనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సంజీవయ్యలోని పినపాటి ప్రభుదాసు మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. గాలి ప్రభుదాసు, చింతా బుజ్జినానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో చేపడుతున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు, న్యాయవాది గాలి అశోక్ ఆనంద్ తెలిపారు.

అమ్మవారికి గంధంతో అభిషేకం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అరండల్‌పేటలోని అష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి 30వ కోటి కుంకుమార్చన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం శ్రీ చక్ర మహామేరుకు అభిషేకాలు, శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అభిషేకార్చనలు, మండపారాధనలు జరిగాయి. అనంతరం అమ్మవార్లకు 108 కిలోల గంధంతో అభిషేకం నిర్వహించారు.

కొల్లి శారద మార్కెట్‌లో రికార్డు వేలం..!

● షాపునకు రూ.1.06 లక్షలు ● నేటితో ముగియనున్న వేలం

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో 83 షాపులకు బహిరంగ వేలం పాటలను జీఎంసీ అధికారులు రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. తొలి రోజు 27 షాపులు, రెండో రోజు 25 షాపులకు బహిరంగ వేలం జీఎంసీ కౌన్సిల్ హాలులో నిర్వహించారు. మొటి రోజు కొన్ని షాపులకు హెచ్చుపాట రూ.69 వేలు కాగా, ఎస్సీ, ఎస్టీలు రూ.8 వేలకే పాడుకున్నారు. రెండోరోజు మంగళవారం హెచ్చుపాట రూ.1.06 లక్షలు కాగా కొన్ని షాపులకు ఎస్సీ, ఎస్టీలు రూ.10 వేలకు పాడారు. జీఎంసీ చరిత్రలో కొల్లి శారద మార్కెట్‌లోని 43వ నంబరు షాపునకు రికార్డు స్థాయిలో హెచ్చు పాడటం ఇదే మొదటిసారి. దీంతో భారీగా ఆదాయం వస్తున్నట్లు జీఎంసీ అధికారులు భావిస్తున్నారు. బుధవారంతో ఆయా షాపుల టెండర్ కమ్ బహిరంగ వేలం ముగుస్తుంది.

ది సీటీ ఎన్‌జీవో అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

● రెండోసారి అధ్యక్షుడిగా సయ్యద్ జానీబాషా

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ది కమర్షియల్ టాక్స్ ఎన్‌జీవో అసోసియేషన్ గుంటూరు-2 డివిజన్ కార్యవర్గం ఎన్నిక మరోసారి ఏకగ్రీవమైంది. జిన్నాటవర్ సెంటర్‌లోని వసుంధర భవన్‌లో ఈ కార్యక్రమం జరిగినట్లు ఎన్నికల అధికారి ఎస్.నరసింహారావు తెలిపారు. అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడుగా సయ్యద్ జానీబాషా వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా డీవీ కోటేశ్వరరావు సహాధ్యక్షుడిగా ఎం. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా సీహెచ్ బాలకృష్ణ (చీరాల) పి మల్లికార్జునరావు (నరసరావుపేట) ఆర్గనైజింగ్ సెక్రటరీగా చాముండేశ్వర రావు, జాయింట్ సెక్రటరీగా సయ్యద్ ఖాదర్ బాషా (బాపట్ల) పి.చంద్ర కాంత్ (సత్తెనపల్లి) కోశాధికారిగా వి.శ్రావణి (కొత్తపేట సర్కిల్) ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికలకు అసోసియేషన్ నెల్లూరు డివిజన్ అధ్యక్షుడు ఎస్.నరసింహారావు అధికారిగా, ఉపాధ్యక్షుడు సుధాకర్ సహాయ ఎన్నికల అధికారిగా, ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్‌రావు పరిశీలకుడిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి జిల్లా ఏపీ ఎన్జీవో నాయకులు ఘంటసాల శ్రీనివాసరావు, శ్యాంసుందర్ శ్రీనివాస్, నాగూర్ షరీఫ్, సూరి, కళ్యాణ్ కుమార్, సేల్స్ ట్యాక్స్ ఆడిటర్ల సంఘం నాయకులు రామరాజు శ్రీనివాసరావు, దామచర్ల శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా వీరభద్రస్వామి పల్లెర జాతర

● పల్లకీ మోసిన గుంటూరు, పల్నాడు ఎస్పీలు

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్రీ వీరభద్ర స్వామి 24వ పల్లెర జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా వీరభద్రస్వామి పల్లెర జాతరను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. గుంటూరు, పల్నాడు జిల్లాల ఎస్పీలు సతీష్ కుమార్, కంచి శ్రీనివాసరావు పాల్గొని స్వామి వారి పల్లకీ మోశారు. ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన, కంకణ ధారణ, మండపారాధన, అఖండస్థాపన, పంచగవ్య ప్రాసన.. అనంతరం వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్ల కలశస్థాపన, పంచామృతాభిషేకం, మహారుద్రాభిషేకం నిర్వహించారు. సమస్త పోలీసుల ఉద్యోగ శాంతి, ప్రజా రక్షణ, సర్వదోష పరిహారార్థం అఘోర శాంతి రుద్రహోమం నిర్వహించారు. స్వామివారి నోటికి ఆనకట్టుపట్టడం, బియ్యం కొలత, పూజ, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాదాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) హనుమంతు ఆధ్వర్యంలో, జిల్లా ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు.



స్వామి వారి పల్లకి మోస్తున్న గుంటూరు, పల్నాడు ఎస్పీలు సతీష్‌కుమార్, కంచి శ్రీనివాసరావు


కారు అద్దాలు పగలగొట్టి రూ.3.80 లక్షల చోరీ

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పార్కు చేసిన కార్ల అద్దాలు పగలగొట్టి అందులో విలువైన నగలు, నగదు దోచుకుంటున్న ముఠా కార్యకలాపాలు కలకలం రేపుతున్నాయి. తాజాగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని పాత పెట్రోల్ బంక్ వద్ద పార్కు చేసిన కారు అద్దాలు పగలగొట్టి ఏకంగా రూ.3.80 లక్షల నగదు అపహరించుకుపోయారు. పట్టాభిపురంలోని రవీంద్ర నగర్ ఒకటో లైన్‌కి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి కట్టా నిర్మల్‌కుమార్‌ది ఆ కారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమీపంలోని పాత పెట్రోల్ బంకులో ఆయన తన కారు పార్కింగ్ చేసి, డాక్యుమెంట్ రైటర్ వద్దకు వెళ్లారు. తిరిగి కారు వద్దకు రాగా.. అద్దాలు పగలుగొట్టి కార్లో ఉన్న బ్యాగ్‌ను అపహరించుకుపోయారు. ఆ బ్యాగులో రూ.3.80 లక్షలు నగదు ఉన్నట్లు బాధితుడు తెలిపారు. అతని ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లికార్జునపేటలోని డాక్టర్ పీనపాటి ప్రభుదాస్ హైస్కూల్‌కు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను దివంగత ఉపాధ్యాయురాలు పూనూరి రాములమ్మ కుటుంబ సభ్యులు మంగళవారం అందజేశారు. 250 మంది విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం వీటిని ఇచ్చారు. కార్యక్రమంలో మల్లవరపు రాజు, తుమ్మేటి శ్రీనివాస్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గొర్రెపాటి అచ్యుతరావు, ఎలక్ట్రికల్ ఏడీఈ ఆనందరావు, టీ.కృష్ణ, పాఠశాల హెచ్‌ఎం కిశోర్‌బాబు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా కోటా మాల్యాద్రి



కోటా మాల్యాద్రి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శిగా కోటా మాల్యాద్రి ఎన్నికయ్యారు. నగర కార్యదర్శిగా ఉన్న ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శులుగా మేడా హను మంతరావు, చిన్ని తిరుపతయ్యను ఎన్నుకున్నారు. మాల్యాద్రి మాట్లాడుతూ జిల్లాలో సామాన్య ప్రజల పక్షాన ఉంటూ, రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడమే లక్ష్యమన్నారు. నూతన నాయకత్వాన్ని రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



ఎమ్మెల్యే మాధవిని సత్కరిస్తున్న బీసీ నాయకులు

టీడీపీ, బీసీలది విడదీయరాని బంధం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ బీసీలకు పుట్టినిల్లు అని, వారిని రాజకీయంగా ప్రోత్సహించి చట్ట సభల్లో అడుగు పెట్టేందుకు ఎన్టీఆర్ చేసిన కృషి గొప్పదని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన యాదవ నేతల ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. నియోజక వర్గంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో బీసీల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. బీసీ భవన్ నిర్మాణానికి కార్యచరణ రూపొందిస్తామన్నారు. భవన నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. యాదవ సమాజం, బీసీల శ్రేయస్సు, అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమన్నారు. వారి గౌరవం, రాజకీయ ప్రాధాన్యం పెంపునకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ-4 విధానంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. అనంతరం బీసీ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. తాళ్ళ వెంకటేశ్ యాదవ్, అడకా శ్రీనివాస్, తేలుకుట్ల హనుమాయమ్మ, అడకా పద్మావతి, గాలం వెంకటేశ్వర్లు, తెల్లగొర్ల అప్పారావు యాదవ్, తుమ్మల నాగేశ్వరరావు, పేరయ్య, హనుమంతరావు, శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.

బుచ్చి రామ్‌ప్రసాద్‌కు సత్కారం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బుచ్చి రామ్‌ప్రసాద్‌ను పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. దుశ్శాలువాతో సత్కరించారు. ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను సమర్థంగా నిర్వహించి, ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలకు చేయూతనందించాలని ఆమె ఆకాంక్షించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు 15వ డివిజన్ టీడీపీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డివిజన్‌లోని మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు సూరె శ్రీనివాసరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మల్లెంపూడి శ్రీనివాసరావు, పుట్టగంటి వెంకటేశ్వరరావు, సూరం లక్ష్మీ, పాటిబండ్ల శ్రీనివాస్, షాజహాన్, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. స్థానిక హిందు కళాశాల వద్ద మంగళవారం ఆటో డ్రైవర్లు తలపెట్టిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వాహన మిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవరుకు రూ.25 వేలు అందజేయలన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబరు 21 రద్దు చేసి, పెనాల్టీలు, ఇన్సూరెన్స్ ప్రీమియంను తగ్గించాలన్నారు. లేనిపక్షంలో ఈ నెల 24న ఒంగోలులో జరిగే ఆటో యూనియన్ రాష్ట్ర మహాసభలో చర్చించి దశల వారి ఆందోళన చేపడతామన్నారు. యూనియన్ నాయకులు మస్తాన్‌వలీ, లక్ష్మణరావు, జి.శంకరరావు, కె.కోటేశ్వరరావు, షేక్ ఖాసిం, అశోక్, షేక్ జానీ, వెంకటయ్య సాంబయ్య, సర్దార్ పాల్గొన్నారు.

ఈషా పౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో ఉండే యువతను ప్రోత్సహించేందుకు ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇషా ఫౌండేషన్ వాలంటీర్లు సాంబశివరావు, సుధాకరరావ్, దేవి శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న స్థానిక కళ్లం హరనాథ్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. 14 ఏళ్లు పైబడిన గ్రామీణ యువత ఈ పోటీలకు అర్హులని, క్లస్టర్ ఇతర వివరాలకు 98851 98095, 79814 27364 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందుతున్నారా..!

● ఈదర వీరయ్య

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పదవి విరమణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ విధాన సభ మూడు చట్టాలను ఆమోదించిందని పెన్షన్‌దారుల చర్చావేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఈదర వీరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పదవీ విరమణ వయస్సు: కార్మికుడు కాబట్టి, చివరి శ్రేణి సేవకు చెందినట్టి ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఆయనకు 58 సంవత్సరాలు వచ్చు నెలలోని చివరిరోజు సాయంత్రం సేవనుండి పదవీ విరమణ చేయాలి. కార్మికుడు కాకుండా చివరి శ్రేణి సేవకు చెందిన ప్రతి ఉద్యోగి ఆయనకు 60 సంవత్సరాల వయస్సు నెలలోని చివరి రోజు సాయంత్రం సేవ నుండి పదవీ విరమణ చేయాలి. సుపీరియర్ లేదా చివరి శ్రేణి సేవలోని /ఇంపీరియర్‌గా ప్రకటితమైన ఏదైనా ఇతర సేవలోని ప్రతి కార్మికుడు 60 సంవత్సరాల వయస్సు వరకు సేవలో సాధారణంగా ఉంచబడాలి. విధి నిర్వహణలో అసమర్థత లేక అలక్ష్యం మూలంగా గానీ ఆరోగ్యం క్షీణించిందనే కారణాన గాని ఒక నెల నోటీసు లేదా దాని బదులు ఒక నెల వేతనం ఇచ్చిన తరువాత 55 సంవత్సరాల వయస్సు వచ్చిన తరువాత ఏ సమయంలోనైనా ఎవరైనా కార్మికుని పదవీవిరమణ చేయమని కోరవచ్చని తెలిపారు. అయితే 55 సంవత్సరాల వయస్సు వచ్చిన తరువాత ఏ సమయంలోనైనా రాత పూర్వకంగా ఒకనెల నోటీసు ఇచ్చి కార్మికుడు పదవీ విరమణ చేయవచ్చన్నారు.

అయితే ఈ విభాగంలో కార్మికుడు అనే పదానికి ప్రభుత్వ పారిశ్రామిక లేదా వర్క్ ఛార్జ్ సిబ్బందిలోని బాగా నేర్పరులు లేదా పాక్షిక నేర్పరులు లేక నేర్పరి కానీ చేర్పరివారు అని అర్థమన్నారు. అనుమాన నివృత్తి కోసం, ఒక నెలలోని మొదటి తేదీ ఒక ప్రభుత్వ ఉద్యోగి జనన తేదీ అయినప్పుడు ఆయన అంతకు ముందు నెలలోని చివరి రోజు (58వ సంవత్సరం) సాయంత్రం లేదా 60 సంవత్సరాల వయస్సు వచ్చినందున సేవ నుండి పదవీ విరమణ చేయాలి. పదవీ విరమణ వయస్సు వచ్చిన ప్రభుత్వ ఉద్యోగిని న్యాయస్థానపు నిలుపుదల ఉత్తర్వుల మూలంగా ఆ తేదీ తరువాత కూడా పదవిలో కొనసాగుటకు అనుమతించినప్పుడు ఆ కాలంలో అమలులో ఉన్న ఏదైనా నియమంలో లేదా ఉత్తర్వులలో నిర్దిష్ట పరిచినట్లు ఆ పోస్టు ఛార్జి అప్పగించకుండా లేదా అనుదానితో సంబంధం లేకుండా తన దరఖాస్తును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిన తేదీ నుంచి ఆ పదవిలో కొనసాగుట నిలిచిపోయినట్టు, చేయబడినట్లు భావించాలన్నారు. భారత రాజ్యాంగంలోని 313వ ఆర్టికల్‌తో కలిపి చదివిన 309వ ఆర్టికల్ మినహాయింపు నిబంధన కింద పదవీ విరమణ వయస్సుకు సంబంధించిన మౌలిక నియామకాలకు జారీ చేసినా ఏ సవరణ చెల్లుబడి కానట్లు భావించరాదన్నారు. కేవలం సదరు నియమావళి మార్పు చేయరాదని, లేక ఉన్న వాటి బదులు కొత్త వాటిని చేర్చరాదని, ఆదేశించినంత మాత్రాన ఎప్పుడైనా చెల్లుబడి కాకుండా పోయినట్లు భావించరాదన్నారు.

- చవితి పూజలకు గణనాథుడి ప్రతిమలు..
- గతం కంటే మిన్నగా కమిటీల ఏర్పాట్లు



ఘననాథ

- పెరిగిన విగ్రహాల ముడి సరుకు ధరలు
- ఇప్పటికే 70 శాతం విగ్రహాల బుకింగ్



తెనాలి రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గణనాథుడు.. ఈసారి చవితి వేడుకల్లో మరింత ఘనంగా కనపడనున్నాడు. విఘ్నాలు తొలగించే వినాయక స్వామి ప్రతిమలను కొలువుదీర్చి.. పూజలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. వరసిద్ధుడి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిపేందుకు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా..అంతా ఏకమై పోటీ పడుతున్నారు. మరో వారంలో రానున్న వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ ఖర్చు.. ఈ ఏడాది అదనం కానుంది. గణనాథుడి విగ్రహాల ధరలు పెరగడంతో పాటు.. మండపం డెకరేషన్ ఖర్చులు కూడా బాగానే పెరిగాయి. విగ్రహాన్ని మండపంలో ఏర్పాటు చేసిన నాటి నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే పూజ సామగ్రి ఇతర ఖర్చులు కూడా అధికమవుతున్నాయి. వినాయకుడి బొమ్మల తయారీకి ప్రసిద్ధి చెందినది తెనాలి పట్టణం. తెనాలి - గుంటూరు రోడ్డులోని చెంచుపేట - అంగలకుదురు వద్ద కళాకారులు బొమ్మలను తయారు చేస్తున్నారు. తెనాలి, వేమూరు, చుండూరు, చేబ్రోలు, పొన్నూరు, దుగ్గిరాల, అమర్తలూరు, కొల్లిపర మండలాల్లోని గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు వీరిని సంప్రదిస్తున్నారు. ఇప్పటికే వివిధ ఆకృతుల్లో గణనాథుడి విగ్రహాలను తయారు చేసి ఉంచారు. ఎత్తు, ఆకారాన్ని బట్టి ధర నిర్ణయించి ఆర్డర్లు బుక్ చేసుకుంటున్నారు.



చవితి ఉత్సవాలకు రూపుదిద్దుకుంటున్న వినాయకస్వామి ప్రతిమలు

విగ్రహాలకు డిమాండ్

విగ్రహ తయారీ ముడి సరుకుల ధరలు పెరగడంతో.. గతేడాది కంటే ఎత్తును బట్టి ఈసారి విగ్రహాల ధర కూడా రూ. 2 వేలు పెరిగింది. దీంతో కమిటీ సభ్యులు ధరలు కాస్త తగ్గించాలని కోరుతున్నారు. తాము పడుతున్న శ్రమను గుర్తించాలని కళాకారులు చెబుతుండటంతో.. ఇక వారు కూడా వెనుకాడడం లేదు. రూ. 5 వేల నుంచి రూ.50వేల వరకూ వివిధ రకాల సైజుల్లో వినాయక స్వామి ప్రతిమలను తయారు చేసి ఉంచారు. ఇప్పటికే 70 శాతం విగ్రహాలను బుక్ చేసుకున్నారు.

మంగళగిరిలో రతన్ టాటా

ఇన్నోవేషన్ హబ్

- మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త

రాష్ట్ర ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయంగా ఉత్తమ విధానాలను ఉపయోగించి ఒక శక్తిమం తమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థని నిర్మిస్తోంది. సాంకేతిక పురోగతులు, మార్కెట్ మార్పులు, స్టా ర్టప్‌లు అభివృద్ధి చెందుతున్న అవసరాల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను అధిగమిస్తూ అంది వచ్చిన అవకాశాలను సమర్థంగా వినియోగించు కోవడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, దానికి అనుబంధంగా జోనల్ సెంటర్లను ఏర్పాటు చేసిం ది. ఇందుకోసం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్, స్టార్టప్ పాలసీ 2024-29ని కూడా ప్రారంభించింది. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబంలో ఒక వ్యాపా రవేత్త ఉండాలన్న లక్ష్యానికి అనుగుణంగా దీర్ఘకాలిక దృష్టితో ఈ పాలసీని రూపొందించింది.

మంగళగిరి, గుంటూరు ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో సరికొత్త ఆవిష్కరణల సంస్కృతిని ముందుకు తీసుకెళ్లడానికి, వినూత్న స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్) ఏర్పాటు చేసింది. మంగళగిరిలోని ఎన్‌హెచ్-16 పక్కన, జనసేన కార్యాలయానికి సమీపాన మయూరి టెక్ పార్కులో ఈ హబ్‌ని బుధవారం సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఈ హబ్‌కు అనుబంధంగా రాష్ట్రంలోని విశాఖప ట్టణం, రాజమహేంద్రవరం, ఎన్‌టీఆర్, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో రీజినల్ సెంటర్‌లు ఏర్పాటు అయ్యాయి. వీటిని వర్చువల్ విధానంలో మంగళగిరిలోని ఆర్‌టీఐహెచ్ నుంచి ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఇందుకోసం మయూరి టెక్ పార్కులో చేసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. మయూరి టెక్‌పార్కులోని నాల్గవ అంతస్తులో సుమారు 53 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో ఇంటీరియర్స్ అభివృద్ధి, ఇతరత్రా ఎలక్ట్రికల్ పనుల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.13.96 కోట్లను ఖర్చు చేసింది. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలు, రానున్న అయిదేళ్లలో లక్ష మంది యువతకు ఉద్యోగవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ఆర్‌టీఐహెచ్ నిర్మాణం, నిర్వహణ..

గత ఏప్రిల్ నెలలోనే ప్రభుత్వం ఈ ఆర్‌టీఐ హెచ్‌ని ప్రకటించింది. అమరావతిలో సెంట్రల్ హబ్ ఏర్పాటుతో స్టార్టప్‌లు, ఇతర సంస్థలకు ఇది మూల స్తంభంగా ఉంటుంది. సెంట్రల్ హబ్‌తో పాటు రీజనల్ సెంటర్లకు నిధులు సమకూర్చడం, వాటిని నిర్వహించడాన్ని ప్రైవేట్ సెక్టార్ చూసుకొంటుంది. ప్రభుత్వం ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో ద్వారా మూలధనం, నిధులు సమకూరుస్తుంది. ఆర్‌టీఐహెచ్, రీజనల్ సెంట ర్లకు పరిపాలకులుంటారు. ఒక ప్రమోటర్ (అధ్యక్షుడు) ఆర్‌టీఐహెచ్‌కు ఉంటారు. కో-ప్ర మోటర్లు, స్వతంత్ర కలిగిన నిపుణులు, ప్రభు త్వం, విద్యా సంస్థలు, పారిశ్రామిక అసోసియేషన్ల నుంచి ఇద్దరు ముఖ్యమైన వ్యక్తులు ఉంటారు. స్టార్టప్‌లకు ఆర్‌టీఐహెచ్ పెట్టుబడి, ఫైనాన్సింగ్, భాగస్వామ్యాలు, ఇంక్యుబేషన్, స్టేక్ హోల్డర్ మేనేజ్‌మెంట్, అకౌంటింగ్, మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్లు వంటివి కల్పిస్తుంది. ఈ హబ్ వలన దేశంలోని వివిధ సంస్థలు అమరావతి వైపు చూస్తాయని అధికారవర్గాలు తెలిపాయి. కాగా వివిధ కంపెనీలు రూపొందించిన రోబోలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.



కంపెనీలు రూపొందించిన రోబోని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రముఖ సంస్థల భాగస్వామ్యం

రాష్ట్రంలో సిలికాన్ వ్యాలీ తరహా ఎకో సిస్టంను అభివృద్ధి చేయడానికి ఈ హబ్‌లను రూపొందిస్తున్నారు. ఇందులో టాటా గ్రూపుతో పాటుగా ఎల్అండ్ టీ, రేమండ్, బిట్స్, అదానీ పోర్టు, ఓఎన్‌జీసీ, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వంటి ఎన్నో ప్రముఖ సంస్థలు భాగస్వాములుగా ఉంటాయి. సాంకేతిక రంగంలో సరికొత్త ప్రాజెక్టులను ఆవిష్కరించే యువ మేధావులను ఈ హబ్‌లకు తీసుకొచ్చి .. మరింత శిక్షణ, ప్రోత్సాహన్ని అందిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు వేల వరకు స్టార్టప్‌లు పనిచేస్తున్నాయి. వీటి సంఖ్యను వచ్చే అయిదేళ్లలో 20 వేలకు పెంచడం ద్వారా లక్ష మంది యువతకు ఉద్యోగవకాశాలను కల్పించాలన్నదే ప్రధాన ధ్యేయం. యువతలో వ్యక్తిత్వ వికాసం, పోటీ తత్వాన్ని పెంచడంతోపాటు వారిలో నైపుణ్యాభివృద్ధి మరింత వికసించేలా ఇన్నోవేషన్ హబ్ పనితీరు ఉండబోతోంది. క్వాంటమ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి వాటిల్లో స్టార్టప్‌లకు ఈ హబ్ సహకారాన్ని అందిస్తుంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఆక్వా, మెరైన్ రంగాల్లోనూ విశేష సేవలను అందించే అవకాశాలున్నాయి.

చెరువుజమ్ములపాలెంలో వర్షపు నీటి నుంచి బయటపడుతున్న వరి పైరు



వెద పైరు మునిగి..

నారు ధర పెరిగి!

బాపట్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు వెదపెట్టిన వరి పొలాలు మొత్తం నీట మునిగి పైరు దెబ్బతింది. దెబ్బతిన్న పొలాల్లో తిరిగి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దీంతో వరి నారుకు డిమాండ్ పెరిగింది. మళ్లీ నారు పోసి పెంచడానికి ఆలస్యమవుతుందని రైతులు భావిస్తున్నారు. మెరక భూముల్లో పెంచిన వరి నారు కొనుగోలుచేసి తెచ్చుకుంటున్నారు. వర్షానికి ముందు సెంటు నారు వెయ్యి రూపాయలకే పీకి బండికి వేసేవారు. ఇప్పుడు రూ.1600 నుంచి రూ.2వేల వరకు తీసుకుంటున్నారు. గరువు మెరక భూముల్లో నారు పెంచిన సన్న, చిన్నకారు రైతులు నారు ధర పెరగడంతో ఆనందంగా ఉన్నారు. నియోజకవర్గంలోని కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం, ఎం.వి.రాజుపాలెం, కొత్తనందాయపాలెం, పాతనందాయపాలెం, ఏట్రవారిపాలెం, యాజలి, బిడారుదిబ్బ, దిండువారిపాలెం, చందోలు, రాంభొట్లవారిపాలెం, చెరుకుపల్లి పరిసరప్రాంతాల్లో వరినారు విస్తారంగా పెంచారు. గతంలో వరి నారు పెంచిన రైతులు.. ఈ ఏడాది డిమాండ్ ఉండదని వేరుశనగ సాగు చేస్తున్నారు. తక్కువమంది నారు కట్టడం కూడా డిమాండ్‌కు ఒక కారణంగా చెప్పవచ్చు. కొంత మంది రైతులు పొలాలు దున్ని పూర్తిగా వరి నాట్లు వేస్తుండగా.. మరికొందరు దెబ్బతిన్న ప్రాంతంలో మాత్రమే నాట్లు వేస్తున్నారు.



నర్రావారిపాలెంలో నారు తీసుకెళ్తున్న రైతులు

జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌కు సాదియా

ఆర్థికసాయం అందించిన మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్‌మాస్ జూనియర్ వరల్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు కోస్టారికా దేశంలోని శాన్‌హోసే నగరంలో ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అందించారు. చాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి ఆర్థిక సహకారం అందించాలని సాదియా ఇటీవల మంత్రి లోకేశ్‌ను కలిసి కోరారు. తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్ ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట స్థానిక నేతల ద్వారా రూ.2.50 లక్షల సాయాన్ని మంగళవారం సాదియా అల్‌మాస్‌కు అందజేశారు. అడిగిన వెంటనే సాయం అందించిన మంత్రి లోకేశ్‌కు సాదియా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. సాదియా మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ అందిస్తున్న సహకారం మరువలేనని, గతంలో కూడా ఆయన రూ.3 లక్షల సాయం అందించి ప్రోత్సహించారని గుర్తుచేశారు. టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పడవల మహేష్, షేక్ రియాజ్, ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



సాదియా అల్‌మాస్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

వడ్రాణంకు సీఎం అభినందనలు



సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబునాయుడు, ఉద్ధవ్

గుంటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఈ దఫా అత్యధిక శాతం యూరియా, డీఏపీ ఎరువులు కేటాయింపులు చేయడంపై.. సీఎం చంద్రబాబునాయుడుకు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రిని హరిబాబు ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతు సోదరులకు అండగా నిలిచేందుకు డీసీఎంఎస్ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనుల గురించి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ ఇదే ఉత్సాహన్ని కొనసాగిస్తూ తెలుగుదేశం పార్టీని, ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం వడ్రాణం ఉద్భవ్ నాయుడు చేతుల మీదుగా ముఖ్యమంత్రికి జ్ఞాపికను హరిబాబు అందజేశారు.

26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



సాగర్ జలాశయానికి భారీ వరద

26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం శ్రీశైలం నుంచి 4,10,186 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 584.60 అడుగులు ఉంది. ఇది 296.28 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7,528, ఎడమ కాలువ ద్వారా 4,949, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,007, 26 క్రస్ట్ గేట్లను 10 అడుగులు మేర ఎత్తి 3,61,322 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 4,09,506 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్‌లో 19 రేడియల్ క్రస్ట్ గేట్ల నుంచి జాలువారుతున్న కృష్ణమ్మ

19 గేట్లు ఎత్తి..

రెంటచింతల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఎగువన ఎడతెరిపి లేని వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది. సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్ గేట్లలో.. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 19 క్రస్ట్ గేట్లను ఎత్తినట్లు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం చెప్పారు. 16 క్రస్ట్ గేట్లను 4 మీటర్లు, 3 క్రస్ట్‌గేట్లను 5 మీటర్ల మేర ఎత్తి 4,03,281 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి వచ్చే నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌లో 74.20 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.213 టీఎంసీలకు సమానం.. విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపి వేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 33.75 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 3,98,087 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా నాలుగు వందల, 15 గేట్ల ద్వారా 4,16,467, మొత్తం 4,33,467 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

చర్లపల్లి- తిరువారూర్ ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేళాంగిణి మేరీ మాత పండగ రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి - తిరువారూర్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07091 రైలు ఈ నెల 27, సెప్టెంబరు 8న ఉదయం 8.10కి బయలుదేరి 10.28కి నడికుడి, 10.58కి పిడుగురాళ్ల, 11.43కి సత్తెనపల్లి, మధ్యాహ్నం ఒంటి గంటకు గుంటూరు, 2 గంటలకు తెనాలికి చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం 10.30కి తిరువారూర్ చేరుకొంటుంది. నంబరు. 07092 రైలు ఈ నెల 28, సెప్టెంబరు 9వ తేదీల్లో రాత్రి 10.35కి బయలుదేరుతుంది. రెండో రోజున సాయంత్రం 5.28కి తెనాలి, 6.45కి గుంటూరు, రాత్రి 7.38కి సత్తెనపల్లి, 8.38కి పిడుగురాళ్ల, 9.28కి నడికుడి, రాత్రి 1.30కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

అక్టోబరులో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు

మూడో రైలుమార్గం నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా అక్టోబరు 14 నుంచి 18వ తేదీ వరకు సికింద్రాబాద్ - గుంటూరు - సికింద్రాబాద్(వయా వరంగల్, కాజీపేట) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 14 నుంచి 18వ తేదీ వరకు గుంటూరు - కాజీపేట మధ్యన రద్దు చేసి.. కాజీపేట - సికింద్రాబాద్ మధ్యన నడుపుతామన్నారు. 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని అక్టోబరు 13 నుంచి 17వ తేదీ వరకు కాజీపేట వరకే నడిపి నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు. కోణార్క్, ఈస్టు కోస్టు, సాయినగర్ షిర్డి - కాకినాడ, విశాఖ పట్టణం - ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లను గుంటూరు మీదగా దారి మళ్లించనున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
20 ఆగస్టు 2025

ఫ్యాషన్

కవ్వించే కుర్తా




పొట్టిగా, పొందికగా ఉండే షార్ట్ కుర్తాలు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. వీటిని సరైన బాటమ్స్‌తో జోడిస్తే సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా వెలిగిపోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం!

- జీన్స్, లెగ్గింగ్స్, జెగ్గింగ్స్ ధరించినప్పుడు సౌకర్యంగా ఉండే షార్ట్ కుర్తాలు వేసుకోవచ్చు
- కాటన్, సింథటిక్ మెటీరియల్స్‌లో దొరికే ఈ చిట్టిపొట్టి కుర్తాలు ఆకర్షణీయంగా, ఆధునికంగా ఉంటాయి
- సౌకర్యానికి పెద్ద పీట వేసే షార్ట్ కుర్తాలను లాంగ్ స్కర్ట్‌తో మ్యాచ్ చేయొచ్చు
- ఈవినింగ్ పార్టీలు, ఫ్రెండ్స్‌తో హ్యాంగవుట్స్‌కు షార్ట్ కుర్తాలు స్టైలిష్‌గా ఉంటాయి.



- లతలు, పువ్వుల డిజైన్లు ఉన్న షార్ట్ కుర్తాలు యాంకిల్ లెంగ్త్ జీన్స్‌కు చక్కగా సూటవుతాయి. పెన్సిల్ హీల్స్‌ను ఈ డ్రెస్‌కు మ్యాచ్ చేస్తే చూడముచ్చటగా కనిపిస్తారు
- సింపుల్‌గా, హుందాగా కనిపించాలనుకునేవాళ్లు షార్ట్ కుర్తాలను ఎంచుకోవచ్చు
- చికన్ వర్క్ కుర్తాల్లో షార్ట్ లెంగ్త్ కూడా ఉంటాయి. ఇవి కాలేజీ అమ్మాయిలకు చక్కగా సూటవుతాయి. సినిమాలు, షికార్లకు ఈ రకం కుర్తాలు అనువైన స్టైల్!





షార్ట్ కుర్తా ఫుల్ హ్యాండ్స్ వేసినా, షార్ట్ హ్యాండ్ ఉన్నా, స్లీవ్‌లెస్ అయినా... ఎలా ఉన్నా అందంగానే ఉంటుంది. కాబట్టి సందర్భాన్ని బట్టి అనువైన కుర్తా ఎంచుకోవాలి.

యాక్సెసరీస్ ఇలా...

- యాంటిక్ జ్యువెలరీ, ఉడెన్ లేదా టెర్రకోటా జ్యువెలరీ ఈ తరహా దుస్తులకు నప్పుతాయి
- స్లింగ్ బ్యాగ్ చక్కగా మ్యాచ్ అవుతుంది
- హై హీల్స్, ఫ్లాట్స్.. రెండు రకాల ఫుట్ వేర్ వేసుకోవచ్చు
- భారీ నెక్లెస్‌లూ, కడాలూ లాంటివి ధరించకపోవడమే మేలు

అభిరుచి

అనుష్కా జైస్వాల్... సగటు అమ్మాయిలకు భిన్నం... ఆలోచనల్లో... ఆచరణలో. చదువు అవ్వగానే ఉద్యోగాల వెంట పరిగెత్తలేదు. మంచి జీతంతో బడా కంపెనీల్లో స్థిరపడి పోయి... నలుగురిలో ఒకరిలా జీవితం గడపాలనీ అనుకోలేదు. ఎవ్వరూ ఊహించని విధంగా... వ్యవసాయాన్ని కెరీర్‌గా మలుచుకొని... అద్భుతాలు సృష్టిస్తున్నారు. రక్షిత సాగు చేపట్టి... విభిన్న పంటలు పండించి... ఏడాదికి కోటి రూపాయలు సంపాదిస్తున్నారు. మరికొంతమంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ... వారిని సాధికారత వైపు నడిపిస్తున్న 28 ఏళ్ల అనుష్క కథ ఇది.



సాగు పథంలో... 'జై'త్ర యాత్ర

"అది 2017. ఢిల్లీ నగరం... హిందూ కాలేజీలో ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ జరుగుతోంది. దాని కోసం విద్యార్థులందరూ కొన్ని రోజులుగా తీవ్ర స్థాయిలో సన్నద్ధమవుతున్నారు. ఎలాగైనా మంచి కంపెనీలో ఉద్యోగం దక్కించుకోవాలన్న పట్టుదల వారిలో. ఒక పక్కన కూర్చొని అందరినీ గమనిస్తున్నాను. కానీ ఎందుకో నేను పెద్దగా ఆసక్తి చూపలేదు. నేను కోరుకున్నది ఇలా కూర్చొని చేసే రొటీన్ ఉద్యోగం కాదనే స్పష్టత ఉంది. మరి నా మనసు ఏం కోరుకొంటోంది? అప్పటికి అంతుపట్టలేదు. ఏదైతేనేం... క్యాంపస్ ఇంటర్వ్యూ వదిలేశాను. విశేషం ఏంటంటే... కాలేజీ ప్లేస్‌మెంట్ సెల్ అధ్యక్షురాలిని నేనే. 'మంచి అవకాశం వదిలేసుకున్నావ'ని స్నేహితులు అన్నారు. కావచ్చేమో! అలాగని మనసుకు నచ్చని పని చేయలేను కదా! అందుకే ఎకనామిక్స్‌లో డిగ్రీ తీసుకొని హిందూ కాలేజీ నుంచి బయటకు వచ్చాను.

మిద్దె తోటతో మొదలైంది...

డిగ్రీ తరువాత ఫ్రెంచ్ భాష నేర్చుకోవాలన్న ఉద్దేశంతో ఢిల్లీలోని 'సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ'లో చేరాను. కొన్నాళ్లు తరగతులకు వెళ్లాను. అదీ నచ్చలేదు. ఏంచేయాలో తోచక మా స్వస్థలం... ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూకు వచ్చేశాను. ఖాళీగా ఉండడంతో మా మేడ మీద పూలు, టమాటా తదితర కూరగాయల మొక్కలు వేశాను. సరదాగా మొదలైన వ్యాపకం... ఇష్టంగా మారిపోయింది. విత్తు వేయడం, మొక్క పెరగడం, ప్రతిఫలం చేతికి రావడం... ఒక బిడ్డకు జన్మనిచ్చి, పెంచిన అనుభూతి కలిగింది. మనసుకు ఎంతో ఆహ్లాదంగా, ఆనందంగా అనిపించింది. ఆ క్షణమే నిర్ణయించుకున్నాను... ఇకపై నా కెరీర్ వ్యవసాయంలోనే అని. విషయం మా అన్నయ్యకు చెబితే... తను మరింత ప్రోత్సహించాడు. అలా నా ఆలోచన మిద్దె తోట నుంచి వ్యవసాయం వైపు మళ్లింది.

అధ్యయనం తరువాత...

అన్నయ్య అండతో వ్యవసాయం చేయాలని అనుకున్నాను. కానీ నాకు దాని గురించి ఓనమాలు తెలియవు. మాది రైతు కుటుంబం కాదు. అందుకే నోయిడాలోని 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ టెక్నాలజీ'లో చేరాను. దాంతోపాటు పూర్తి స్థాయి అవగాహన కోసం మరికొన్ని అనుబంధ కోర్సులు చదివాను. అంతర్జాలంలో విస్తృతంగా అధ్యయనం చేశాను. ఈ క్రమంలోనే రక్షిత సాగుపై ఆసక్తి కలిగింది. అలా 2020లో ఒక ఎకరం పొలం తీసుకొని పాలీహౌస్ ఏర్పాటు చేశాను. మొదట ఇంగ్లీష్ కీరదోస పండించాను. తరువాత వివిధ రకాల క్యాప్సికమ్ వేశాను. సాధారణ రైతుల కంటే రెట్టింపు ఉత్పత్తి సాధించాను. నాలుగేళ్లలో నా పేరు లఖ్‌నవూతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని వారికి కూడా పరిచయమైంది.

విభిన్న పంటలు...

ఆశించిన దానికంటే అధిక ఉత్పత్తి రావడంతో మరో ఐదు ఎకరాల భూమి తీసుకున్నాను. అందులో క్యాప్సికమ్, కీరాతో పాటు చైనా క్యాబేజీ, పాలకూర లాంటివి సాగు చేస్తున్నాను. వచ్చిన ఉత్పత్తిని 'బ్లింకిట్, బిగ్ బాస్కెట్' తదితర ఆన్‌లైన్ స్టోర్స్‌లకు విక్రయిస్తున్నాను. కొంత దిగుబడిని లులూ మాల్ తరహా సూపర్ మార్కెట్‌లకు విక్రయిస్తున్నాను. ఈ ప్రయాణంలో నాకు అర్థమైంది ఏంటంటే... భవిష్యత్ రక్షిత సాగుదే. ముఖ్యంగా చిన్నతరహా రైతులకు ఎంతో ప్రయోజనకరం. తక్కువ నీటి వినియోగంతో పాటు వాతావరణ మార్పులకు తట్టుకొని నిలబడగలదు. నిదానంగా పుట్టగొడుగుల సాగు కూడా మొదలుపెట్టాను. రక్షిత సాగువల్ల రైతుకు శ్రమ తగ్గుతుంది. వరదలు, తుపానులకు పంట కొట్టుకుపోకుండా నికర రాబడి లభిస్తుంది. ఎరువులు లేకుండా సేంద్రియ పద్ధతిలో పండించడంవల్ల మంచి మార్కెట్ ఉంటుంది.

> **మొదట్లో నేను వ్యవసాయం చేస్తానంటే... 'ఆడపిల్లవు... నీవల్ల ఏమవుతుంది' అన్న వారు ఉన్నారు. మా ప్రాంతంలో సాగు అంటే మగవారే. అలాంటిచోట నేను పొలంలోకి దిగి, ప్రయోగాత్మక విధానాలతో ఎరువులు లేకుండా అధిక దిగుబడి సాధిస్తున్నాను. ఒక మహిళగా ఇది నేను సాధించిన విజయం. అందుకు గర్వపడుతున్నా."**



సందేహించినవారే...

ప్రస్తుతం ఏడాదికి 210 టన్నుల క్యాప్సికమ్ పండిస్తున్నాను. టర్నోవర్ కోటి రూపాయలు దాటింది. ముప్ఫై మంది నాతో కలిసి పని చేస్తున్నారు. వారిలో అత్యధికం మహిళలే. నేను నేర్చుకున్నది ఆసక్తి గల మహిళలు అందరికీ నేర్పిస్తున్నా. తద్వారా మరికొంతమంది ఆడపిల్లలు, మిద్దె తోట పెంచుతున్న వారు... వ్యవసాయాన్ని కెరీర్‌గా ఎంచుకొనే అవకాశం కలుగుతుంది. ఈ మధ్యనే రకరకాల పూలు, పండ్ల మొక్కలతో నర్సరీ ఏర్పాటు చేశాను. మొదట్లో నేను వ్యవసాయం చేస్తానంటే... 'ఆడపిల్లవు... నీవల్ల ఏమవుతుంది' అన్నవారు ఉన్నారు. మా ప్రాంతంలో సాగు అంటే మగవారే. అలాంటిచోట నేను పొలంలోకి దిగి, ప్రయోగాత్మక విధానాలతో ఎరువులు లేకుండా అధిక దిగుబడి సాధిస్తున్నాను. ఒక మహిళగా ఇది నేను సాధించిన విజయం. అందుకు గర్వపడుతున్నా."

బాలికల భవిష్యత్తుకు భరోసా

పద్నాలుగేళ్లకే పెళ్లి... మరో ఏడాదికే బిడ్డ బాధ్యతలు... నిత్యం భర్త వేధింపులు... అన్నిటినీ తట్టుకొని, పరిస్థితులకు ఎదురుతిరిగారు రోషిణీ పర్వీన్. మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడంతో పాటు... బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను చాటి చెబుతూ బాలికలను అప్రమత్తం చేస్తున్నారు. ఆమె అవిశ్రాంత కృషి అంతర్జాతీయంగా ప్రశంసలు పొందుతోంది...

"బిహార్ రాష్ట్రంలోని సిమల్‌బరీ అనే చిన్న గ్రామం మాది. నిరుపేద కుటుంబం అయినప్పటికీ... ఆ ఇబ్బందులేవీ తెలియకుండా ఆడుతూ పాడుతూ పెరిగాను. కానీ నాకు పద్నాలుగేళ్ల వయసున్నప్పుడు... పరిస్థితులన్నీ ఒక్కసారిగా మారిపోయాయి. అప్పుడు నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. మా అమ్మా నాన్నా నాకు పెళ్లి చెయ్యాలని ప్రయత్నం మొదలుపెట్టారు. అప్పుడే పెళ్లి వద్దనీ, నాకు చదువుకోవాలని ఉందని మొత్తుకున్నాను. కానీ వాళ్ళు వినలేదు. టెన్త్‌లోకి వచ్చీ రాగానే నాకు వివాహం చేశారు. నా భర్త వయసు నలభై అయిదేళ్ళు అంటే నా వయసుకన్నా మూడింతలు ఎక్కువ. ఎంతో సంకోచంతో అత్తింట్లోకి అడుగుపెట్టాను. ఆ మరునాటి నుంచే నరకం అంటే ఏమిటో నాకు అనుభవంలోకి వచ్చింది. నా భర్త నన్ను అనుక్షణం వేధించేవాడు. అనుమానంతో కొట్టేవాడు. ఆ బాధలు భరించలేక మూడు నెలలకే అక్కడ్నించి పారిపోయి... పుట్టింటికి వచ్చాను. కొన్నాళ్ళకే... నేను గర్భవతినని తెలిసింది. ఆ రోజు ఎంతో విలపించాను.

సంబంధం లేదని తరిమేశాడు...

నేను ప్రసవించి, మగబిడ్డను కన్నాను. ఆ తరువాత మావాళ్ళు మళ్ళీ నన్ను నా భర్త ఇంటికి పంపించారు. దాదాపు ఏడాదిపాటు తనకు దూరంగా ఉన్న నన్ను ఇంటికి రానిచ్చేది లేదని అతను చెప్పాడు. అంతేకాదు, తనకూ, నాకూ ఎలాంటి సంబంధం లేదని తరిమేశాడు. మరోవైపు సమాజం నుంచి వెక్కిరింపులు మొదలయ్యాయి. నా పుట్టింటివారి స్థోమత అంతంతమాత్రం. నన్ను, నా బిడ్డను చంపుకోవాలా? లేదా పరిస్థితులకు ఎదురు నిలిచి పోరాడాలా? రెండో మార్గాన్నే ఎంచుకున్నాను. ఒక షోరూంలో పనిలో చేరాను. అప్పుడే 'ఛైల్డ్ లైన్ ఇండియా ఫౌండేషన్' అనే సంస్థ ప్రతినిధులతో పరిచయం అయింది. అంతదాకా ఎంతో న్యూనతతో ఉండేదాన్ని. కానీ నాచుట్టూ నాలాంటివారు ఎందరో కనిపించారు. మా రాష్ట్రంలో... ప్రతి అయిదుగురు మహిళల్లో ఇద్దరికి... పద్దెనిమిదేళ్ళు రాకముందే వివాహం జరుగుతోందన్న వాస్తవాన్ని 'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే' (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) నివేదికలు వెల్లడించాయి. కానీ అంత చిన్న వయసులో వివాహితలైన బాలికల దుస్థితిని సమాజం ఎందుకు పట్టించుకోవడం లేదు? కనీసమైన చదువు లేకుండా, భర్తల నుంచి, అత్తింటి వారి నుంచి నిరంతర వేధింపులను సహిస్తూ, సమాజం విధించే ఆంక్షలను భరిస్తూ రాలిపోతున్న మహిళలు ఎంతోమంది ఉన్నారు. దీనికంతటికీ కారణం బాల్య వివాహాలు. అందుకే వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిశ్చయించుకున్నాను. 'సేవ్ ది ఛైల్డ్', 'యునిసెఫ్' లాంటి సంస్థల భాగస్వామ్యంతో గ్రామ గ్రామానికి తిరిగి... బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించడం ప్రారంభించాను.



అదే నా కల...

"నా ప్రయత్నాలకు దేశ, విదేశీ సంస్థల నుంచి గుర్తింపు లభించింది. 2022లో జెనీవాలో ఐక్యరాజ్య సమితి సదస్సులో పురస్కారాన్ని అందుకున్నాను. ఆ సదస్సులో నా ప్రసంగానికి మంచి స్పందన వచ్చింది. చిన్న వయసులోనే నాకు పెళ్ళి జరిగి, గర్భవతిని అయినప్పుడు... జీవించాలనే ఆశను కోల్పోయాను. కానీ ఎంతోమంది బాలికలు చిన్న వయసులోనే వివాహం అనే సంకెళ్ళ నుంచి బయటపడడానికి సాయం చేయగలగడం నాకు ఒక లక్ష్యాన్ని ఇచ్చింది. ఇప్పుడు... నాకు ఒకే ఒక కల ఉంది... నా జీవితకాలంలో బాల్య వివాహాలు లేని భారతదేశాన్ని చూడాలన్నది."

బాలికల బృందాల ఏర్పాటు...

గత రెండేళ్ళలో దాదాపు అరవైకి పైగా బాల్య వివాహాలను స్వయంగా ఆపగలిగాను. కొన్ని వేల మంది బాలికల్లో చైతన్యాన్ని తీసుకువచ్చాను. దీనికి స్థానిక ప్రజాప్రతినిధుల సాయం తీసుకున్నాను. నేను, మరికొందరు కార్యకర్తలు కలిసి... ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతోందని తెలిస్తే... అక్కడికి వెళ్ళి, వధువు తల్లితండ్రులకు నచ్చజెప్పి వాటిని నిరోధిస్తున్నాం. కొన్నిసార్లు కౌన్సెలింగ్ సరిపోకపోవచ్చు. అలాంటి సమయాల్లో జిల్లా మేజిస్ట్రేట్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, పోలీసులు, బాలల అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారులు తదితరుల సహకారం తీసుకుంటున్నాం. బాల్య వివాహాలు చట్టరీత్యా శిక్షార్హమైన నేరం అనేది అర్థమయ్యేలా చెబుతున్నాం. తమ కూతుర్లకు పద్దెనిమిదేళ్ళు వచ్చేదాకా పెళ్ళి చేయబోమని తల్లితండ్రుల నుంచి అఫిడవిట్ తీసుకుంటున్నాం. మరోవైపు పలు గ్రామాల్లో బాలికల బృందాలను ఏర్పాటు చేశాను. వీరందరూ తమ ఇబ్బందులను కలిసి చర్చించుకుంటారు. బాల్య వివాహాల కోసం కుటుంబ సభ్యులు ఒత్తిడి చేస్తే... వెంటనే మాకు సమాచారం అందిస్తారు. కౌన్సెలింగ్, అవగాహన కల్పించడం, సామాజిక చైతన్యం, ప్రజల భాగస్వామ్యం... వీటి ద్వారా మాత్రమే బాల్య వివాహాలను అరికట్టగలం. అలాగే బాలికల విద్య, ఆరోగ్యం, సాధికారత లాంటి అంశాలపైన కూడా నేను పని చేస్తున్నాను. వారికి ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలు అందేలా చూస్తున్నాను. వారి స్వయం ఉపాధికి సహకారం అందిస్తున్నాను."



ఇలా చేస్తే 'స్టేజ్ ఫియర్' పరార్!

మనకుండే అత్యంత పెద్ద భయం 'మరణం' కానే కాదు. ప్రపంచవ్యాప్తంగా జరిపిన అధ్యయనాల్లో మనకుండే ప్రధాన భయం 'స్టేజ్ ఫియర్' అని దాని తర్వాతిదే మరణ భయమని తేలింది. అయితే ఈ సమస్యను అధిగమించటం తేలికే! బహిరంగంగా మాట్లాడాలన్నా, వేదిక మీద ప్రసంగించాలన్నా కాళ్లు ఒణికి, చమటలు పట్టేస్తుంటే ఈ చిట్కాలు పాటించాలి.

- వేదిక ఎక్కగానే గుండెల్లో రైళ్లు పరిగెత్తి, కండరాలు పట్టేసి నర్వస్‌గా ఫీలవుతాం. మాట్లాడబోతే నోట్లోంచి మాట పెగలదు. ఈ మార్పులన్నిటికీ కారణం టెన్షన్‌తో ఒంట్లో పెరిగిపోయే అడ్రినలిన్ హార్మోన్ ఫలితమే! అయితే ఈ స్థితిని అధిగమించాలంటే వేదిక మీద నడుస్తూ ఉండాలి. ఇలా చేయటం వల్ల శరీరం రిలాక్స్ అవుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. దాంతో టెన్షన్ సద్దుమణిగి మామూలు స్థితికొస్తాం.
- గుండెల్నిండా ఊపిరి పీల్చి వదలాలి. ఇలా చేస్తే రక్తప్రసరణ పెరిగి గుండె వేగం తగ్గుతుంది. దాంతో ఆలోచనల్లో స్పష్టత వస్తుంది. మానసిక స్థితి మీద బాడీ లాంగ్వేజ్ ప్రభావం ఉంటుందని ఎన్నో అధ్యయనాల్లో తేలింది. కాబట్టి చిరునవ్వుతో స్నేహపూర్వకంగా కనిపించే ప్రయత్నం చేయాలి.
- ఇష్టమైన విషయం గురించి మాట్లాడటం తేలిక. కాబట్టి వీలైనంతవరకూ నచ్చిన టాపిక్ ఎంచుకోవాలి.
- ఏం మాట్లాడితే ఏమవుతుందో? ఏమనుకుంటారో? అనే ఆలోచనలను వదిలేయాలి. వాళ్లక్కడకు వచ్చింది మీ మాటలు వినటానికి...కాబట్టి 'నా ప్రెజెంటేషన్ వాళ్లక నచ్చదు' అని అనుకునే బదులు 'ఎలాంటి విషయాలు చెప్తే ప్రేక్షకులకు ఉపయోగకరం?' అనే దిశగా ఆలోచించండి.
- పర్‌ఫెక్షన్ కోసం ప్రాక్టీస్ చేయాలి. కాబట్టి ప్రెజెంటేషన్ స్క్రిప్ట్ ముందుగానే తయారుచేసుకుని దాని గురించి అనుమానాలుంటే స్నేహితులతో చర్చించి నివృత్తి చేసుకోవాలి. చర్చించే సమయంలో ఏవైనా ప్రశ్నలు తలెత్తితే ప్రశ్నిస్తారు. తగిన సలహాలు సూచిస్తారు. అలాగే అద్దం ముందు నిలబడి ప్రాక్టీస్ చేసినా ఫలితం ఉంటుంది.

ఉదయాన్నే పసుపు నీరు తాగితే..?

రోజు మన వంటల్లో పసుపును ఉపయోగిస్తాం. ఈ పసుపును గోరువెచ్చని వేడినీటిలో కలిపి, అందులో అల్లం, నిమ్మరసం, తేనె కలుపుకుని రోజూ పరగడుపున తాగితే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం...



- శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- జీవక్రియలు సక్రమంగా జరుగుతాయి.
- ఆర్థరైటిస్, మధుమేహం, గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.
- వాపులు, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు తగ్గుతాయి.
- జీర్ణ సమస్యలు తగ్గి, పేగు కదలికలు మెరుగుపడతాయి.
- మొటిమలు తగ్గి, చర్మం ప్రకాశవంతంగా మారుతుంది.
- కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- మెదడు చురుగ్గా ఉంటుంది. అల్జీమర్స్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది.
- రక్తంలో చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి.
- ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది.
- పసుపులోని యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలో రక్తాన్ని శుద్ధి చేస్తాయి.
- పసుపులోకి కర్క్యుమిన్ క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తుంది.

పాదాలు పదిలంగా...

అమ్మాయిలు ముఖం పట్ల చూపించిన శ్రద్ధ పాదాల మీద చూపించరు. దాంతో పాదాలు పగుళ్లకు లోనై అందవిహీనంగా మారతాయి. కాబట్టి పాదాలను అందంగా ఉంచుకోవడం ఎలానో తెలుసుకుందాం...

- పాదాలకు తేమ అందించడం చాలా అవసరం. లేకపోతే పాదాలు పొడిబారి పగుళ్లకు గురవుతాయి. అలా అవ్వకూడదంటే రోజూ పాదాలకు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. తేనె పగిలిన పాదాలకు చక్కని మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది.
- ఆలివ్‌నూనె పాదాలకు రక్షణనిస్తుంది. కాబట్టి రోజ్‌వాటర్, ఆలివ్‌నూనె కలిపి వారానికొకసారి పాదాలకు రాయడం వలన పాదాలు అందంగా మారతాయి.
- అరటిపండులోని విటమిన్-ఎ, బి6, సిలు చర్మాన్ని మృదువుగా చేస్తాయి. అరటిపండు గుజ్జును పాదాలకు రాయాలి.
- వారానికి ఒకసారి ఇంటి వద్దే పెడిక్యూర్ చేసుకుంటే పాదాలు అందంగా, మృదువుగా ఉంటాయి. పెడిక్యూర్ ఎలా చేసుకోవాలంటే..
- ఒక బకెట్‌లో పాదాలు, మడిమలు మునిగేలా గోరువెచ్చని నీటిని తీసుకోవాలి. ఆ నీళ్లలో ఒక చెంచా వంటసోడా, కొంచెం షాంపు, గ్లిజరిన్ వేసి కలపాలి. ఇందులోనే ఒక నిమ్మకాయను పిండాలి. ఈ నీళ్లలో పాదాలు మునిగేలా పెట్టి పావుగంట సేపు ఉండాలి. తరువాత పాదాలను బయటకు తీసి బ్రష్‌తో మడమలు, గోళ్లు, మడమలు, పాదాలను బాగా రుద్దాలి. ఆపై ప్యూమిస్ స్టోన్‌ను తీసుకుని మృతచర్మాన్ని తొలగించాలి. ఆపై మంచి నీళ్లలో కాళ్లను శుభ్రంగా కడిగి, పొడి వస్త్రంతో తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి.



ప్రపంచకప్ జట్టులో శ్రీచరణి


హర్మన్‌ప్రీత్


శ్రీచరణి

రేణుక రీఎంట్రీ ● షఫాలీకి మొండిచేయి ● టీమిండియా ఎంపిక

ముంబై: ఇంగ్లండ్ టూర్‌లో ఆకట్టుకొన్న తెలుగమ్మాయి శ్రీచరణికి జాక్‌పాట్ తగిలింది. మంగళవారం ప్రకటించిన మహిళల వన్డే వరల్డ్ కప్ జట్టులో ఆమెకు చోటుదక్కింది. ఫిట్‌నెస్ సాధించిన పేసర్ రేణుక సింగ్ జట్టులోకి పునరాగమనం చేసింది. టాపార్డర్‌లో ప్రతికా రావల్‌కు చాన్స్ దక్కగా.. షఫాలీకి సెలెక్టర్లు మొండిచేయి చూపారు. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యవహరించనున్నారు. భారత్, శ్రీలంకల్లో వచ్చే నెల 30 నుంచి వరల్డ్‌కప్ జరగనుంది. కాగా ఇటీవలే ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో 10 వికెట్లు పడగొట్టిన కడప జిల్లాకు చెందిన శ్రీచరణి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గానూ ఎంపికైంది. కాగా, మెగా టోర్నీకి ముందు.. అంటే సెప్టెంబరు 14 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే మూడువన్డేల సిరీస్ కోసం కూడా భారత జట్టును సెలెక్టర్లు ప్రకటించారు. ఇంగ్లండ్ పర్యటనలో ఆడిన జట్టును దాదాపుగా ప్రపంచకప్‌నకు ఎంపిక చేశారు. ఒక్క మార్పు మినహా విశ్వకప్ జట్టునే ఈ సిరీస్‌కూ ఖరారు చేశారు. ఆల్‌రౌండర్ అమన్‌జోత్ కౌర్ స్థానంలో ఆసీస్‌తో వన్డేలకు సయాలీ సత్‌ఘరేను తీసుకొన్నారు. గాయంతో బాధపడుతున్న అమన్‌జోత్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో పునరావాసంలో ఉంది. ప్రపంచకప్ సమయానికి ఆమె కోలుకొనే అవకాశం ఉంది. యువ సీమర్ క్రాంతి గౌడ్, అరుంధతిలకు కూడా టీమ్‌లో చోటు లభించింది. శ్రీచరణితోపాటు దీప్తి శర్మ, రాధా యాదవ్, స్నేహ్ రాణాలతో స్పిన్ విభాగం బలంగా కనిపిస్తోంది.

భారత మహిళల వరల్డ్‌కప్ జట్టు

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రేణుక సింగ్ ఠాకూర్, అరుంధతి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), క్రాంతి గౌడ్, అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీచరణి, యాస్తిక భాటియా (వికెట్ కీపర్), స్నేహ్ రాణా.

క్రీడా బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: జాతీయ క్రీడా పాలనా బిల్లు చట్టంగా మారింది. ఉభయ సభల్లో బిల్లు పాస్ కావడంతో.. రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము కూడా ఆమోదముద్ర వేసినట్టు సోమవారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీంతో పదేళ్ల ఎదురుచూపులకు మోక్షం లభించింది. కీలకమైన జాతీయ క్రీడా బోర్డు ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

రష్మికకు స్వర్ణం.. మనుకు కాంస్యం

ఆసియా షూటింగ్


మను
రష్మిక

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): భారత స్టార్ షూటర్ మను భాకర్ ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకం సాధించింది. సీనియర్ విభాగం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్ ఫైనల్స్‌లో 219.7 పాయింట్లు స్కోరు చేసిన మను.. మూడోస్థానంలో నిలిచి కాంస్యం అందుకుంది. ఇక, ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో పాలక్, సురుచి సింగ్‌లతో కలిసి మను భాకర్ కాంస్యం నెగ్గి రెండో పతకం ఖాతాలో వేసుకుంది. అలాగే జూనియర్ బాలికల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో భారత అమ్మాయి రష్మి సాగల్ స్వర్ణం కొల్లగొట్టింది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లోనూ రష్మిక.. వంశిక, మోహినిలతో కలిసి పసిడి నెగ్గి గోల్డెన్ డబుల్ సాధించింది. కాగా, యూత్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కనక్ స్వర్ణం, ఆగమ్ గ్రేవాల్ రజతం నెగ్గారు. ఇక, టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు పసిడి సాధించింది. జూనియర్ బాలుర ఎయిర్ పిస్టల్‌లో గవిన్ కాంస్యం అందుకోగా.. యూత్ పురుషుల ఎయిర్ పిస్టల్‌లో గిరీష్ స్వర్ణం, దేవ్ ప్రతాప్ కాంస్యం గెలిచారు. ఇక, యూత్ పురుషుల టీమ్ ఈవెంట్‌లోనూ భారత జట్టు పసిడి సాధించడం విశేషం.

బాబర్, రిజ్వాన్‌లకు మరో షాక్

లాహోర్: సీనియర్లు బాబర్ ఆజమ్, వన్డే కెప్టెన్ రిజ్వాన్‌లను ఆసియా కప్ జట్టుకు ఎంపిక చేయకుండా ఝలకిచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వారిద్దరికి మరో షాక్ ఇచ్చింది. వారిని ఏకంగా సెంట్రల్ కాంట్రాక్ట్ 'ఎ' కేటగిరీ నుంచి తప్పించి 'బి' గ్రేడ్‌కు పంపింది. మంగళవారం 30 మంది ఆటగాళ్లకు కాంట్రాక్ట్‌లు ఇవ్వగా.. ఒక్కరికి కూడా ఎలీట్ కేటగిరీలో చోటుదక్కలేదు.

సెమీస్‌లో స్వియాటెక్ జోడీ

యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ చాంపియన్‌షిప్


స్వియాటెక్
రూడ్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌షిప్‌లో స్వియటెక్, డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని జంటలు సెమీస్ చేరుకొన్నాయి. క్వార్టర్స్‌లో స్వియటెక్ -కాస్పర్ రూడ్ ద్వయం 4-1, 4-2తో కేటీ మెక్‌నెలీ-ముసెట్టి జంటపై గెలిచింది. తొలిరౌండ్‌లో కీస్-టియాఫోపై స్వియటెక్ జోడీ గెలిచింది. క్వార్టర్స్‌లో ఎరాని-వవస్సోరి జంట 4-1, 5-4(4)తో ముచోవా-రుబ్లేవ్‌పై నెగ్గింది. మొదటి రౌండ్‌లో రిబకినా-ఫ్రిట్జ్‌పై 4-2, 4-2తో ఎరాని జంట నెగ్గింది. కాగా, వీనస్ విలియమ్స్-రిల్లీ ఒపెల్కా 2-4, 4-5(2)తో ముచోవా-రుబ్లేవ్ ద్వయం చేతిలో, ఒసాక-మోన్‌ఫిల్స్ జోడీ 3-5, 2-4తో కేటీ-ముసెట్టి జంట చేతిలో తొలి రౌండ్‌లోనే ఓడారు.

కింగ్స్‌పై బుల్స్ గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఏపీఎల్‌లో భాగంగా మంగళవారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో భీమవరం బుల్స్ 27 పరుగుల తేడాతో కాకినాడ కింగ్స్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బుల్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 పరుగులు చేసింది. సాయిశ్రవణ్ (58 పరుగులు), రేవంత్‌రెడ్డి (51) అర్ధ సెంచరీలు సాధించారు. కింగ్స్ బౌలర్లలో సుదర్శన్, మణికంఠకు చెరి రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో కాకినాడ 19.5 ఓవర్లలో 187 రన్స్‌కే ఆలౌటైంది. కేఎస్ భరత్ (76) కెప్టెన్స్ ఇన్నింగ్స్ ఆడినా ఫలితం దక్కలేదు. బుల్స్ బౌలర్లలో శివ, సత్యనారాయణ రాజు, మనీష్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. మరో మ్యాచ్‌లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ (161/5)పై అమరావతి రాయల్స్ (17.3 ఓవర్లలో 163/3) గెలిచింది.

కేశవ్ పాంచ్

తొలి వన్డేలో ఆసీస్‌కు దక్షిణాఫ్రికా షాక్



కెయిన్స్: ఆస్ట్రేలియా పర్యటనలో మూడు వన్డేల సిరీస్‌ను దక్షిణాఫ్రికా ఘనంగా బోణీ చేసింది. మంగళవారం జరిగిన మొదటి మ్యాచ్‌లో లెఫ్టామ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (5/33) కెరీర్ బెస్ట్ గణాంకాలు నమోదు చేయడంతో సఫారీ జట్టు 98 పరుగుల తేడాతో ఆతిథ్య ఆసీస్‌కు షాకిచ్చింది. తొలుత దక్షిణాఫ్రికా.. ఓపెనర్ మార్‌క్రమ్ (82), కెప్టెన్ బవుమా (65), మాథ్యూ బ్రెజెకె (57) అర్ధ సెంచరీలతో 50 ఓవర్లలో 8 వికెట్లకు 296 పరుగులు చేసింది. హెడ్ 4, డ్వార్షుయిస్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో సఫారీ బౌలర్లు కేశవ్‌కు తోడు ఎంగిడి (2/28), బర్గర్ (2/54) ధాటికి ఆసీస్ 40.5 ఓవర్లలో 198 పరుగులకే కుప్పకూలింది. సారథి మిచెల్ మార్ష్ (88) ఒంటరి పోరాటం చేశాడు. ఐదు వికెట్లతో అదరగొట్టిన కేశవ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

గుకేష్‌పై ప్రజ్ఞానంద గెలుపు

సింక్వెఫీల్డ్ కప్ చెస్

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): సింక్వెఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో ప్రపంచ చాంపియన్ గుకేష్‌కు ప్రజ్ఞానంద షాకిచ్చాడు. క్లాసికల్ ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీ మొదటి రౌండ్లో గుకేష్‌ను కేవలం 36 ఎత్తుల్లోనే చిత్తు చేశాడు. ఈ విజయంతో ప్రజ్ఞానంద లైవ్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి దూసుకెళ్లాడు. ఇతర తొలి రౌండ్ గేమ్‌లలో నోదిర్బెక్‌పై అరోనియన్ నెగ్గగా.. కరువానాతో దూడా, శామ్యూల్‌తో వెస్లీ, మాగ్జిమ్‌తో అలీ రెజా గేమ్‌లను డ్రాగా ముగించారు. ఆరంభ రౌండ్ ముగిసేసరికి ప్రజ్ఞానంద, అరోనియన్ సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

పాక్ స్థానంలో బంగ్లా ఖరారు

ఆసియా కప్ హాకీ

న్యూఢిల్లీ: భారత్‌లో జరిగే ఆసియాకప్ హాకీ టోర్నమెంట్‌లో పాకిస్థాన్, ఒమన్ జట్ల స్థానాల్లో బంగ్లాదేశ్, కజకిస్థాన్ బరిలోకి దిగనున్నాయి. ఈనెల 29 నుంచి సెప్టెంబరు 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిర్‌లో టోర్నీ జరగనుంది. అయితే, పాక్ ఆటగాళ్లకు వీసాలు మంజూరు చేస్తామని భారత ప్రభుత్వం చెప్పినా.. ఆ జట్టు భద్రతా కారణాల సాకుతో టోర్నీ నుంచి వైదొలగింది. దీంతో ఆ జట్టు బదులు బంగ్లాకు చోటు కల్పించినట్టు నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. అలాగే, ఒమన్ కూడా టోర్నీకి దూరమవడంతో కజకిస్థాన్‌కు ఆడే అవకాశం దక్కింది. మొత్తం 8 జట్లు పోటీపడే టోర్నీలో పూల్-ఎ నుంచి ఆతిథ్య భారత్, చైనా, జపాన్, కజకిస్థాన్.. పూల్-బి తరపున డిఫెండింగ్ చాంప్ కొరియా, మలేసియా, తైపీ, బంగ్లాదేశ్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. తొలి మ్యాచ్‌లో చైనాతో భారత్ తలపడనుంది.

గిల్ వచ్చేశాడు


సూర్యకుమార్

అనేక ఊహాగానాల మధ్య ఎట్టకేలకు ఆసియాకప్ టీ20 టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. ఇటీవలి టెస్ట్ సిరీస్‌లో అదరగొట్టిన శుభ్‌మన్ గిల్ పొట్టి ఫార్మాట్‌లో పునరాగమనం చేయనున్నాడు. ఇక పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో విశేషంగా రాణిస్తున్నప్పటికీ.. శ్రేయాస్ అయ్యర్‌ను పట్టించుకోకపోవడం ఫ్యాన్స్‌ను నిరుత్సాహపరిచింది. అలాగే ఫామ్‌లో ఉన్న జైస్వాల్‌ను స్టాండ్‌బైగా ఎంపిక చేయగా.. ఐపీఎల్‌లో ఆకట్టుకోలేకపోయిన రింకూ సింగ్, హర్షిత్‌లను మాత్రం జట్టులోకి తీసుకోవడం గమనార్హం.

వైస్ కెప్టెన్‌గా ఎంపిక

సూర్యకే పగ్గాలు


గిల్

శ్రేయాస్‌కు నిరాశ

జట్టులోకి పేసర్ బుమ్రా
ఆసియా కప్‌నకు టీమిండియా


తిలక్ వర్మ

ముంబై: ఏడాది తర్వాత శుభ్‌మన్ గిల్ భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. వచ్చే నెల 9 నుంచి యూఏఈలో జరిగే ఆసియాకప్ టోర్నీ కోసం మంగళవారం సెలెక్టర్లు 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో భారత్ బరిలోకి దిగనుండగా.. అతడికి డిప్యూటీగానూ గిల్ వ్యవహరించనున్నాడు. గతంలో అక్షర్ ఈ బాధ్యతలు నిర్వర్తించాడు. స్టార్ పేసర్ బుమ్రా సైతం జట్టులోకి రావడంతో పేస్ బలం రెట్టింపు కానుంది. అయితే ఐపీఎల్‌తో పాటు ఏడాది కాలంగా ఈ ఫార్మాట్‌లో విశేషంగా రాణిస్తున్న శ్రేయాస్ అయ్యర్‌కు సెలెక్టర్లు మొండిచేయి చూపారు. ఇక 25 ఏళ్ల గిల్ చివరి టీ20 మ్యాచ్‌ను గతేడాది జులై 30న శ్రీలంకపై ఆడాడు. ఆ తర్వాత బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లతో జరిగిన టీ20 సిరీస్‌లకు అతన్ని ఎంపిక చేయలేదు. ఇక ఇంగ్లండ్‌తో ఇటీవలి టెస్టు సిరీస్‌లో గిల్ అంచనాలకు మించి రాణించడం చూశాం. జైస్వాల్ సైతం పోటీలో ఉన్నా గిల్ వైపే మొగ్గు చూపారు. అయితే గిల్ రాకతో జట్టు ఓపెనర్ల సంఖ్య అభిషేక్, శాంసన్‌లతో కలిపి మూడుకు చేరింది. దీంతో అభిషేక్‌కు జతగా గిల్‌ను ఆడించి శాంసన్‌ను మిడిలార్డర్‌కు మార్చే అవకాశం ఉంది. అటు జట్టు దుబాయ్ చేరాక ప్రత్యర్థి జట్టు బలాలు, పరిస్థితులను గమనించి గిల్‌ను ఎక్కడ ఆడించాలనేది నిర్ణయం తీసుకుంటారని అగార్కర్ తెలిపాడు. బ్యాటింగ్ విభాగంలో హార్దిక్, తిలక్ వర్మ, శివమ్ దూబేలతో పాటు ఐపీఎల్‌లో ఇబ్బంది పడిన హిట్టర్ రింకూ సింగ్ చోటు దక్కించుకున్నాడు. బ్యాకప్ కీపర్‌గా జితేశ్ శర్మపై సెలెక్టర్లు నమ్మకముంచారు. ధ్రువ్ జురెల్ పేరును కూడా పరిగణనలోకి తీసుకున్నా అతడిని స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. ఆర్‌సీబీ తరపున జితేశ్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

బుమ్రా రాకతో..: ఆసియాకప్ తర్వాత విండీస్‌తో టెస్టు సిరీస్ ఉండడంతో స్టార్ పేసర్ బుమ్రా ప్రాతినిధ్యంపై సందేహాలు నెలకొన్నాయి. ఎందుకంటే సెప్టెంబరు 28న ఫైనల్ జరుగనుండగా.. అక్టోబరు 2 నుంచే టెస్టు ఆరంభమవుతుంది. అయితే పెద్ద టోర్నీల్లో బుమ్రా ఆడితేనే బావుంటుందనే ఆలోచనతో సెలెక్టర్లు అతడిని ఎంపిక చేశారు. దీంతో టీ20 ప్రపంచకప్ తర్వాత బుమ్రా ఈ ఫార్మాట్‌లో ఆడబోతున్నాడు. ఏదిఏమైనా బుమ్రా రాకతో భారత బౌలింగ్ మరింత పటిష్ఠం కానుంది. అతడికి జతగా పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్ బరిలోకి దిగనున్నారు. హర్షిత్ రాణా రిజర్వ్ పేసర్‌గా ఉండనున్నాడు. అంచనా వేసినట్టుగానే స్పిన్ త్రయం కుల్దీప్, అక్షర్, వరుణ్ చక్రవర్తిలకు చోటు దక్కింది. కోచ్ గంభీర్ ఆల్‌రౌండర్లకు ప్రాముఖ్యం ఇస్తుండడంతో వాషింగ్టన్ సుందర్‌ను కూడా తీసుకుంటారనే కథనాలు వెలువడ్డాయి. కానీ అతడిని స్టాండ్‌బైగానే పరిగణించారు.

శ్రేయాస్ ఎదురుచూడాల్సిందే..


అగార్కర్


శ్రేయాస్

ఐపీఎల్‌లో వరుసగా రెండుసార్లు సారథిగా తన జట్ల (కోల్‌కతా, పంజాబ్)ను ఫైనల్‌కు చేర్చడంతో పాటు బ్యాటింగ్‌లోనూ శ్రేయాస్ అయ్యర్ ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది సీజన్‌లో 175 స్ట్రయిక్ రేట్‌తో 604 పరుగులు సాధించాడు. అటు చాంపియన్స్ ట్రోఫీలోనూ కీలక పాత్ర పోషించాడు. అలాగే ఫార్మాట్ ఏదైనా చెలరేగి గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ, రంజీ, ఇరానీ ట్రోఫీల్లోనూ ముంబై జట్టును విజేతగా నిలిపాడు. అయినా టీ20 జట్టులో శ్రేయాస్‌కు చోటు దక్కకపోవడంతో సెలెక్టర్లపై ఫ్యాన్స్ గుర్రుగా ఉన్నారు. కనీసం స్టాండ్‌బై ఆటగాడిగానూ పనికిరాడా? అని విమర్శిస్తున్నారు. అయితే వీటికి సమాధానంగా అన్నట్టు అజిత్ అగార్కర్ స్పందించాడు. 'ఆసియాకప్‌నకు శ్రేయాస్ ఎంపిక కాకపోవడం దురదృష్టకరం. ఇందులో అతడి తప్పు లేదు.. మా తప్పు లేదు. ఎందుకంటే శ్రేయాస్‌ను ఎవరి స్థానంలో తీసుకోవాలో చెప్పండి? జట్టులో అత్యంత పోటీ వాతావరణం ఉంది. అందుకే తను మరికొంత కాలం వేచిచూడాల్సిందే' అని అగార్కర్ తేల్చాడు.

సూర్యకు చెక్ పెట్టేందుకేనా?

భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఇప్పుడు టీ20 జట్టు వైస్‌కెప్టెన్‌గానూ ఎంపిక చేశారు. ఏడాది క్రితం కూడా అతను ఈ బాధ్యతలు నిర్వర్తించినా అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశం కాలేదు. కానీ తాజా పరిణామాలు మాత్రం ప్రస్తుత కెప్టెన్ సూర్యకుమార్‌కు ఓ హెచ్చరికగానే పరిశీలకులు భావిస్తున్నారు. ఐపీఎల్‌లో సూర్య మెరుగ్గానే రాణించినా గతేడాది అంతర్జాతీయ స్థాయిలో మాత్రం 26.81 సగటుతో నిరాశపరిచాడు. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టీ20 సిరీస్‌లో సూర్య ఐదు మ్యాచ్‌ల్లో చేసింది 28 పరుగులే. ఇందులో రెండు డకౌట్లు కూడా ఉన్నాయి. కెప్టెన్‌గా సూర్య విజయాలశాతం ఎక్కువగానే ఉన్నా ఆసియాకప్‌లో బ్యాటర్‌గా ఖచ్చితంగా నిరూపించుకోవాల్సి ఉంది. లేని పక్షంలో గిల్‌కు పగ్గాలు అప్పగించేందుకు సెలెక్టర్లు ఏమాత్రం సంకోచించరు. గిల్ ఇప్పటికే ఇంగ్లండ్ పర్యటనలో సారథిగా, బ్యాటర్‌గా శభాష్ అనిపించుకున్నాడు. అటు వన్డే ఫార్మాట్‌లోనూ కెప్టెన్ రోహిత్ కెరీర్‌పై సందేహాలు నెలకొనగా.. వైస్ కెప్టెన్ గిల్‌ను ప్రమోట్ చేసే అవకాశం ఉంది. ఇలా అన్ని ఫార్మాట్లకు గిల్ ఏకైక సారథిగా మారే రోజు దగ్గరలోనే ఉందని క్రీడా పండితులు బలంగా విశ్వసిస్తున్నారు. ఇదే ప్రశ్న అగార్కర్‌ను విలేకరులు అడగ్గా.. 'నేను ప్రస్తుతం టీ 20 క్రికెట్ గురించే చెప్పగలను. గిల్ ఇప్పటికే టెస్టు కెప్టెన్. అలాగే అతను చివరిసారి టీ20 ఆడినప్పుడు వైస్‌కెప్టెన్‌గానే ఉన్నాడు. ఇంగ్లండ్‌లో మాదిరే ఇక్కడా అతడిలో నాయకత్వ లక్షణాలు చూడాలనుకుంటున్నాం' అని అగార్కర్ సమాధానమిచ్చాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

భారత టీ20 జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేశ్ శర్మ, రింకూ సింగ్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా.

స్టాండ్‌బై: ప్రసిద్ధ్ క్రిష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వీ జైస్వాల్.

రాష్ట్రానికి 'రతన్' హారం!

- నేడు మంగళగిరిలో ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- వర్చువల్‌గా జిల్లాల్లోని కేంద్రాలను కూడా


మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్

అమరావతి/మంగళగిరి/అనంతపురం రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): "తెలివి తేటలు ఏ ఒక్కరి సొత్తూ కాదు. విభిన్నంగా ఆలోచించే లక్షణం, ఆవిష్కరణలకు ఊపిరిపోసే చాకచక్యం ఉంటే ప్రతి ఒక్కరూ ఆవిష్కర్తలే." అని విశ్వసించే ప్రముఖ పారిశ్రామిక వేత్త, దివంగత రతన్ టాటా స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని యువతను సృజన శీలురుగా తీర్చిదిద్దే అతిపెద్ద క్రతువుకు బుధవారం అంకురార్పణ జరగనుంది. రతన్ టాటా ఆవిష్కరణ కేంద్రాల(ఆర్‌టీఐసీ)కు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల ద్వారా విశ్వ విపణిలో యువత అపార అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయనున్నారు. స్థానిక యువతలోని మేధస్సును వెలికి తీయనున్నారు. అదేవిధంగా స్థానిక పెట్టుబడులకు వేదికను కల్పించనున్నారు. రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలు, వీటిని సమన్వయం చేయడంతో పాటు అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగస్వామ్యమయ్యేలా రాజధాని పరిధిలోని మంగళగిరిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్)ను ఏర్పాటు చేశారు. మంగళగిరి బైపాస్‌లో జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం వెంబడి నూతనంగా నిర్మించిన మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రారంభిస్తారు. అనంతరం, ఇక్కడ నుంచే ఇతర నగరాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను వర్చువల్‌గా ఆయన ప్రారంభించనున్నారు. మయూరి టెక్‌పార్కులోని నాల్గవ అంతస్తులో సుమారు 53 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ హబ్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో ఇంటీరియర్స్ అభివృద్ధి, ఇతరత్రా ఎలక్ట్రికల్ పనుల పూర్తికోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.13.96 కోట్లను ఖర్చు చేసింది. రానున్న అయిదేళ్లలో లక్ష మంది యువతకు ఉద్యోగావకాశాలను కల్పించడమే లక్ష్యంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనంతపురం జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభిస్తారని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. జేఎన్‌టీయూ పరిపాలనా భవనంలో ఉన్న ఈ సెంటర్‌ను ఆయన మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పరిశ్రమల యజమానులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

దేశంలోనే తొలిసారి

రాష్ట్రంలో ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, నైపుణ్య అభివృద్ధి, ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను నెలకొల్పారు. అంతేకాదు, వీటి ద్వారా సిలికాన్‌వ్యాలీ తరహా ఎకోసిస్టమ్‌ను సృష్టించాలని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో తొలి హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ తెలిపింది. వీటి ద్వారా స్థానిక పెట్టుబడిదారులకు ప్రత్యేక గుర్తింపు, యువతకు భారీ అవకాశాలు లభిస్తాయని వివరించింది. ప్రధానంగా 'ఒక కుటుంబం నుంచి ఒక పారిశ్రామివేత్త'ను రూపొందించాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా ఈ కేంద్రాలు పనిచేయనున్నాయని తెలిపింది. అదేవిధంగా ఈ కేంద్రాలకు అవకాశాల గనులుగా మారనున్నాయని పేర్కొంది. ప్రతిభ ఉన్న ఒక్కరినీ ప్రోత్సహించనున్నట్టు తెలిపింది. "ఆలోచనలనే పెట్టుబడితో నగరాలు, గ్రామీణ ప్రాంతాలను ఆవిష్కరణల నిలయాలుగా తీర్చిదిద్దుతాం. యువతను ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థితి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగేలా చేస్తాం." అని రతన్‌టాటా సంస్థ స్పష్టం చేసింది. వనరుల కల్పన, నెట్‌వర్క్ అవకాశాలు, కార్యక్రమాల రూపకల్పనకు ఈ కేంద్రాలు దోహదపడనున్నాయని పేర్కొంది. నైపుణ్యాభివృద్ధికి కీలక కేంద్రాలుగా మార్చనున్నట్టు తెలిపింది.

నగరానికో నగ!

ఐదు నగరాల్లో ఏర్పాటు చేయనున్న రతన్ టాటా ఆవిష్కరణల కేంద్రాలు.. ఆయా ప్రాంతాల్లోని స్థానిక అంశాలకు పెద్దపీట వేయనున్నాయి. స్థానిక యువత నైపుణ్యాలు, ఏయే రంగాలకు అవకాశం ఉందన్న విషయాలను గమనంలో పెట్టుకుని వీటిని ఏర్పాటు చేస్తున్నారు. వీటిని రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్, 'మన మిత్ర' సేవలతో అనుసంధానం చేస్తారు.

అనంతపురం: తయారీ సహా ఆటోమోటివ్ రంగాలకు ప్రాధాన్యం.
విశాఖపట్నం: సాఫ్ట్‌వేర్ సేవలు, ఫార్మా, మ్యారిటైమ్ రంగాలకు పెద్దపీట.
విజయవాడ: మొబిలిటీ, పబ్లిక్ సెక్టార్, తయారీకి కీలక ప్రాధాన్యం.
రాజమండ్రి: వ్యవసాయ, ఆక్వా సుస్థిరాభివృద్ధికి దన్ను.
తిరుపతి: అగ్రి ఉత్పత్తుల ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు ఊతం.

నిందితుడి యాపిల్ ఫోన్ లాక్ ఓపెన్ కాలేదు!

- లిక్కర్ స్కాం కేసులో ఏపీపీ వాదనలు

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన భారీ లిక్కర్ కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న వెంకటేశ్ నాయుడు ఫోన్‌లోని సమాచారాన్ని సిట్ అధికారులు లీక్ చేశారన్న పిటిషనర్ ఆరోపణల్లో వాస్తవం లేదని సిట్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ హైకోర్టుకు నివేదించారు. స్వాధీనం చేసుకున్న యాపిల్ ఫోన్‌ను ఓపెన్ చేసేందుకు నిందితుడు సహకరించలేదన్నారు. ఫోన్‌లోని సమాచారాన్ని సిట్ అధికారులు లీక్ చేశారనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నిందితుడికి సంబంధించి మీడియాలో ఎలాంటి వార్తలు ప్రచురించకుండా నిరోధించాలని ఆయన సతీమణి గ్యాగ్ ఆర్డర్ కోరుతున్నారని గుర్తు చేశారు. మీడియా గొంతు నొక్కేందుకు ఈ తరహా ఉత్తర్వులు కోరుతున్నారని తెలిపారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి పూర్తివివరాలు తమ ముందు ఉంచాలని సిట్‌ను ఆదేశిస్తూ విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది వీఆర్ ఆవుల వాదనలు వినిపించారు.

25న మిథున్‌రెడ్డితో జగన్ ములాఖత్: బొత్స

రాజమహేంద్రవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ 25న రాజమహేంద్రవరం రానున్నారు. లిక్కర్ స్కామ్‌లో ఏ 4 నిందితుడిగా రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డితో ఆయన ములాఖత్ కానున్నారు. ఈ విషయాన్ని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ప్రకటించారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులు దాడిశెట్టి రాజా, వంగా గీతతో కలసి మిథున్‌రెడ్డిని ములాఖత్‌లో కలిశారు.

మద్యం కేసు.. బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

విజయవాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితుడు పైలా దిలీప్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనలను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన రెగ్యులర్, మధ్యంతర బెయిల్ పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రాసిక్యూషన్‌ను కోర్టు ఆదేశించింది. దీనిపై విచారణను న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారానికి వాయిదా వేశారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి జైల్లో కల్పించే సదుపాయాలపై జైలు అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కూడా గురువారానికి వాయిదా వేశారు.

జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో



రూ.1.98 లక్షల కోట్ల బూస్ట్

న్యూఢిల్లీ: జీఎస్‌టీ పునర్‌వ్యవస్థీకరణతో పన్ను రేట్లు తగ్గి దేశంలో వినియోగం రూ.1.98 లక్షల కోట్ల మేర పెరగవచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేసింది. మన జీడీపీలో 0.6 శాతానికి సమానమిది. పన్ను రేట్ల కోతతో ప్రభుత్వానికి మాత్రం వార్షిక పన్ను ఆదాయం రూ.85,000 కోట్ల మేర తగ్గవచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో మాత్రం రాబడి రూ.45,000 కోట్ల మేర తగ్గవచ్చని భావిస్తోంది. జీఎస్‌టీ సంస్కరణల్లో భాగంగా దీపావళి నాటికి పన్ను రేట్లను హేతుబద్ధీకరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం శ్లాబులున్నాయి. వాటిని 5, 18 శాతం శ్లాబులకు కుదించి.. పొగాకు, ఆల్కహాల్ వంటి 5-7 రకాల ఉత్పత్తులపైన మాత్రం 40% ప్రత్యేక రేటును విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.

చిన్న కారుకు పెద్ద ఊరట!

కాంపాక్ట్ ఎస్‌యూవీల ప్రవేశంతో ఆదరణ తగ్గిన చిన్న కార్లకు జీఎస్‌టీ రేట్ల పునర్‌వ్యవస్థీకరణతో పెద్ద ఊరట లభించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీ శ్లాబులో ఉన్న చిన్న కార్లను 18 శాతం పన్ను శ్లాబులో చేర్చితే గనుక వాటి ధరలు 8 శాతం వరకు తగ్గవచ్చని హెచ్‌ఎస్‌బీసీ తాజా నివేదిక అంచనా వేసింది. ప్యాసింజర్ వాహనాలపై ప్రభుత్వం 28 శాతం జీఎస్‌టీతో పాటు వాటి సైజు, పొడవును బట్టి కొంత సెస్సును కూడా విధిస్తోంది. దాంతో కార్లపై మొత్తం పన్ను భారం మోడల్‌ను బట్టి 29 శాతం నుంచి 50 శాతం స్థాయిలో ఉంది. పునర్ వ్యవస్థీకరణలో భాగంగా చిన్న కార్లపై జీఎస్‌టీని 18 శాతానికి తగ్గించి, పెద్ద కార్లను కొత్తగా ప్రతిపాదించిన 40 శాతం ప్రత్యేక శ్లాబులో చేర్చితే గనుక మారుతి ఆల్టో వంటి చిన్న కార్ల రేట్లు 8 శాతం వరకు, పెద్ద కార్ల ధరలు 3-5 శాతం వరకు తగ్గవచ్చని హెచ్‌ఎస్‌బీసీ నివేదిక పేర్కొంది.

ఇంటెల్‌లో 10% వాటా కోసం ట్రంప్ సర్కారు ప్రయత్నాలు!

200 కోట్ల డాలర్ల వాటా కొనుగోలు యోచనలో జపాన్ సాఫ్ట్‌బ్యాంక్

న్యూయార్క్: అమెరికాకు చెందిన సెమీకండక్టర్ల (చిప్) తయారీ దిగ్గజం ఇంటెల్ కార్ప్‌లో 10 శాతం వాటా కొనుగోలుకు ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగం సంప్రదింపులు జరుపుతోంది. ఈ డీల్ కొలిక్కి వస్తే ఇంటెల్‌లో అమెరికా సర్కారు అతిపెద్ద వాటాదారుగా అవతరించనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయని బ్లూంబర్గ్ కథనం పేర్కొంది. యూఎస్ చిప్స్ అండ్ సైన్స్ చట్టంలో భాగంగా ఇంటెల్‌కు జారీ చేసిన గ్రాంట్లను పాక్షికంగా లేదా మొత్తంగా ఈక్విటీ వాటాగా మార్చుకోవాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. ఇంటెల్ ప్రస్తుత మార్కెట్ విలువ 10,500 కోట్ల డాలర్ల స్థాయిలో ఉంది. వాణిజ్య, మిలటరీ ప్రొడక్షన్ కోసం ఇంటెల్‌కు మొత్తం 1,090 కోట్ల డాలర్ల చిప్స్ యాక్ట్ గ్రాంట్లు లభించవచ్చని అంచనా. ఈ మొత్తాన్ని ఈక్విటీ వాటాగా మల్చుకుంటే, కంపెనీలో ట్రంప్ ప్రభుత్వానికి 10 శాతం వాటా దక్కే అవకాశం ఉందని రిపోర్టు వెల్లడించింది. కాగా, ఇంటెల్‌లో వాటా కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు జపాన్‌కు చెందిన టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ ప్రకటించింది. ఒక్కో షేరుకు 23 డాలర్లు చెల్లింపు ద్వారా 200 కోట్ల డాలర్ల (దాదాపు 2 శాతం) వాటా కొనుగోలు చేయనున్నట్లు తెలిపింది. ఈ వార్తల నేపథ్యంలో ఇంటెల్ షేరు మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో 7.35 శాతం వరకు పెరిగి 25.39 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

భారత్‌పై సుంకాల ప్రభావం అంతంతే



స్వల్పకాలికంగా ఇబ్బందులు తప్పవు.. ఎస్ అండ్ పీ గ్లోబల్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రభావం దీర్ఘకాలంలో భారత జీడీపీ వృద్ధి రేటుపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. భారత్ నుంచి జరిగే ఎగుమతుల్లో అమెరికా వాటా.. భారత జీడీపీలో ఒక శాతం మాత్రమేనని పేర్కొంది. దీనికి తోడు భారత జీడీపీలో 85 శాతం దేశీయ డిమాండ్‌పైన, 15 శాతం మాత్రమే ఎగుమతులపైన ఆధారపడి ఉన్న విషయాన్ని గుర్తు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలకు కట్టుబడి ఉండడం, ద్రవ్యోల్బణ కట్టడికి ఆర్‌బీఐ తీసుకుంటున్న చర్యలు కూడా దీర్ఘకాలంలో భారత జీడీపీ వృద్ధి రేటుకు దోహదం చేస్తాయని అంచనా వేసింది. వచ్చే మూడేళ్లలో భారత జీడీపీ ఏటా సగటున 6.8 శాతం చొప్పున పెరిగే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ ఆసియా పసిఫిక్ ప్రాంత ప్రధాన ఆర్థికవేత్త విశ్రుత్ రాణా చెప్పారు. అయితే స్వల్పకాలంలో మాత్రం అమెరికా సుంకాల ప్రభావం భారత జీడీపీ వృద్ధి రేటుపై కొద్దిగా ఉంటుందని తెలిపారు. మౌలిక సదుపాయాల లేమి, అనుసంధాన సమస్యలను అధిగమిస్తే భారత ఆర్థిక వ్యవస్థ మరింత వృద్ధి రేటు సాధించే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ డైరెక్టర్ ఈఫాన్ ఫువా తెలిపారు. ప్రతిపాదిత రెండు శ్లాబుల జీఎస్‌టీని ఎస్ అండ్ పీ స్వాగతించింది. దీనివల్ల ప్రజలపై పన్నుల భారం తగ్గడంతో పాటు ప్రభుత్వ ఆదాయం పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

మాదీ అదేమాట ఫిచ్ రేటింగ్స్

మరో అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ ఫిచ్ రేటింగ్స్ కూడా అమెరికా సుంకాల ప్రభావం భారత కంపెనీలపై పెద్దగా ఉండదని తెలిపింది. భారత కంపెనీల్లో చాలా వాటికి అమెరికా మార్కెట్లో పెద్దగా స్థానం లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొంది. అయితే ప్రస్తుతం సుంకాల పోటు నుంచి మినహాయించబడిన ఫార్మా, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపై ట్రంప్ సర్కార్ భవిష్యత్‌లో సుంకాల భారం మోపే అవకాశం ఉందని హెచ్చరించింది. భారత-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే మాత్రం ఈ ముప్పు ఉండదని తెలిపింది. భారత ఐటీ సేవల కంపెనీలపైనా ట్రంప్ సుంకాల ప్రభావం ప్రస్తుతం పెద్దగా ఉండకపోవచ్చని ఫిచ్ అంచనా. దేశీయ మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడిన ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలు, సిమెంట్, భవన నిర్మాణ పరికరాలు, ఇంజనీరింగ్, నిర్మాణ రంగం, టెలికాం కంపెనీలపైనా అమెరికా సుంకాల ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. కొన్ని సమస్యలు ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరంలోనూ భారత జీడీపీ 6.5 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తుందని అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.7 శాతం వృద్ధి రేటు నమోదు చేసి ఉంటుందని ఇక్రా రేటింగ్స్ సంస్థ అంచనా వేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 0.2 శాతం ఎక్కువ.

ఫార్మాపై సుంకాలు వేస్తే కష్టమే

- కొంతైనా ఖాతాదారులు భరించక తప్పదు
- నాట్కో ఫార్మా సీఈఓ రాజీవ్ నన్నపనేని

హైదరాబాద్: ఫార్మా దిగుమతులపైనా అమెరికా సుంకాలు విధించే అవకాశం ఉందన్న వార్తలు భారత ఫార్మా కంపెనీలను భయపెడుతున్నాయి. అదే జరిగితే మొదట్లో కొన్ని ఇబ్బందులు ఉన్నా తర్వాత ఈ సుంకాల భారంలో కొంత భాగాన్ని అమెరికా ఖాతాదారులకే బదిలీ చేయక తప్పదని నాట్కో ఫార్మా వైస్ చైర్మన్, సీఈఓ రాజీవ్ నన్నపనేని అన్నారు. జూన్ త్రైమాసిక ఫలితాల అనంతరం జరిగిన ఎర్నింగ్స్ కాన్ఫరెన్స్ కాల్‌లో ఆయన ఈ విషయం చెప్పారు. అమెరికాతో పాటు ఇతర మార్కెట్లపైనా భారత ఫార్మా కంపెనీలు దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అయినా భారత ఫార్మా ఎగుమతులకు అతిపెద్ద మార్కెట్ అయిన అమెరికాను ఏ మాత్రం విస్మరించలేమన్నారు. అమెరికాలో తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం ఒక మార్గమన్నారు. భారత్ నుంచి దిగుమతయ్యే అన్ని వస్తువులపై సుంకాలు విధించిన ట్రంప్ సర్కార్ ప్రస్తుతానికి ఔషధాలు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌ను మాత్రం మినహాయించింది.

నాలుగో రోజూ లాభాలొచ్చాయ్..

371 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో పయనించాయి. జీఎస్‌టీ జోష్‌తో మార్కెట్ వర్గాలు మంగళవారమూ ఉత్సాహంగా కొనుగోళ్లు జరిపారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు క్రమంగా తగ్గుముఖం పడుతుండటం కూడా మార్కెట్లకు కలిసివచ్చింది. సెన్సెక్స్ ఒక దశలో 482 పాయింట్లకు పైగా పెరిగినప్పటికీ, చివరికి 370.64 పాయింట్ల లాభంతో 81,644.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 103.70 పాయింట్ల వృద్ధితో 24,980.65 వద్ద స్థిరపడింది. భారీ కొనుగోళ్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2.82 శాతం లాభంతో సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.3.44 లక్షల కోట్లు పెరిగి రూ.454.40 లక్షల కోట్లకు ఎగబాకింది.

రూ.1,000 కోట్లతో కర్నూలు ప్లాంటు విస్తరణ

చెన్నై: రామ్‌కో సిమెంట్.. ఆంధ్రప్రదేశ్, కర్నూలు జిల్లాలోని కొలిమిగుండ్ల ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తోంది. రూ.1,000 కోట్ల పెట్టుబడితో చేపట్టిన ఈ ప్లాంట్ విస్తరణ పనులు వచ్చే ఏడాది జూన్ నాటికల్లా పూర్తవుతాయని రామ్‌కో సిమెంట్ సీఈఓ ఏవీ ధర్మకృష్ణన్ వెల్లడించారు. మంగళవారం నాడిక్కడ కంపెనీ కన్‌స్ట్రక్షన్ విభాగం 'హార్డ్ వర్కర్ బ్రాండ్ ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలులోని సమగ్ర ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 31.5 లక్షల టన్నులుగా ఉందన్నారు. ఈ ప్లాంట్ విస్తరణ పనులు పూర్తయితే కంపెనీ మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2.44 కోట్ల టన్నుల నుంచి 3 కోట్ల టన్నులకు చేరుకుంటుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.8,500 కోట్లుగా ఉన్న కంపెనీ వార్షికాదాయం వచ్చే నాలుగైదేళ్లలో రూ.15,000 కోట్ల నుంచి రూ.16,000 కోట్లకు పెరిగే అవకాశం ఉందన్నారు. కాగా మారుతున్న భారత నిర్మాణ రంగ మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హార్డ్ వర్కర్ శ్రేణి ఉత్పత్తులను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం రూ.210 కోట్లు ఉన్న తమ కెమికల్స్ డివిజన్ వ్యాపారాన్ని వచ్చే నాలుగైదు సంవత్సరాల్లో రూ.2,000 కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ధర్మకృష్ణన్ చెప్పారు.

హైదరాబాద్‌లో కూపాంగ్ డెవలప్‌మెంట్ సెంటర్

న్యూఢిల్లీ: భారత్‌లో కార్యకలాపాలను విస్తరించినట్లు అమెరికన్ టెక్నాలజీ కంపెనీ కూపాంగ్ ఇంక్ మంగళవారం ప్రకటించింది. ఇప్పటికే బెంగళూరులో డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్వహిస్తున్న ఈ ఈ-కామర్స్ కంపెనీ.. హైదరాబాద్‌లోనూ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. గత నెలలోనే ప్రారంభమైన హైదరాబాద్ కార్యాలయం జెనరేటివ్ ఏఐ ఆవిష్కరణలు సహా డీప్ టెక్నాలజీ సామర్థ్యాలపై దృష్టిసారించనుందని కంపెనీ పేర్కొంది.

ఐటీ కెరీర్ కోసం టెక్‌బీ ప్రోగ్రామ్

హెచ్‌సీఎల్ టెక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుని కెరీర్‌ను ప్రారంభించాలనుకునే విద్యార్థుల కోసం హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ టెక్.. టెక్‌బీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇంటర్మీడియట్ లేదా ప్లస్ టూ పూర్తి చేసిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా టెక్‌బీ కార్యక్రమాన్ని రూపొందించినట్లు హెచ్‌సీఎల్ టెక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బరామన్ బాలసుబ్రమణ్యన్ తెలిపారు. డిగ్రీ, బీసీఏ, బీకాం, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సులను అందించేందుకు బిట్స్ పిలానీ, కేఎల్ యూనివర్సిటీ వంటి పేరొందిన విద్యా సంస్థలతో జట్టు కట్టినట్లు ఆయన చెప్పారు. కోర్సు పూర్తయిన అనంతరం విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బాలసుబ్రమణ్యన్ తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,750 ▼	92,350 ▼	1,26,000 ▼
విజయవాడ	1,03,000 ▲	96,500 ▼	1,17,000 ▼
విశాఖపట్నం	1,02,150 ▼	92,350 ▼	1,26,000 ▼
రాజమండ్రి	1,00,750 ▼	92,350 ▼	1,16,800 ▼
ప్రొద్దుటూరు	1,00,500 ▼	92,460 ▼	1,16,500 ▼
ముంబై	99,168 ▼	90,838 ▼	1,13,625 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	525
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	553	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	116
కరీంనగర్	102	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	98
కర్నూలు	102	నెల్లూరు	103
విశాఖపట్నం	113	అనంతపురం	103
గోదావరి	119		

చిత్రజ్యోతి

SINCE 1965



దర్శకుడు సుకుమార్ దంపతులు, నిర్మాత యలమంచిలి రవిశంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో తన నటనకు గానూ జాతీయ అవార్డు అందుకొన్న సుకుమార్ కుమార్తె సుకృతి వేణిని సీఎం సన్మానించారు.

ఎన్టీఆర్ పెద్ద కోడలు కన్నుమూత

● నివాళులు అర్పించిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్





నందమూరి పద్మజ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో లోకేశ్, బాలకృష్ణ

నందమూరి తారక రామారావు పెద్ద కుమారుడు జయకృష్ణ సతీమణి పద్మజ (62) మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. నందమూరి పద్మజ భౌతికకాయానికి ఫిల్మ్ నగర్‌లోని ఆమె నివాసంలో మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. బాలకృష్ణ దంపతులు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ 'మాపెళ్లి విషయంలో జయకృష్ణ, పద్మజ పెద్ద దిక్కుగా ఉండి అన్నీ చూసుకున్నారు. ఇంట్లో అందరూ యంగ్ స్టర్స్‌గా ఉంటే మా అత్తగారి తర్వాత ఆవిడే కుటుంబ పెద్దగా అందరితో కలుపుగోలుగా ఉండేవారు' అని చెప్పారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

మూడు విభిన్న పాత్రల్లో అల్లు అర్జున్?


● వంద రోజులు కేటాయించిన దీపిక





అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం పైనే ఇప్పుడందరి దృష్టీ ఉంది. ఆకాశమే హద్దు అనే రీతిలో భారతీయ సినిమా చరిత్రలో ఇంతకుముందెన్నడూ లేని బడ్జెట్‌తో ఈ సినిమా తయారుకానుంది. అలాగే పలువురు హాలీవుడ్ టెక్నీషియన్లు ఈ సినిమాకు పని చేస్తుండడం విశేషం. ఈ సినిమాలో ఒకరు కాదు ఇద్దరు కాదు.. నలుగురు హీరోయిన్లు నటిస్తుండడం మరో విశేషం. వీరిలో దీపికా పదుకోన్ ది ప్రధాన పాత్ర. రష్మిక, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలు పోషించనున్నారు. నవంబర్ నుంచి దీపిక ఈ చిత్రం షూటింగ్‌లో పాల్గొంటారని తాజా సమాచారం. సాధారణంగా ఇలాంటి హై బడ్జెట్ సినిమాలకు హీరోలు వంద రోజులకు పైగా పని చేస్తుంటారు. కానీ దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ సినిమా కోసం దీపిక వంద రోజులు కేటాయించారంటే ఆమె పాత్ర కూడా ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. ఇందులో ఆమె ఓ యోధురాలి పాత్ర పోషిస్తోందనీ, ఆమె లుక్ కూడా డిఫరెంట్‌గా ఉంటుందనీ, భారీ యాక్షన్ సీన్లు ఆమె మీద ప్లాన్ చేస్తున్నారని చెబుతున్నారు. ఇక చిత్రకథానాయకుడు అల్లు అర్జున్ డిఫరెంట్ లుక్స్ కలిగిన మూడు పాత్రలను పోషించనున్నారని బీ టౌన్ వర్గాల సమాచారం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ వచ్చే నెల ప్రారంభం కానుంది. 2027 ద్వితీయార్థంలో విడుదల చేయాలనేది దర్శకనిర్మాతల ఆలోచన.

సరికొత్త లుక్‌లో...



రామ్‌చరణ్ కథానాయకుడిగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న చిత్రం 'పెద్ది' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు కీలక షెడ్యూళ్ల చిత్రీకరణను పూర్తి చేసింది చిత్ర బృందం. క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో మునుపెన్నడూ కనిపించని సరికొత్త లుక్‌లో రామ్‌చరణ్ కనిపించనున్నారు. ఇందుకోసం సెలబ్రిటీ స్టైలిస్ట్ అలీ హకీమ్ రామ్‌చరణ్ లుక్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్‌తో ఆయన తీసుకున్న ఫొటోలు ప్రస్తుతం నెట్టింట సందడి చేస్తున్నాయి. ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న చిత్రం విడుదలవుతోంది.

బెంచ్ మార్క్ మూవీ అవుతుంది



'కబడ్డీ బ్యాక్‌డ్రాప్‌లో ఇప్పటి వరకు కొన్ని కథలు వచ్చాయి. అయితే మేము తెరకెక్కించినంత సీరియస్‌గా ఇప్పటివరకూ ఏ సినిమా రాలేదు. ఇది కచ్చితంగా ఒక బెంచ్ మార్క్ మూవీ అవుతుంది' అని అన్నారు నిర్మాత శ్రీని గుబ్బల. విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకుడు. ఈనెల 29న విడుదలవుతున్న సందర్భంగా శ్రీని గుబ్బల మాట్లాడుతూ 'నల్గొండ కబడ్డీ ఆటగాడు నాగులయ్య జీవితం ఆధారంగా ఈ కథని రూపొందించారు. సినిమా మంచి కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఉంటుంది. అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించినప్పుడు అందరూ చాలా అభినందించారు' అని అన్నారు.

సినీ కార్మికుల సమ్మెకు శుభం కార్డు?





● చిరంజీవితో సమావేశమైన దిల్‌రాజు

● నేడు నిర్మాతల నిర్ణయం?

సినీ కార్మికులకూ, నిర్మాతలకు మధ్య వేతన పెంపుపై ఏర్పడిన వివాదం నేపథ్యంలో నిరసన ప్రదర్శనలు, విమర్శలు, ప్రతి విమర్శలతో మంగళవారం వాతావరణం మరింత వేడెక్కింది. ఫిల్మ్ ఛాంబర్‌కూ, ఫెడరేషన్‌కూ మధ్య కొన్ని రోజులుగా సాగుతున్న చర్చలు మంగళవారం పలు నాటకీయ పరిణామాల మధ్య అనూహ్య మలుపు తీసుకున్నాయి. ముందు అనుకున్న ప్రకారం మంగళవారం సాయంత్రం ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్ సమావేశం జరగాల్సి ఉంది. అయితే ఉదయం కార్మికులతో కలసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సమ్మె విషయంలో వెనుకడుగే లేదంటూ తేల్చి చెప్పడంతో ఏం జరగబోతోందో అనే ఉత్కంఠ నెలకొంది. ఆ తర్వాత ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించి, డిమాండ్ల సాధన కోసం అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించింది. మరోవైపు ఛాంబర్ సమావేశానికి ముందు చిరంజీవి ఇంటికి వెళ్లిన నిర్మాత దిల్‌రాజు, సుప్రియా, జెమినీ కిరణ్ ఆయనతో చర్చించారు. అనంతరం వారంతా ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్‌తో కలసి ఫెడరేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అయితే ఈ చర్చలు ఓ కొలిక్కి రాకపోవడంతో ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ. 'మా డిమాండ్లపై ఛాంబర్ సుముఖత వ్యక్తం చేసింది. అయితే వేతనాల పెంపు ఎంత శాతం అనేది రేపు చర్చల తర్వాత నిర్ణయిస్తామని ఛాంబర్ ప్రతినిధులు చెప్పారు. బుధవారం ఉదయం మరో దఫా నిర్మాతలతో చర్చించి సాయంత్రం నాలుగు గంటలకు తమ నిర్ణయాన్ని ఛాంబర్ తెలియజేస్తుంది' అని చెప్పారు.

నిర్మాతలే షూటింగ్స్ ఆపడం అన్యాయం: తమ్మారెడ్డి భరద్వాజ

'కార్మికుల వేతనాలు పెంచాలని అందిరికీ తెలిసినా, ఏదో ఒక సాకు చూపి 15 రోజులుగా ఆలస్యం చేస్తున్నారు. నిర్మాతలే షూటింగ్స్ ఆపుతున్నారు. ఈ పద్ధతి ఎక్కడా లేదు, ఇది అన్యాయం' అని దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. మంగళవారం ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం జరిగిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సినీ కార్మికులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కన్నా ఎక్కువ జీతం వస్తుందని కొందరంటున్నారు. నెలలో ముప్పై రోజులూ పని దొరికితేనే అది సాధ్యం. ఇండస్ట్రీలో ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు పదిరోజులు కూడా పనిదొరకడం లేదు' అని భరద్వాజ అన్నారు. 'చేసిన పనికి వేతనం పొందడం మన హక్కు. నిర్మాతలు ఇప్పటికి దినసరి వేతనాలే రూ. 13 కోట్ల వరకూ చెల్లించాల్సి ఉంది. ఇక నుంచి ఏ రోజు వేతనాలు ఆరోజే చెల్లించాలి' అని ఆయన డిమాండ్ చేశారు. తమ్మారెడ్డి విమర్శలపై నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించారు. 'ప్రియమైన తమ్మారెడ్డి సార్.. ఈ ఆకస్మిక సమ్మెతో ఆర్థిక బ్లాక్‌మెయిల్‌కు పిలుపునిచ్చింది యూనియన్ వారే కానీ నిర్మాతలు కాదు. ఇది నిర్మాతలు కోరుకున్న సమ్మె కాదు. వారి తలమీద బలవంతపు సమ్మెట పోటు అని గుర్తించవలసిందిగా మనవి' అని పేర్కొన్నారు.

చిరకాలం గుర్తుంటుంది

విజయ్ డొంకాడ



'డైరెక్టర్ ప్రవీణ్ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. 'పరదా' చిరకాలం గుర్తుండిపోయే చిత్రమవుతుంది. కమర్షియల్‌గా ఎంత విజయం సాధిస్తుందనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారు' అని అన్నారు నిర్మాత విజయ్ డొంకాడ. అనుపమ పరమేశ్వరన్ నటించిన చిత్రం 'పరదా'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో విజయ్ డొంకాడ నిర్మించారు. సినిమా ఈనెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో విజయ్ చిత్ర విశేషాలు పంచుకున్నారు. 'ప్రవీణ్ 'సినిమా బండి' చిత్రం అప్పటి నుంచి నాకు తెలుసు. ఆనంద మీడియా బేనర్ పెట్టిన తర్వాత తొలి సినిమాగా గుర్తుండిపోయే కథ చెప్పాలని అనుకున్నాం. అప్పుడు ప్రవీణ్ 'పరదా' ఐడియా చెప్పారు. ఇది ఒక ఫిక్షనల్ స్టోరీ. కథ విన్న వెంటనే అనుపమ ఓకే చెప్పారు. ఫస్ట్ కాపీ చూసి ఈ సినిమా తన కెరీర్‌లో బెస్ట్ సినిమా అవుతుందని భావోద్వేగానికి గురయ్యారు. ప్రచార బాధ్యతలూ తనపైనే వేసుకున్నారు. మలయాళంలో దుల్కర్ సల్మాన్ రిలీజ్ చేస్తున్నారు. సినిమాని నిర్మాత సురేశ్ బాబు, హీరో రానా చూశారు. వాళ్లు కొన్ని విలువైన సూచనలు చేశారు. తర్వాత సినిమా ఇంకా బెటర్ అయ్యింది' అని అన్నారు.

హారర్ కామెడీ



చిన్ను, గీతిక రతన్ జంటగా ప్రసాద్ ఏలూరి తెరకెక్కిస్తున్న చిత్రం 'లవ్ యూ రా'. సముద్రాల మంత్రయ్య బాబు, కొన్నిపాటి శ్రీనాథ్ ప్రజాపతి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 5న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆడియో లాంచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్ ప్రజాపతి మాట్లాడుతూ 'అందరికీ ఆకట్టుకునే చిత్రమిది' అని చెప్పారు. 'సినిమా అందరినీ కడుపుబ్బా నవ్వించేలా ఉంటుంది. ఇందులో హారర్, కామెడీ, లవ్.. ఇలా అన్ని అంశాలుంటాయి' అని చిన్ను తెలిపారు.

దివ్యాంగ పెన్షన్లకు మరో అవకాశం

త్వరలో మళ్లీ ఆస్పత్రుల్లో సదరం స్లాట్స్

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పెన్షన్‌కు అప్పీలు చేసుకునేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. తాము పెన్షన్‌కు అర్హులమని భావించే దివ్యాంగులు వెంటనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పెన్షన్‌కు అనర్హులుగా నోటీసు అందుకున్న వారు, తాము అర్హులమని భావిస్తే వెంటనే సమీప ఎంపీడీవో లేదా మునిసిపల్ కమిషనర్లకు అర్జీలు సమర్పించాలని సూచించారు.

'స్వర్ణాంధ్ర విజన్' ఆవిష్కరణ ఖర్చు 8.48 కోట్లు

పది సూత్రాల అమలు, 15 శాతం వృద్ధిరేటు సాధించడం ద్వారా 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమానికి రూ.8.48 కోట్లు ఖర్చయిందని నిర్ధారిస్తూ ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ మంగళవారం జీవో విడుదల చేశారు. వీటిని యథాతథంగా ఆమోదిస్తూ ప్రణాళిక శాఖ జీవో ఇచ్చింది.



హరిద్వార్‌లోని బీహెచ్ఈఎల్‌లో విద్యుత్ పరికరాల తయారీ, మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎండీ చక్రధరబాబు

ఒప్పందం మేరకు యంత్రాలు ఇవ్వండి :జెన్కో

కాంట్రాక్టు ఒప్పందాల మేరకు టర్బైన్లతో సహా ఇతర యంత్ర పరికరాలను సకాలంలో సరఫరా చేయాలని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్), రాంచీ యాజమాన్యాన్ని ఏపీజెన్కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు కోరారు. ఐఏఎస్ శిక్షణలో భాగంగా ముస్సోరి వెళ్లిన ఆయన ఇటీవల హరిద్వార్‌లోని భెల్ యూనిట్‌ను సందర్శించారు. ఆ సమయంలో భెల్‌తో చేసుకున్న ఒప్పందాలపై యాజమాన్య ప్రతినిధులతో సమీక్షించారు.

బాధ్యతలు చేపట్టిన ప్రకాశ్‌నాయుడు

ఆంధ్రప్రదేశ్ మాంసం అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా పరిమి (చంద్రదండు) ప్రకాశ్‌నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం విజయవాడ పడమట లంకలోని మాంసం అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఆయన ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ల జారీకి మార్గదర్శకాలు

రాష్ట్రంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జారీ కోసం ప్రభుత్వం విధి విధానాలతో సమగ్ర మార్గదర్శకాల(జీఓ 84)ను విడుదల చేసింది. సమాచార పౌరసంబంధాలశాఖకు చెందిన ఐదుగురు అధికారులను నియమించి ఈ రూల్స్‌ను రూపొందించారు. మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసిన తర్వాత చేసిన సిఫారసుల మేరకు ఏపీ స్టేట్ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025ను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

జిల్లాకో సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్: ఈగల్ చీఫ్ రవికృష్ణ

దివాన్‌చెరువు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ వ్యతిరేక వారోత్సవం, ఈగల్ డ్రగ్స్ చైతన్య కార్యక్రమం మంగళవారం జరిగింది. రవికృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

గ్రామ సచివాలయ శాఖను రద్దు చేయండి: జేఏసీ

విజయవాడ (గాంధీనగర్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయ శాఖను రద్దుచేసి ఉద్యోగులను మాతృశాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల్లో సర్దుబాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ ఎండీ జానీపాషా మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం స్పందించి సచివాలయ శాఖను రద్దుచేసి ఉద్యోగులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

కాంట్రాక్టు జేఎల్స్‌ను క్రమబద్ధీకరించాలి

కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, దీనిపై గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ప్రక్రియను తిరిగి ప్రారంభించాలని కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ ఛైర్మన్ కుమ్మరకుంట సురేష్, కోఛైర్మన్ కల్లూరి శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిపై బుధవారం జాయింట్‌స్టాఫ్‌కౌన్సిల్‌లో చర్చించాలని కోరారు.

అక్షయపాత్రకు కాంట్రాక్టు ఇవ్వొద్దు

ట్రిపుల్ ఐటీల్లో విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా భోజనం అందించాలనే ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని రెవెల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అక్షయపాత్రకు కాంట్రాక్టు ఇవ్వడం వల్ల విద్యార్థులకు పోషకాహారం అందదన్నారు. చికెన్, గుడ్డు అక్షయపాత్ర పెట్టదన్నారు.

సముద్ర ఆహార ఎగుమతి పరిశ్రమను ఆదుకోండి

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): భారతీయ సముద్ర ఆహార ఎగుమతి పరిశ్రమను ఆదుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను భారత సముద్ర ఆహార ఎగుమతిదారుల సంఘం కోరింది. మంగళవారం ఢిల్లీలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు పవన్ కుమార్, సీఈవో డాక్టర్ రాఘవన్, జాతీయ కమిటీ సభ్యులు ఇర్రింకి గంగారాం, పూజితతోపాటు ఎంపీలు సానా సతీశ్ బాబు, బీద మస్తాన్ రావు కేంద్ర మంత్రిని కలసి వినతిపత్రం అందజేశారు. 'అమెరికా విధించిన 25శాతం సుంకంతో భారతీయ సముద్ర ఆహార ఎగుమతి పరిశ్రమ తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.' అని కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

హైకోర్టు ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘ అధ్యక్ష పదవి మినహా మిగిలిన కార్యవర్గం మొత్తం ఏకగ్రీవమైంది. ఉపాధ్యక్షుడిగా ఆర్.దివాకర్, కార్యదర్శిగా ఎస్.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా అర్ల కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి-1గా కర్రా సీతా ఫణికుమారి, సంయుక్త కార్యదర్శి-2గా పిసిని సత్యనారాయణ, కార్య నిర్వాహక కార్యదర్శిగా పీరు సాహెబ్, కార్యనిర్వాహక సభ్యులుగా మరో 11 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 30న ఎన్నిక నిర్వహించనున్నారు.

ఆర్టీసీలో పదోన్నతులు కల్పించండి: ఈయూ

విజయవాడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల విషయంలో ప్రభుత్వం ఆరేళ్లుగా జాప్యం చేస్తోందని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని పదోన్నతులకు మోక్షం కలిగించాలని కోరారు.

రాధాకృష్ణన్ నామినేషన్‌పై టీడీపీ ఎంపీల సంతకాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీ రాధాకృష్ణన్‌ను టీడీపీ ఎంపీలు అభినందించారు. మంగళవారం జరిగిన ఎన్డీఏ ఎంపీల భేటీలో ఆయన్ను సత్కరించారు. అనంతరం ఆయన నామినేషన్ పత్రాలపై కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, తెన్నేటి కృష్ణప్రసాద్ సంతకాలు చేశారు.

ఎన్డీఏ అభ్యర్థికే మా మద్దతు: వైవీ సుబ్బారెడ్డి: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్‌కే తాము మద్దతిస్తామని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మూడ్రోజుల క్రితమే తమ పార్టీ అధినేత జగన్‌కు ఫోన్ చేసి మద్దతు కోరారని.. జగన్ ఆ మేరకు హామీ ఇచ్చారని తెలిపారు. ఒకసారి హామీ ఇచ్చిన తర్వాత తమ వైఖరి మార్చుకోబోమని స్పష్టంచేశారు.



దోకిపర్రులో సుందరీమణుల సందడి

గుడ్లవల్లేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా దోకిపర్రు గ్రామంలో విశ్వసుందరి-2025, ఏషియన్ సుందరి హల్‌చల్ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి స్వగ్రామం దోకిపర్రులో ఆయన సతీమణి సుధారెడ్డి నిర్వహణలోని సుధా ఫౌండేషన్, ఎంఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రొమ్ముకేన్సర్ నిర్ధారణ పరీక్షల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని విశ్వసుందరి ఓపెల్ సుచతా చువాంగ్‌స్రీ, ఏషియన్ సుందరి కృష్ణా గ్రావిడేజ్ ప్రారంభించారు.

ఆర్టీసీ బస్సులో మంటలు



ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగిన సంఘటన కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది. ఆదోని డిపోకు చెందిన సింగిల్ స్టాప్ బస్సు మంగళవారం ఉదయం కర్నూలు బయల్దేరింది. గోనెగండ్ల ఎస్సీ కాలనీకి చేరుకున్న సమయంలో డ్రైవర్ దగ్గర బ్యానెట్ నుంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ తిప్పన్న బస్సును నిలిపివేసి, ప్రయాణికులను దించేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. - (గోనెగండ్ల, ఆంధ్రజ్యోతి)

ఆగ్రోస్.. అభాసుపాలు!

- **అవినీతి అధికారులకు ఆదాయ వనరు**
- **కమీషన్ల కోసం ఉద్యోగుల కక్కుర్తి**
- **టెండర్ల ఖరారులో అవకతవకలపై ఆరోపణలు**
- **వైసీపీ నాయకుడికి చెందిన రెండు కంపెనీలకు టెండరు దక్కేలా నిబంధనలు మార్చిన సిబ్బంది**
- **బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు**

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీ ఆగ్రోస్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ) అవకతవకలకు నిలయమైంది. రైతులకు వ్యవసాయ పరికరాలు, వివిధ ప్రభుత్వ శాఖలకు యంత్ర సామగ్రి, వాహనాలు సరఫరా చేయాల్సిన ఈ సంస్థ అవినీతి అధికారులకు ఆదాయ వనరుగా మారింది. యంత్రపరికరాల సరఫరాకు కమీషన్లు తీసుకుని, అడ్డగోలుగా టెండర్లు ఖరారు చేస్తున్నారని పలువురు ఉద్యోగులపై ఆరోపణలున్నాయి. ఆరేడేళ్లుగా ఆగ్రోస్‌లో అనేక తప్పులు జరిగినా బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి. ఆగ్రోస్ ఛైర్మన్, ఎండీ, ఉద్యోగుల మధ్య గత ప్రభుత్వంలో పెద్ద వివాదం ఏర్పడింది. అవినీతి ఆరోపణలు రావడంతో అప్పటి ఎండీపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఇటీవల వాటర్‌షెడ్ పరికరాల టెండర్ విషయంలో అవకతవకలకు పాల్పడ్డారన్న అభియోగంపై ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని అనంతపురం బదిలీ చేశారు. ఇదే సమయంలో వ్యవసాయ యంత్ర పరికరాల తయారీదారులకు, వ్యవసాయ మంత్రి పేషీకి మధ్యవర్తిగా వ్యవహరించాలని మంత్రి ఓఎస్డీ కోరగా, నిరాకరించినందుకు తనను నెల్లూరు బదిలీ చేయించారని, దీంతో తాను సెలవుపై వెళ్తున్నానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి జనరల్ మేనేజర్ రాజమోహన్ ఇటీవల లేఖ రాశారు. తన స్థానంలో నియమించిన అధికారి జీఎంగా అర్హుడు కాదని, ఆతనిపై పెండింగ్ కేసులున్నాయని ఆ లేఖలో ప్రస్తావించారు. దీంతో ఆగ్రోస్‌లో ఏం జరుగుతోందని ప్రభుత్వం ఆరాతీసింది. మరోవైపు ఈ సంస్థలో అవకతవకలపై ప్రభుత్వానికి కొన్ని నివేదికలు కూడా అందాయి. ఆగ్రోస్‌లో తప్పులకు బాధ్యులు ఎవరనే అంశంపై ఆ సంస్థలో చర్చ జరుగుతోంది.

టెండర్లలో గోల్‌మాల్

రాయలసీమ ప్రాంత రైతులకు రూ.46 కోట్లతో వాటర్‌షెడ్ పరికరాలు సరఫరా చేయాలని గత జనవరిలో పంచాయతీరాజ్ శాఖ భావించింది. దీనికి సంబంధించి ఎంప్యానల్‌మెంట్ కోసం ఆగ్రోస్‌తో ఏప్రిల్‌లో టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పరికరాల వారీ ధరలతో కొన్ని కంపెనీలు ఎంప్యానల్ అయ్యాయి. రైతులు కోరుకున్న కంపెనీ వద్ద, అవసరమైన పరికరాలు ఎంపిక చేసుకున్న తర్వాత, ఐఎస్ఐ మార్క్ ఉన్న ఒక్కో పరికరాన్ని, ఒక్కో కంపెనీ సరఫరా చేసేలా ఎల్1 టెండర్ పిలవాలని పంచాయతీరాజ్ శాఖ నుంచి లేఖ వచ్చిందంటూ అకస్మాత్తుగా ఆ టెండర్లు నిలిపివేసింది. అదే సమయంలో పరికరాల తయారీ కంపెనీ ఏపీలోనైనా ఉండాలి లేదా అందులో 15ఏళ్ల అనుభవం ఉండాలన్న నిబంధన పెట్టి గతనెల 5న మరోసారి టెండర్ పిలిచారు. దీంతో ఎల్1గా వచ్చిన రెండు కంపెనీలు రిజెక్ట్ అయ్యాయి. అర్హత సాధించిన కంపెనీలకు కొన్ని పరికరాల సరఫరా టెండరు ఖరారైంది. ఎంప్యానల్‌లోని ఏ కంపెనీకి అర్హత లేకుండా పోవడంతో పాటు నాణ్యమైన పరికరాలు సరఫరా చేసే కంపెనీలను కాదని, నాణ్యత లేని పరికరాలను అధిక ధరకు కొనుగోలు చేసేలా టెండర్ నిబంధనలు మార్పు చేయడంలో ఆగ్రోస్ ఉద్యోగులే చక్రం తిప్పారన్న ఆరోపణలు వచ్చాయి. వైసీపీ నేపథ్యం ఉన్న నాయకుడికి చెందిన రెండు కంపెనీలకు టెండరు దక్కేలా ప్రక్రియ చేపట్టారు. మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న వైసీపీ నాయకుడికి సంబంధించిన కంపెనీలకు టెండర్ కట్టబెట్టే ప్రయత్నం జరుగుతున్న వ్యవహారంపై 'లిక్కర్ బాసులకే ఆగ్రోస్ టెండర్లు' శీర్షిక గతనెలలో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఇదిలా ఉండగా, టెండర్లు ఖరారు కాకముందే ఆగ్రోస్ ఉద్యోగులే కోర్టులో దావా వేయించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

'రైతు రథం' పథకం కింద 81 మంది రైతులకు ఎల్4508 ఆల్‌రౌండర్ అనే మోడల్ ట్రాక్టర్లను సరఫరా చేయడానికి 2017-18లో ఆగ్రోస్‌తో ఓ కంపెనీ ఒప్పందం చేసుకుంది. అప్పట్లో రైతుల ఉంచి అధిక ధర వసూలు చేసి, వారికి మరో మోడల్ ట్రాక్టర్లను సరఫరా చేసింది. సదరు కంపెనీతో ఆగ్రోస్ అధికారి ఒకరు లాలూచీ పడి, మోడల్‌ను మార్చి, తక్కువ రేటున్న ట్రాక్టర్లను ఎక్కువ ధరకు సరఫరా చేయించారని 13 నెలల క్రితం రైతులు ఫిర్యాదు చేయడంతో దీనిపై విచారణ చేపట్టారు. ఒక్కో రైతు రూ.83 వేల వరకూ నష్టపోయినట్లు విచారణలో తేలినా, బాధ్యుడైన అధికారిపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

బోగస్ కంపెనీలకు వర్క్ ఆర్డర్లు

గత డిసెంబరులో 9 సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లకు అవసరమైన రూ.2.45 కోట్ల విలువైన పరికరాలను సరఫరా చేయాలని వ్యవసాయశాఖ ఆగ్రోస్‌ను కోరింది. దీనికి టెండర్లు లేకుండా కొటేషన్ పద్ధతిలో హైదరాబాద్‌లోని రెండు సంస్థలకు ఆగ్రోస్ అధికారులు వర్క్‌ఆర్డర్ ఇచ్చారు. సదరు సంస్థల జీఎస్టీ అడ్రస్‌లు పరిశీలిస్తే.. ఒకటి టైలరింగ్ షాపు, మరొకటి వ్యవసాయ శాఖ అధికారుల సంఘ భవనం అని అధికారుల దృష్టికి వెళ్లింది. ఈ బోగస్ కంపెనీల వ్యవహారంలో కూడా బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. పైగా రూ.18 లక్షల విలువైన పరికరాలను రూ.28 లక్షలకు కొనుగోలు చేసినట్లు ఆరోపణలున్నాయి. రూ.లక్ష దాటితే టెండరు పిలవాల్సిన ఆగ్రోస్.. ఇలా వర్క్‌ఆర్డర్లు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి, అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బంగారం, రాగి అన్వేషణలో

సింగరేణి

సంస్థ 136 ఏళ్ల చరిత్రలో ఇదే తొలిసారి

హైదరాబాద్, గోదావరిఖని, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా బొగ్గు గనుల తవ్వకాలలో ఉన్న సింగరేణి సంస్థ.. ఖనిజాల వెలికితీత రంగంలోకి కూడా ప్రవేశించాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం కార్యరూపం దాల్చింది. కర్ణాటకలోని దేవదుర్గ్‌లో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ కోసం కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో.. 37.75% రాయల్టీని కోట్ చేయడం ద్వారా సింగరేణి ఎల్-1 బిడ్డర్‌గా నిలిచింది. ఈ వివరాలను సంస్థ సీఎండీ ఎన్ బలరాం వెల్లడించారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా చేస్తున్న ప్రయత్నంలో తొలి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో దేవదుర్గ్ గనుల్లో అన్వేషణను పూర్తి చేస్తామన్నారు. బొగ్గు మైనింగ్‌లో 136 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి సంస్థ తొలిసారిగా బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్సును దక్కించుకోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హర్షం ప్రకటించారు. ఖనిజాల అన్వేషణలోనూ సింగరేణి.. దేశంలో అగ్రగామి సంస్థగా నిలవాలని ఆకాంక్షించారు.

చేనేత యూనిట్ల పునరుద్ధరణకు చర్యలు: సీఎస్

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత, జౌళి పరిశ్రమల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ చెప్పారు. మంగళవారం అమరావతి సచివాలయంలో స్పిన్నింగ్ మిల్స్ సమస్యలపై ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ ఫెడరేషన్ ప్రతినిధులు, పరిశ్రమలు, విద్యుత్, చేనేత, జౌళి శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ చర్చించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని చేనేత, జౌళి యూనిట్ల పునరుద్ధరణకు చేపట్టాల్సిన చర్యలు, ఈ రంగానికి అమలు చేయాల్సిన పథకాలు, ప్రోత్సాహకాలపై సమగ్రంగా చర్చించారు. టెక్స్‌టైల్ రంగంలో సిక్ అయిన యూనిట్ల పునరుద్ధరణకు ప్రభుత్వపరంగా ఏ మేరకు సహాయాన్ని అందజేసే అవకాశం ఉంటుందో అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. టెక్స్‌టైల్ మిల్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కోటేశ్వరరావు, సుధాకర్, ఫణి తదితరులు మాట్లాడుతూ.. 'పెండింగ్ రాయితీ బకాయిలను విడుదల చేసి, కరెంట్ టారిఫ్‌లో యూనిట్‌కు ఇస్తున్న రూ.2 రిబేటును నెలవారీ బిల్లులో తగ్గించేలా చూడాలి. టెక్స్‌టైల్ పరిశ్రమలే సొంతంగా క్యాప్టివ్ పవర్ యూనిట్లు స్థాపించుకునేందుకు తగిన అనుమతులు, రాయితీలు ఇవ్వాలి. ప్రస్తుతమున్న ఈడీ చార్జీల విషయంలో పాత విధానాన్నే అనుసరించాలి' అని కోరారు.

అమరావతిపై కుట్రతోనే దుష్ప్రచారం

పొలాల్లోకి నీరు చేరితే... రాజధాని మునిగిందని పిచ్చి రాతలు రాస్తున్నారు

- **జగన్ మీడియాపై చర్యలు తీసుకోండి**
- **తుళ్లూరు పోలీసులకు రైతుల ఫిర్యాదు**

తుళ్లూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై కుట్రతోనే దుష్ప్రచారం చేస్తున్నారని, జగన్ మీడియాపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని రాజధాని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాజధాని పరిధిలోని తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ బాబూరావుకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందించారు. ఈ నెల 12న గుంటూరు జిల్లాలో భారీ వర్షాలు కురిశాయని, దీంతో కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించి సమీప గ్రామాలలోని పోలాలు నీటితో నిండిపోయాయని తెలిపారు. అయితే, ఈ నెల 14న జగన్ పత్రికలో పొలాల్లోకి చేరిన నీటికి సంబంధించిన ఫొటోలు ప్రచురించి అమరావతి మునిగిందంటూ తప్పుడు వార్తలు రాశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అమరావతి విషయంలో ఇంకా కుట్రలు పన్నుతూ.. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. అలాగే 16వ తేదీ సాయంత్రం జగన్ చానల్ లైవ్‌లో సైతం అమరావతిపై తప్పుడు కథనాలను ప్రసారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులుగా, రాజధానివాసులుగా తాము ఇలాంటి అసత్య ప్రచారాలు ఖండిస్తున్నామని తెలిపారు. అమరావతిపై ఇలాంటి తప్పుడు కథనాలు, ప్రసారాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. కృష్ణానదికి ప్రస్తుతం దాదాపు 6 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా రాజధానికి ఎలాంటి ఇబ్బందీ లేదని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. హైకోర్టు, సచివాలయం విధులు సజావుగా జరుగుతున్న విషయాన్ని ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులని అమరావతిని నిర్వీర్యం చేసి రైతుల త్యాగాలకు విలువ లేకుండా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు అమరావతి మునిగింది, వరద నీరు వచ్చి పడిందనే దుష్ప్రచారాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ బాబూరావుకు ఫిర్యాదు చేస్తున్న అమరావతి రైతులు

ఇంకా మారలేదు

గత ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసినా వైసీపీ నేతలు మారలేదని రైతులు ధ్వజమెత్తారు. 2 జడ్పీటీసీ ఉపఎన్నికల్లో డిపాజిట్ కూడా రాకుండా మరింత బుద్ధి చెప్పినా.. యథేచ్ఛగా రాజధానిపై కుట్రలు చేస్తున్నారన్నారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీ కనుమరుగు కాక తప్పదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో రైతు నాయకులు వెంకటరెడ్డి, తిరుమల బాబు, శేషగిరిరావు, అప్పారావు, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఇకనైనా ఏడుపులు ఆపండి

- **లేకుంటే ఈసారి 11 కూడా ఇవ్వరు**
- **నిర్మాణ సమయంలో వర్షానికి గుంతల్లోకి నీళ్లు రావా?**
- **ఆ మాత్రానికే ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లా..!: మంత్రి నారాయణ**
- **ఏడీసీ సీఎండీతో కలసి క్షేత్రస్థాయి పర్యటన**



విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు వద్ద కొండవీటి వాగు ప్రవాహానికి అడ్డంగా ఉన్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

తుళ్లూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అమరావతిపై వైసీపీ నేతలు వారి ఏడుపులను ఇకనైనా ఆపాలని మంత్రి నారాయణ మండిపడ్డారు. రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తోన్న వారిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో కొండవీటి వాగు నీటి ప్రవాహానికి ఆటంకం కలగడంతో వరద నీరు నిలిచిపోయిన ప్రాంతాలను మంత్రి మంగళవారం పరిశీలించారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ లక్ష్మీ పార్థసారథితో కలిసి ఆయా ప్రాంతాల్లో నారాయణ పర్యటించారు. విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఈ-11 రోడ్డు వద్ద కొండవీటి వాగుపై నేషనల్ హైవేస్ అధికారులు ఓ వంతెన నిర్మించారు. ఈ వంతెన నిర్మాణ సమయంలో అక్కడ మట్టిని అలాగే వదిలేయడంతో కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. దీంతో వంతెన దిగువ నుంచి నీరు వెళ్లే మార్గం లేక నీరు కొండ పరిసర ప్రాంతాలలోని పొలాల్లో వరద నీరు నిలిచిపోయిందని మంత్రి వివరించారు. వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన మంత్రి నారాయణ అక్కడికక్కడే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పొక్లెయిన్‌లు ఏర్పాటు చేసి మట్టి తొలగించడంతో పాటు జాతీయ రహదారిపై కూడా స్వల్పంగా గండి కొట్టి నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఆ తర్వాత మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడుతూ, వైసీపీ నేతలు అమరావతిపై ఏడుపు ఆపలేదంటే ఈసారి ఆ 11 సీట్లు కూడా ప్రజలు మీకివ్వరు. ఎక్కడైనా నిర్మాణాలు జరిగేటప్పుడు వర్షం వస్తే గుంతల్లోకి నీళ్లు రావా...? గుంతల్లోకి నీరు వస్తే ఐకానిక్ భవనాలు మునిగిపోయినట్లేనా? అమరావతిపై దుష్ప్రచారం చేస్తే ప్రజలు సహించరు. ఎవరెన్ని అనుకున్నా అమరావతి పనులు జరిగిపోతూనే ఉంటాయి. వచ్చే మార్చి నాటికి అధికారులు, ఉద్యోగుల క్వార్టర్లు కూడా సిద్ధం చేస్తున్నాం. రాజధాని మునిగిపోయిందని ప్రచారం చేస్తున్న వారు అమరావతికి వచ్చి పరిస్థితి చూడాలి' అని మంత్రి సూచించారు.

శ్రీకాంత్‌కు పెరోల్‌పై దర్యాప్తు

- **దీని వెనుక ఎంత స్థాయి అధికారులు ఉన్నా చర్యలు**
- **కూటమి ప్రభుత్వంలో వారి ఆటలు సాగవు: హోంమంత్రి**

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరు సెంట్రల్ జైలులో యావజ్జీవ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న శ్రీకాంత్‌కు పెరోల్ ఇచ్చిన వారంలోనే రద్దు చేసి అతడ్ని జైలుకు పంపామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జైళ్ల శాఖపై సమీక్ష సందర్భంగా క్రిమినల్ రికార్డు ఉన్న శ్రీకాంత్‌కు పెరోల్ వచ్చిందన్న విషయాన్ని శాఖ సూపరింటెండెంట్ తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. అతనికి పెరోల్ ఇవ్వడానికి ఎవరు సహకరించారు, దీని వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ జరుగుతోందని తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత ఇందులో ఎంత స్థాయి అధికారులు ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనిత పేర్కొన్నారు. శ్రీకాంత్ ఎస్కార్ట్ సిబ్బందిపైనా చర్యలు ఉంటాయని చెప్పారు. అదేవిధంగా అరుణ నేపథ్యంపైనా విచారణ జరుగుతోందన్నారు. నాలుగు రోజుల క్రితం హోంమంత్రి పేషీ నుంచి అంటూ ఆమె ఒక సీఐకి ఫోన్ చేసి బెదిరించిన అంశం తమ దృష్టికి వచ్చిందని, దానిపై కూడా సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఆమెపై రెండు కేసులు ఉన్నాయని చెప్పారు. సిఫారసు చేసిన ఎమ్మెల్యేలు ఎవరని విలేకరులు ప్రశ్నించగా మంత్రి స్పందిస్తూ... ప్రజా ప్రతినిధుల దగ్గరకు ఎవరైనా వస్తారని, కొన్ని సందర్భాల్లో ఓవర్ లుక్ అయ్యే అవకాశం ఉందన్నారు. అతనికి పెరోల్ ఎలా వచ్చిందో నివేదిక వచ్చిన తర్వాత చెబుతామని తెలిపారు. గత ప్రభుత్వంలో అతనికి 'వెరీ గుడ్' అంటూ 30రోజులు పెరోల్ మంజూరు చేశారని, తర్వాత మరో 15 రోజులు పొడిగించారని గుర్తుచేశారు. మాజీ సీఎం జగన్ ఇలాంటి అసాంఘిక శక్తులను పెంచి పోషించారని, కూటమి ప్రభుత్వంలో వాటి ఆటలు సాగనివ్వబోమని హోంమంత్రి హెచ్చరించారు. అరాచక శక్తులు, రౌడీలు, ముఠాలను ఎలా అరికట్టాలో సీఎం చంద్రబాబుకు బాగా తెలుసని అనిత పేర్కొన్నారు.



తప్పుడు పోస్టుల దండుపాళ్యం బ్యాచ్‌పై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు గుణపాఠం చెప్పినా వైసీపీ నేతల్లో మార్పు రాలేదు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేయడంతో వైసీపీ తట్టుకోలేకపోతోంది. అమరావతి రాజధానిగా కొనసాగాలని లక్షలాది మంది మహిళలు బయటకు వచ్చి పోరాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడమే గాక అభద్రతా భావానికి గురిచేస్తున్నారు. ముఖ్యంగా అమరావతిపై వైసీపీ అనుకూల మీడియా, సోషల్ మీడియాలో మూకుమ్మడిగా దాడి చేస్తున్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. అమరావతి మునిగిపోయిందంటూ వైసీపీ, వైసీపీ నేతలతోపాటు, సాక్షి మీడియా, వైసీపీ సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోంది. అమరావతి ఎక్కడ మునిగింది? అమరావతి మునిగిపోతే నేను ఇక్కడ ఎలా ప్రెస్ మీట్ పెడతాను? మీరందరూ ఇక్కడికి ఎలా వస్తారు? కొన్ని ప్రాంతాల్లో పునాదులు తీసిన చోట నీళ్లు రావా? దాన్ని బూచిగా చూపించి అసత్య ప్రచారాలు చేస్తారా?' అని అనిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై రాజద్రోహం కింద కేసులు పెట్టాలన్నారు. తప్పుడు పోస్టుల ద్వారా ప్రజల్లో ఆందోళన సృష్టించే దండుపాళ్యం బ్యాచ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ వేసి ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామన్నారు. తప్పుడు ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టాన్ని కూడా తీసుకురానున్నామని చెప్పారు. 'ప్రకాశం బ్యారేజీలో ఒక్క గేటుకు చిన్న రిపేర్ వస్తే రాద్ధాంతం చేశారు. జగన్ సొంత పత్రికలో రోజుకో నకిలీ వార్తలు రాస్తున్నారు. మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

మనసుంటే సాధ్యమే!

ఎందరికో స్ఫూర్తి మంత్రం...



- పాగాల సుమ అనే విద్యార్థిని పదో తరగతిలో 571 మార్కులు సాధించి ఐఐటీలో సీటు తెచ్చుకుంది. డాక్టర్ అవ్వాలన్న సుమ కల సాకారం చేసేందుకు మార్గదర్శిగా రమణయ్య ముందుకు వచ్చారు.
- నూజివీడు సీడ్స్ ఆశాప్రియ తమ సంస్థకు చెందిన మండవ ఫౌండేషన్ ద్వారా ఆగిరిపల్లి నుంచి 120 కుటుంబాలను, వారి స్వగ్రామం తుక్కులూరులో 132 కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఉన్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు.
- వినుకొండ నుంచి వెళ్లి అమెరికాలో స్థిరపడిన అబ్బూరి శ్రీనివాస్ ఆన్‌లైన్‌లో మాట్లాడారు. పీ4 ద్వారా తన గ్రామంలో వ్యవసాయ, విద్యారంగాల్లో అవసరమున్న ఐదు కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఉన్నతికి కృషి చేస్తానని తెలిపారు.
- సౌదీ అరేబియాలో స్థిరపడిన తెలుగువారు ఖలీద్ సైపుల్లా ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి పేదరికాన్ని తరిమేసే పీ4 ఉద్యమానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. తాను 15 కుటుంబాలను దత్తత తీసుకుంటానని చెప్పారు.

అడాప్ట్ ట్రీని బంగారు కుటుంబానికి ఇచ్చిన సీఎం

కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దత్తత తీసుకున్న 250 కుటుంబాల్లో కొందరిని వేదికపైకి తీసుకొచ్చారు. వారితో చంద్రబాబు కాసేపు మాట్లాడారు. కుప్పం నియోజకవర్గంలో 80వేల కుటుంబాలు ఉంటే 7,900 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి వారి అవసరాలను తీర్చే దిశగా అడుగులు వేస్తున్నట్లు కుప్పం నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్ వికాస్ వెల్లడించారు. తాను దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలకు సీఎం అడాప్ట్ ట్రీని అందించారు.

జీవితంపై ఆశలు చిగురించాయి

పీ4 వేదికపై బంగారు కుటుంబాల భావోద్వేగం

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'నాకు చిన్నప్పుడే పెళ్లయింది. కొన్నాళ్లకే భర్త చనిపోయారు. నేను, నా కొడుకు పుట్టింటికి చేరాం. ఇంటర్ వరకు చదివిన నేను కుటుంబానికి అండగా నిలవాలనుకున్నాను. అదే సమయంలో పీ4 పథకంలో భాగంగా నన్ను హెచ్‌సీఎల్ కంపెనీ దత్తత తీసుకుని.. డిజిటల్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్ పూర్తికాగానే నెలకు రూ.15వేల జీతంతో ఉద్యోగం ఇప్పించారు. ఇప్పుడు నాలో ఆత్మవిశ్వాసం పెరిగి జీవితంపై ఆశలు చిగురించాయి..' అని చెబుతూ కృష్ణా జిల్లాకు చెందిన షేక్ పావని పీ4 వేదికపై భావోద్వేగానికి గురయ్యారు. ఆమె గురించి తెలుసుకున్న సీఎం చంద్రబాబు చలించిపోయారు. పీ4 పేదల జీవితాల్లో ఎలాంటి మార్పు తీసుకొస్తుందో చెప్పేందుకు పావని మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. జీవితంలో కష్టపడి మరింత ఉన్నత స్థానానికి వెళ్లాలని పావనిని ఆశీర్వదించారు. పావనిని దత్తత తీసుకున్న హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రతినిధి శ్రీనివాసులు మాట్లాడుతూ.. తాము పీ4 కింద 1000 మందిని దత్తత తీసుకున్నామని, 21ఫస్ట్ సెంచరీ కోర్ ఎంప్లాయిమెంట్ స్కిల్ కోర్సును నేర్పించి వారందరికీ ఉపాధి కల్పిస్తామని చెప్పారు. పావనికి కూడా ఆ కోర్సు నేర్పించి టెక్నోటాస్క్ కంపెనీలో ఉద్యోగం ఇప్పించామన్నారు.

కుటుంబ ఆదాయాన్ని పెంచుకున్నా: భవాని

'నా భర్త అద్దె ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవారు. సరిపడినంత ఆదాయం వచ్చేది కాదు. నేను టైలరింగ్ నేర్చుకుని కుటుంబానికి చేదోడుగా నిలిచే అవకాశం కల్పించింది పీ4. వాసవ్య మహిళా మండలి వారు కరెంటు కుట్టు మిషన్ ఇచ్చారు' అని గన్నవరంకు చెందిన భవాని తెలిపింది. ఆమెను దత్తత తీసుకున్న వాసవ్య మహిళా మండలి నిర్వాహకురాలు డాక్టర్ కీర్తి మాట్లాడుతూ.. పీ4 ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఏర్పడుతుందని అన్నారు.



సమాజం వల్ల పైకి వచ్చినవారు సమాజానికి ఎంతో కొంత తిరిగివ్వాలి. సంపద ప్రజలకు మెరుగైన జీవనం కలిగేలా ఉపయోగపడాలి.

సంపద సృష్టించాలి.. సంపద సృష్టిస్తే ఆదాయం పెరుగుతుంది. ఆదాయం, మంచి మనసు ఉంటేనే సంక్షేమం అమలు చేయగలం. ఈ రెండింటిలో ఏది లేకపోయినా ప్రజలకు సంక్షేమాన్ని ఇవ్వలేం. - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

మరొకరికి అండగా నిలవాలని, 'గివ్ బ్యాక్' అనేది మన నినాదం కావాలని పిలుపిచ్చారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు పీ-4 దోహదపడుతుందన్నారు. ఉగాది రోజు సంకల్పం చేసి ఇప్పుడు అధికారికంగా ప్రారంభిస్తున్నామని.. ఇది చరిత్రాత్మకమైన రోజుగా నిలిచిపోతుందని తెలిపారు. బంగారు కుటుంబాలను చిన్నచూపు చూడాల్సిన అవసరం లేదని, ఒకప్పుడు బంగారు కుటుంబాలుగా ఉన్న వారే నేడు మార్గదర్శులుగా ఉన్నారని.. నేటి బంగారు కుటుంబాలు రేపటి మార్గదర్శులుగా మారాలన్నదే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. తాను కూడా పేద కుటుంబం నుంచే వచ్చానన్నారు. ఆలయాలు, ప్రార్థనామందిరాలకూ చేయూతనివ్వడం సేవేనని చెప్పారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

21 లక్షల కుటుంబాలు గుర్తింపు..

రాష్ట్రంలో 1.69 కోట్ల కుటుంబాలు ఉన్నాయి. వీటిలో 21 లక్షల కుటుంబాలకు వివిధ అవసరాలు ఉన్నాయి. వాటిని బంగారు కుటుంబాలుగా గుర్తించాం. ఇప్పటి వరకు 13.40 లక్షల బంగారు కుటుంబాలను 1.41 లక్షల మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. 15 లక్షలు టార్గెట్‌గా పెట్టుకున్నాం. నేను స్వయంగా 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. ఎంత బిజీగా ఉన్నా స్వయంగా పర్యవేక్షిస్తున్నాను. దానధర్మాలు చేయడం మనకు కొత్తకాదు. మన పూర్వీకుల నుంచి వచ్చిన సంప్రదాయం అది. తూర్పుగోదావరి జిల్లాలో డొక్కా సీతమ్మ తన ఇంటికి వచ్చిన వారందరికీ లేదనకుండా అన్నం పెట్టేది.. అందుకే ఇప్పటికీ ఆమెను అన్నపూర్ణగా గుర్తుపెట్టుకున్నాం. అన్న ఎన్టీఆర్ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అని నమ్మారు. అదే స్ఫూర్తితో టీడీపీ ముందుకెళ్తోంది. అందుకే నిత్యం పేదల అభ్యున్నతి కోసం ఆలోచన చేస్తున్నాం. ప్రభుత్వపరంగా చేయాల్సింది చేస్తున్నాం. ఇకపై ప్రభుత్వ పాలసీలు పేదలకు అనుకూలంగానే ఉంటాయి. భూమ్మీద ఎవరం శాశ్వతం కాదు. అందరం ఏదో ఒక రోజు చనిపోతాం.. చనిపోయిన తర్వాత అన్నీ వదిలివెళ్లాలి. కొంత మంది జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటారు. కొందరు దుర్వినియోగం చేసుకుంటారు. చనిపోయాక కూడా 10 మంది గుర్తుపెట్టుకునే పనులు చేయాలి. అదే శాశ్వతం. మీరు (మార్గదర్శులు) కూడా దేవుడిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సంపద పెరుగుతున్నా పేదరికం అలానే ఉంది

ఒకప్పుడు దేశంలో సంపద సృష్టించడం చాలా కష్టంగా ఉండేది. ఆర్థిక సంస్కరణల వల్ల సులభమైంది. త్వరలోనే అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా నిలువనుంది. అయితే సంపద పెరుగుతున్నా పేదరికం అలాగే ఉంది. అందుకే పీ-4 తీసుకొచ్చాం. ఈ కార్యక్రమం చాలా మంది జీవితాల్లో గొప్ప మార్పునకు కారణమవుతుంది. ఇంటర్ పాస్ అయిన ఓ అమ్మాయికి 2 నెలల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించారు. తద్వారా ఆమె జీవితంలో గణనీయమైన మార్పు వచ్చింది. ఇది పీ-4తో సాధ్యపడింది.

చరిత్రలో ఎవరూ ఇవ్వని సంక్షేమం

మా ప్రభుత్వం పేదలను దృష్టిలో ఉంచుకునే పాలన చేస్తోంది. 64 లక్షల మందికి ఏటా రూ.33 వేల కోట్లను పింఛన్ల రూపంలో ఇస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రమూ ఈ రకంగా చేయడం లేదు. ఆగస్టు నెలలోనే పేదలకోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రారంభించాం. కొత్త పెన్షన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి కింద ఉచిత బస్సు ప్రయాణం.. ఇలా ఎన్నిటికో శ్రీకారం చుట్టాం. చరిత్రలో ఎవ్వరూ ఇవ్వని విధంగా సంక్షేమం అమలు చేస్తున్నాం. ఉచిత బస్సు ఓట్ల కోసం తీసుకురాలేదు. ఆడబిడ్డలు బయటకు వస్తే రాష్ట్రంలో ఆర్థిక అభివృద్ధికి వారే ప్రధాన సూత్రధారులు అవుతారు. ఆర్థిక విప్లవానికి నాంది పలుకుతారు. భార్యాభర్తలు ఐటీ రంగంలో ఉంటే.. 80 శాతం మంది భార్యలకే ఎక్కువ జీతం వస్తోంది. నా తల్లి పొగచూరిన పొయ్యిపై వండడంతో అనారోగ్యం పాలైంది. ఆ రకంగా రాష్ట్రంలో మహిళలెవరూ కాకూడదనే అప్పట్లో దీపం పథకం ప్రారంభించి ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. దేశంలోనే మొదటిసారి ఈ పథకాన్ని మేమే అమలు చేశాం. ఇప్పుడు ధరలు పెరిగాయని మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. జనాభా పెరుగుదలను ప్రమోట్ చేస్తున్నాను. ఆదాయం సరిపోక చాలా మంది పిల్లలను కనడం మానేస్తున్నారు. నేనిచ్చే పథకాలు వినియోగించుకోగలిగితే మీ ఆదాయం పెరుగుతుంది.

2047 పెద్ద దూరంలో లేదు..

నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో జన్మభూమి, ప్రజల వద్దకు పాలన వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. పేదరికం రూపుమాపేందుకు 25 ఏళ్ల క్రితమే 'వెలుగు' అనే కార్యక్రమాన్ని ప్రారంభించాను. విజన్-2020 డాక్యుమెంట్ తెస్తే అందరూ విమర్శించారు. అప్పుడు చెప్పిన దాని కంటే ఎక్కువ అభివృద్ధిని హైదరాబాద్‌లో చూస్తున్నాం. ఇప్పుడు స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ తయారుచేశాం. 2047 పెద్ద దూరంలో లేదు. ఈ ప్రణాళికలు విజయవంతం కావాలంటే దేశంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం రావాలి. మరోసారి వైకుంఠపాళి ఆడకుండా ప్రజలు నమ్మకం ఉంచి కొనసాగిస్తే 2047 నాటికి రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా చేస్తాం. వాట్సాప్‌లో 704 సేవలు అందుబాటులో తెచ్చాం. టెక్నాలజీని ఉపయోగించుకుంటే చాలా ప్రయోజనం ఉంటుంది. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త విధానం తీసుకున్నాం.



సీఎం చంద్రబాబు నిర్వహించిన పీ4 కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం పొందిన షేక్ పావని

ప్రజారోగ్య పరిరక్షణకు సంజీవని

భగవంతుడు మనకు ఇచ్చిన ఆయుష్షు 120 ఏళ్లు. దానిని జాగ్రత్తగా కాపాడుకోవలసిన బాధ్యత మనపైనే ఉంది. ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించడానికి బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి సంజీవని అనే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నాం. ఇప్పటికే కుప్పంలో డీజీ నెర్వ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తాం.

ప్రార్థనా మందిరాలకు వెళ్తే ఒత్తిడి దూరం

ఆలయాలు, చర్చిలు, మసీదులు ప్రజలందరికీ ఒత్తిడి నివారణ కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. అవిలేకుంటే చాలా మంది పిచ్చివాళ్లమయ్యేవాళ్లం. నమ్మకం ద్వారా మనిషి ఏదైనా సాధించగలడు. దానికో ఉదాహరణ చెబుతాను.. ఒక వ్యక్తి వేంకటేశ్వరస్వామి భక్తుడు. కంపెనీ పెట్టి సుమారు రూ.6 వేల కోట్లు సంపాదించాడు. 121 కిలోల బంగారం అంటే సుమారు రూ.140 కోట్లు శ్రీవారికి ఇచ్చాడు.

ఆలోచన కాదు.. ఆచరణ గొప్పది

ఆలోచన రావడం కాదు దాన్ని ఆచరణలో పెట్టడం అవసరమని మేఘా సంస్థ యజమాని కృష్ణారెడ్డి అన్నారు. 'నాది కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు. మా ఊరిలో ప్రతి ఇంటికి పైప్డ్ గ్యాస్ కనెక్షన్ ఇచ్చాను. ఊళ్లో 70 శాతం మంది మా సంస్థలో పనిచేస్తున్నారు. మా గ్రామంలో ప్రతి కుటుంబం వద్దకు మా సంస్థ సభ్యులు వెళ్లారు. మా ఊరి వాళ్లు ఎవ్వరూ మాకు ఉచితంగా ఏదీ ఇవ్వమని అడగలేదు. మాకు బతకడానికి మార్గం చూపించమని మాత్రమే కోరారు.' అని అన్నారు. - మేఘా కృష్ణారెడ్డి

పేదరిక నిర్మూలనకు చిరుప్రయత్నం

పీ4 ఫౌండేషన్ చైర్మన్ కుటుంబరావు మాట్లాడుతూ.. పీ4 అనేది స్వచ్ఛంద కార్యక్రమం. పేద విద్యార్థులకు ట్యూషన్ చెప్పడం కూడా పీ4లో భాగమే. గతంలో దేశంలో పేదరికాన్ని రూపుమాపేందుకు గరీబీ హఠావో, రోటీ, కపడా మకాన్ వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేశారు. అయినా దేశంలో పేదరికం ఇంకా ఉంది. పీ4 కూడా పేదరికాన్ని రూపుమాపేందుకు ఓ చిన్న ప్రయత్నం మాత్రమే. దీన్ని అందిపుచ్చుకుని కొందరైనా పేదరికం నుంచి బయటకు వస్తారనేది ఈ ప్రభుత్వం ఆశ. - కుటుంబరావు

మళ్లీ మళ్లీ టీడీపీ రావాలి

2016లో చంద్రబాబు తీసుకొచ్చిన విదేశీ విద్య పథకం ద్వారా రూ.10 లక్షల సాయం తీసుకుని విదేశాలకు వెళ్లి చదువుకుని నేడు ఉన్నతస్థితిలో ఉన్నానని.. ఐర్లాండ్‌కు చెందిన ప్రవాసాంధ్రుడు సాత్విక్ మురారి అన్నారు. 'నేను పొందిన సాయాన్ని తిరిగి ఇవ్వాలన్న ఉద్దేశంతో ఉన్నప్పుడు పీ4 ప్రారంభించారు. విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే 10 మంది పేద విద్యార్థులకు పీ4 ద్వారా నేను ఉచితంగా చదివిస్తాను. పీ4 లాంటి కార్యక్రమాలు నిరంతరాయంగా అమలు కావాలంటే టీడీపీ మళ్లీ మళ్లీ అధికారంలోకి రావాలి' అన్నారు.

ఆదరణలో మత్స్యకారులకు ప్రాధాన్యం: సవిత

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో మత్స్యకారులను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యం. ఆదరణ 3.0లో మత్స్యకారులకు ప్రాధాన్యమిస్తాం' అని మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆమెను తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. 'మత్స్యకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చుతున్నారు. వేటకు కావాల్సిన ఆధునిక పరికరాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వేట విరామ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేసి ఇస్తున్నాం. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబరు 217ను రద్దు చేసిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదే' అని సవిత అన్నారు.

బీసీ డీ ధ్రువీకరణ పత్రాలతో నగరాలకు మేలు

రాష్ట్రంలో నగరాల కులానికి చెందిన వారి అభివృద్ధికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని మంత్రి సవిత తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో నగరాల కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలేశ్ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'నగరాలు అందరికీ ఒకేలా బీసీ-డీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం వల్ల ప్రభుత్వ పథకాలు అందుకునే అవకాశం కలిగిందన్నారు.

మతోన్మాదాన్ని అణిచివేస్తాం

- ఉగ్ర కదలికలపై అప్రమత్తంగా ఉండాలి: మాధవ్



పార్వతీపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మతోన్మాదం, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అణిచివేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఉగ్ర కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాత బస్టాండ్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించి, అభిప్రాయాలు సేకరించారు. నామినేటెడ్ పదవుల్లో బీజేపీకి రావాల్సిన వాటా సాధిస్తామని చెప్పారు. దీనిపై సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు తెలిపారు. సమావేశం తర్వాత మాధవ్ విలేకరులతో మాట్లాడారు. మతోన్మాదాన్ని, ఉగ్రవాదాన్ని అణిచివేయడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఉగ్రవాదులను మట్టుబెట్టి భారత్‌ను ఉగ్రరహిత దేశంగా తీర్చిదిద్దుతామని అన్నారు. బంగ్లాదేశ్ నుంచి మన దేశంలోకి చొరబడిన అనేకమంది రోహింగ్యాలు యువతను ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నారని ఆయన ఆరోపించారు. నామినేటెడ్ పదవులు నిష్పత్తి ప్రకారం వస్తాయని, ఎవరూ నిరాశ పడవద్దని చెప్పారు. పదవుల పంపిణీకి సంబంధించి కూటమి పార్టీల్లో కొంతమేర అసంతృప్తి ఉన్నమాట వాస్తమేనని మాధవ్ పేర్కొన్నారు.

బకాయిలు.. వడ్డీతో సహా ఇప్పించండి!

- డీఏ, పీఆర్‌సీలపై కోర్టును ఆశ్రయించిన ఏపీసీపీఎస్ఈఏ

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం(డీఏ), 11వ వేతన సంఘం(పీఆర్‌సీ) బకాయిలను చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్ఈఏ) హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి, ట్రెజరీ, అకౌంట్స్ డైరెక్టరేట్, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్, వర్క్ అకౌంట్స్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు కౌంటర్ అవసరమని అభిప్రాయపడింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. విజయ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ హయాంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలతో పాటు పీఆర్‌సీ బకాయిలను వడ్డీతో సహ చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని సంఘం అధ్యక్షుడు పఠాన్ బాజీ పిటిషన్‌లో అభ్యర్థించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది అంజన రామకామేశ్వరి వాదనలు వినిపించారు.

ఉచిత ప్రయాణానికి స్మార్ట్ కార్డులు

- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడి

మడకశిర టౌన్/విజయవాడ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు స్మార్ట్ కార్డులను అందజేస్తామని ఆ సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకులో ఆయన మాట్లాడుతూ ఉచిత ప్రయాణానికి ఆధార్ జిరాక్స్ కాపీలను కూడా అనుమతించాలని ఆదేశించామన్నారు. ఈ పథకం ద్వారా రోజుకు 25నుంచి 26లక్షల మంది ప్రయాణం చేస్తారని అంచనా వేశామని, అయితే, పథకం ప్రారంభమయ్యాక తొలి ఐదు రోజుల్లో రోజుకు సగటున 18 లక్షల మంది ప్రయాణించారని తెలిపారు. విద్యార్థుల బస్సుల్లో 'స్త్రీ శక్తి' వర్తించదన్నారు. ఈ పథకం కొన్ని డిపోల్లో 100 శాతం, తుని డిపోలో 106 శాతం నమోదైందని తెలిపారు. ఈ పథకం అమలు తీరుపై మహిళలు సంతృప్తిగా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆర్టీసీకి 1,150 కొత్త బస్సులు రాబోతున్నాయని, అందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని చెప్పారు.



తిరుమల కొండకూ 'ఉచిత బస్సు': కొనకళ్ల

తిరుమల కొండపైకి వెళ్లే మహిళా భక్తులకు ఉచిత బస్సు పథకం వర్తిస్తుందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. ఘాట్‌రోడ్డు అయినందున ఆ బస్సుల్లో సిటింగ్ వరకే అనుమతి ఉంటుందని చెప్పారు. అయితే ఎలక్ట్రిక్ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదని కొనకళ్ల పేర్కొన్నారు.

30న విశాఖలో జనసేన సభ

- వివరాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల

విశాఖపట్నం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 30వ తేదీన జనసేన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఈ సమావేశం పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో జరుగుతుందన్నారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని వివరించారు. విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్ల కోసం విశాఖ జిల్లా ఎమ్మెల్యేల అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. గ్రామ స్థాయి కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొనేలా విస్తృత ప్రచారం చేస్తామన్నారు. విశాఖ వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 30వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు బహిరంగ సభ ప్రారంభం అవుతుందన్నారు.



ఈ సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌పై విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ.. విశాఖ ఉక్కును కాపాడాలని అమిత్ షాను కూటమి ఏర్పాటు కాకముందే పవన్ కల్యాణ్ ఢిల్లీలో కలిసి కోరారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం డిమాండ్ వల్లే ఇటీవల స్టీల్ ప్లాంటుకు కేంద్రం ఆర్థిక సాయం అందించిందని వివరించారు.

సునీత దంపతులపై కేసు కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

కేసు నమోదు చేశారని.. తమకు అన్యాయం జరిగిందని చెబితే.. అక్రమంగా తమపైనే కేసులు పెట్టారని.. వాటిని కొట్టివేయాలని ఆ ముగ్గురూ దాఖలుచేసుకున్న పిటిషన్లను, హత్య కేసులో నిందితులు వైఎస్ అవినాశ్‌రెడ్డి, డి.శివశంకర్ రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి సహా నిందితులందరి బెయిల్ రద్దు చేయాలంటూ సునీతారెడ్డి, సీబీఐ దాఖలు చేసిన పిటిషన్లను.. అన్నిటినీ కలిపి సుప్రీంకోర్టు విచారిస్తోంది. మంగళవారం జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం వీటిపై విచారణ జరిపింది. సునీతా రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ, నిందితుడు గంగిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. వివేకా హత్య తీరు అత్యంత దారుణమని, పాశవికంగా చేశారని, ఈ కేసులో దోషులకు మరణశిక్ష పడే అవకాశం ఉందని ఎస్వీ రాజు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హత్య జరిగిన తీరు చూస్తే నిందితులు రెండేళ్లు, ఐదేళ్లు బెయిల్ రాకుండా జైలులో ఉండడం పెద్ద విషయమేమీ కాదన్నారు. వివేకాను హత్య చేసిన తర్వాత ఆధారాలు చెరిపివేయడం, సాక్ష్యాధారాలు లేకుండా చేయడం వంటివి నిరూపితమయ్యాయని తెలిపారు. ముందేమో గుండెపోటు అని, తర్వాతేమో రక్తపు వాంతులని ప్రచారం చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇవన్నీ తదుపరి దర్యాప్తులో బయటికి వచ్చాయని వెల్లడించారు.

కావాలనే ఆ ముగ్గురిని ఇరికించారు: లూథ్రా

సునీత దంపతులతో పాటు సీబీఐ అధికారి రాంసింగ్‌పైనా కుట్ర పూరితంగా కేసు నమోదు చేశారని లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అహ్మదీ కొన్ని కీలక వివరాలను కోర్టు ముందు ఉంచారు. గత ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబరు 15న వివేకా పీఏ కృష్ణారెడ్డితో ఫిర్యాదు చేయించి సునీత, రాజశేఖర్ రెడ్డి, రాంసింగ్‌ను కావాలనే కేసులో ఇరికించారని, పులివెందుల స్టేషన్‌లో వారిపై ఎఫ్ఐఆర్ కట్టారన్నారు. లూథ్రా వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ముగ్గురిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను క్వాష్(కొట్టివేత) చేస్తున్నట్టు వెల్లడించింది. చట్టాన్ని దుర్వినియోగం చేయడానికే వారిపై కేసులు పెట్టారని అభిప్రాయపడింది. వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డే మాస్టర్ మైండ్ అని లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. "వివేకా హత్య కేసును మొదటి నుంచీ తప్పుదారి పట్టించేందుకు అవినాశ్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. సుప్రీంకోర్టు నిర్దిష్టమైన గడువు విధించినందువల్లే దర్యాప్తును ముగించినట్లు సీబీఐ చెబుతోంది. ఈ కేసులో మరింత దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది. మరిన్ని నిజాలు బయటికి రావాలి. పాత్రధారులతోపాటు సూత్రధారులెవరో తేల్చాల్సిన అవసరం ఉంది. ఈ కేసులో మరికొందరి పాత్ర ఉన్నట్లు సీబీఐ చార్జిషీటులో స్పష్టం చేసింది. హైకోర్టులోనూ తెలిపింది. అలాంటప్పుడు అర్ధాంతరంగా దర్యాప్తును ఎలా ముగిస్తారు? నిందితులు సాక్షులను బెదిరిస్తున్నారు. సాక్ష్యాలను నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారు. అప్రూవర్ దస్తగిరి జైలులో ఉన్నప్పుడు నిందితుడు శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి జైలుకెళ్లి బెదిరించారు. దీనికి సంబంధించిన ఫొటో సాక్ష్యాలు, ప్రత్యక్ష సాక్షులు ఉన్నారు. అవినాశ్‌రెడ్డి బయటే ఉంటే కేసును ప్రభావితం చేస్తారు. వాస్తవాలు వెలుగులోకి రాకుండాచూస్తారు. గతంలో కేసును ఆయన పక్కదారి పట్టించారనడానికి ఎన్నో సాక్ష్యాలు, రుజువులు ఉన్నాయి. ఇవన్నీ పరిశీలించి అవినాశ్ రెడ్డి సహా నిందితుల బెయిల్ రద్దు చేయాలి." అని కోరారు. సునీత, రాజశేఖర్‌రెడ్డి, రాంసింగ్‌లపై కుట్రపూరితంగా కేసులు దాఖలు చేశారని, ఇదే విషయంపై ప్రస్తుత ఏపీ ప్రభుత్వం క్లోజర్ రిపోర్టులో అన్ని విషయాలను సమగ్రంగా స్పష్టం చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అవినాశ్‌రెడ్డి బలవంతం వల్లే ఆ ముగ్గురిపై కేసులు పెట్టినట్టు విచారణలో పోలీసులు తెలిపారన్నారు. సునీత దంపతులతోపాటు రాంసింగ్‌పై దాఖలైన కేసు వివరాలను అహ్మదీ కోర్టుకు వివరించారు.

తదుపరి దర్యాప్తు అవసరమా? లేదా? చెప్పండి : బెంచ్

వివేకా హత్య కేసులో సుమారు గంటకు పైగా సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా తదుపరి దర్యాప్తు అవసరమా? లేదా? అనేది చెప్పాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగైతే ఎందుకు అవసరం అనేది కూడా స్పష్టంగా తెలియజేయాలని సూచించింది. అలాగే, దర్యాప్తులో భాగంగా నిందితుల కస్టోడియల్ విచారణ అవసరమా? లేదా? అనేది కూడా చెప్పాలని ప్రశ్నించింది. నిందితుల్లో ఎంతమంది బెయిల్ రద్దు చేయాలో కూడా తెలియజేయాలని తెలిపింది. అయితే, ప్రతిదానికీ ఎందుకు? ఏమిటి? అనేది స్పష్టంగా చెప్పాలని ఆదేశించింది. ఈ సందర్భంగా వివేక హత్య కేసు డ్రామాకు స్వస్తి చెబుతామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది.

గంగిరెడ్డికి బెయిల్..

వివేకా హత్య కేసులో నిందితుడు గంగిరెడ్డికి సుప్రీం ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. వివేకా హత్యలో గంగిరెడ్డి పాత్ర లేదని సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు తెలిపారు. , మిగతా నిందితులంతా బెయిల్‌పై బయట ఉన్నప్పుడు ఆయన మాత్రం జైలులోనే మగ్గుతున్నారన్నారు. అయితే, మరోసారి తమ వాదనలు తెలియజేస్తామని, కొంత సమయం కావాలని సీబీఐ, సునీత తరఫు న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. శేషాద్రినాయుడు వ్యాఖ్యలతో ఏకీభవించిన ధర్మాసనం గంగిరెడ్డికి బెయిల్ మంజూరు చేసింది.

నాపై ఆరోపణల వెనుక కుట్ర

- వ్యక్తిత్వాన్ని కించపరిచిన వారిని వదలను
- పరువు నష్టం దావా వేస్తా: ఎమ్మెల్యే కూన రవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీతో పాటు మరికొంతమంది తనపై కుట్ర పన్నారని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ మండిపడ్డారు. తన వ్యక్తిత్వంపై నిరాధార ఆరోపణలు చేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరిపై కేసులు పెట్టడంతో పాటు పరువు నష్టందావా వేస్తానన్నారు. "ప్రజల పక్షాన ప్రశ్నిస్తే నా వ్యక్తిత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం వెనుక కుట్ర ఉంది. కేజీబీవీ ప్రవేశాల విషయమై నా నియోజకవర్గంలోని ప్రిన్సిపాల్స్ అందరితో పాటు జిల్లా అధికారితో కలిసి గ్రూప్ వీడియోకాల్ మాట్లాడితే.. దాన్ని వక్రీకరిస్తూ ప్రిన్సిపాల్ సౌమ్య తప్పుడు ఆరోపణలు చేయడం తగదు. ఒక చోటా వైసీపీ నాయకుడి రాజకీయం కోసం.. సౌమ్య డ్రామా ఆడారు. ఆరోపణలు చేసిన వారితో పాటు మీడియాపైనా పోలీసులకు, స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తాను" అని హెచ్చరించారు. రవికుమార్‌కు కేజీబీవీ ప్రిన్సిపాళ్లు మద్దతుగా నిలిచారు. వీడియోకాల్‌లో సౌమ్యపై ఎమ్మెల్యే దుర్భాషలు ఆడలేదని చేయలేదని బూర్జ, ఆమదాలవలస ప్రిన్సిపాల్స్ చెప్పారు. ఎమ్మెల్యేపై ఆమె తిరుగుబాటు చేయడం బాధాకరమన్నారు. తమ సంఘం తరఫున సౌమ్యను పలుమార్లు హెచ్చరించినా, ఖాతరు చేయలేదని కేజీబీవీల సంఘం జిల్లా నాయకులు చెప్పారు. ఎమ్మెల్యేపై సౌమ్య ఆరోపణల వల్ల ఉద్యోగులుగా సిగ్గుపడుతున్నామని, ఎమ్మెల్యేకి బహిరంగ క్షమాపణ చెబుతున్నామని అన్నారు.

రోడ్లకు వాన దెబ్బ

- వరదలకు 1582 కి.మీ. మేర దెబ్బతిన్న రహదారులు
- తక్షణ మరమ్మతులకు 100 కోట్లు
- సీఈ, ఎస్ఈలతో మంత్రి బీసీ సమీక్ష

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వర్షాల ధాటికి రాష్ట్రంలో రహదారులు భారీగా దెబ్బతిన్నాయి. గ్రామీణ, పట్టణ, అంతర్ జిల్లా రహదారులతోపాటు, రాష్ట్ర హైవేలు సైతం భారీగా కోతకు గురయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1,582 కి.మీ. మేర ఆర్అండ్‌బీ రహదారులు దెబ్బతిన్నట్లు ఆశాఖ ప్రాథమిక అంచనావేసింది. వీటిలో 987 కి.మీ. జిల్లా ప్రధాన రహదారులు కాగా, 595 కి.మీ. మేర రాష్ట్ర హైవేలు ఉన్నాయి. ఈ పరిస్థితిపై ప్రభుత్వం అప్రమత్తమైంది. తక్షణ మరమ్మతులు చేపట్టాలని, ఆ రహదారులను పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రహదారుల తక్షణ మరమ్మతులకు రూ.100 కోట్లు మేర, శాశ్వత ప్రాతిపదికన పునర్‌నిర్మాణం చేయడానికి కనీసం రూ.1,215 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని ఆశాఖ ప్రాథమిక నివేదికను రూపొందించింది. ఇదిలా ఉంటే వరదలు, వర్షాల నేపథ్యంలో ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆ శాఖ ఇంజనీరింగ్ చీఫ్, చీఫ్ ఇంజనీర్‌లు, జిల్లాల ఎస్ఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రహదారులకు గండ్లుపడి, పూర్తిగా రాకపోకలు నిలిచిపోయిన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

మినీ అంగన్వాడీలకు మహర్దశ

- 4,687 మినీ కేంద్రాల ఉన్నతీకరణ
- టెన్త్ ఉత్తీర్ణులైన కార్యకర్తలకు పదోన్నతి
- వారి నెల వేతనం రూ.11,500కు పెంపు
- మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీని నెరవేర్చింది. అంగన్వాడీల ప్రధాన డిమాండ్ అయిన మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా ఉన్నతీకరిస్తూ మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 4,687 మినీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా ఉన్నతీకరించింది. ఆ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న పదో తరగతి ఉత్తీర్ణులైన కార్యకర్తలకు మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలుగా పదోన్నతి కల్పించింది. మినీ అంగన్వాడీ కేంద్రాల్లోని సిబ్బందికి ఇప్పటి వరకు నెలకు రూ.7వేలు గౌరవ వేతనంగా వచ్చేది. పదోన్నతి లభించడంతో ఇకపై వారి గౌరవ వేతనం రూ.11,500కు పెరుగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా పదిమంది కంటే తక్కువ లబ్ధిదారులు ఉండి, కిలోమీటరు పరిధిలోనే మరో కేంద్రం ఉన్న 340 మినీ అంగన్వాడీ కేంద్రాలు సమీప కేంద్రాల్లో విలీనం చేయనున్నట్లు తెలిపారు. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీ సెంటర్లుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బేబిరాణి, సుబ్బరావమ్మ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

నాగార్జునసాగర్ 26 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదలవుతున్న నీరు



కృష్ణానదికి భారీగా వరద

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేస్తున్నారు. అదేవిధంగా పోతిరెడ్డిపాడుకు 30 వేల క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్‌కు 2,818 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌లోకి 4,10,186 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. సాగర్ నీటిమట్టం 584.60 అడుగులకు చేరింది. సాగర్‌లో 296.28 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో నాగార్జున సాగర్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 10 అడుగులు మేర ఎత్తి 3,61,322 క్యూసెక్కులు.. కుడి కాలువ ద్వారా 7528, ఎడమ కాలువ ద్వారా 4949, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,007, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 4,09,506 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 3,97,807 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 4,13,395 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి 4,73,065 క్యూసెక్కుల వరద వస్తోంది. 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ 69 గేట్లను పూర్తిస్థాయిలోకి ఎత్తి 4,66,905 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి భారీగా పెరుగుతుండడంతో దిగువ నదీ తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



అల్లూరి జిల్లా చింతూరు మండలంలో 30వ నంబరు జాతీయ రహదారిపై చేరిన వరద నీరు

నేడు గోదావరికి 10 లక్షల క్యూసెక్కులు?

ఎగువ ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టం పెరుగుతుండగా ధవళేశ్వరం వద్ద తగ్గుతూ ప్రవహిస్తోంది. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి 8,23,083 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. నీటిమట్టం 10.40 అడుగులకు చేరుకుంది. బుధవారం 10 లక్షల క్యూసెక్కుల వరకు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. ఎగువన శబరి ఉధృతితో ఛత్తీస్‌గఢ్ - ఒడిసా నడుమ సుక్మా సమీపంలో శబరి నదిపై నిర్మించిన వంతెన నీట మునిగింది. అలాగే, మన రాష్ట్రం మీదుగా ఒడిసా వెళ్లే 30 నెంబరు జాతీయ రహదారి నిమ్మలగూడెం వద్ద నీట మునిగింది. భద్రాచలం వద్ద మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 36.00 అడుగులకు చేరింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి అదనంగా వస్తున్న 8,00,702 క్యూసెక్కులను అధికారులు దిగువకు విడుదల చేశారు. కొల్లేరు వరద ఉధృతి స్వల్పంగా పెరిగింది. దీంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

బలహీనపడిన వాయుగుండం

వాయుగుండం మంగళవారం ఉదయం ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపాన తీరం దాటింది. ఆ తర్వాత పశ్చిమ వాయవ్యంగా పయనించి ఒడిశా మీదుగా ఛత్తీస్‌గఢ్‌లో ప్రవేశించే సమయానికి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. ఇది బుధవారం ఉదయానికి మరింత బలహీనపడి అల్పపీడనంగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో అనేకచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. గురువారం నుంచి వర్షాలు క్రమేపీ తగ్గుతాయని తెలిపింది. బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. వరద ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం విజయవాడ కృష్ణాఘాట్, అవనిగడ్డ, చింతూరు, అమలాపురంలలో ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది.

ఎక్కడికక్కడ వరద మళ్లింపు

- గత ఏడాది అనుభవాల రీత్యా ముందే అప్రమత్తం

అమరావతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల యాజమాన్య నిర్వహణలో గత ఏడాది ఎదురైన అనుభవాల నేపథ్యంలో రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తోంది. కృష్ణా నదిపై నిర్మించిన జలాశయాల్లోకి ఎగువ నుంచి వస్తున్న వరదను ఎక్కడికక్కడ మళ్లిస్తూ.. ప్రవాహవేగాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులోభాగంగా పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమకు కృష్ణా జలాలను తరలిస్తున్నారు. పులిచింతల నుంచి వేగంగా వస్తున్న వరదను ప్రకాశం బ్యారేజీ ద్వారా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. తద్వారా బ్యారేజీపైనా .. విజయవాడ లోతట్టు ప్రాంతాలపైనా వరద ప్రభావం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. బ్యారేజీలోకి ఇసుక మరబోట్లు రాకుండా నిరంతర గస్తీ చేపడుతున్నారు. గత ఏడాది ప్రకాశం బ్యారేజీ నుంచి జలాలు బయటకు వెళ్లకుండా అడ్డు పడేలా ప్రభుత్వ వ్యతిరేక వర్గాలు కుట్ర పన్ని .. మరపడవలను వరుసగా వదిలిన విషయం తెలిసిందే. జల వనరుల శాఖ బుడమేరు వరద నియంత్రణ చర్యలనూ చేపడుతోంది. ఈ కాలువ విస్తీర్ణం 17,500 నుంచి 35,500 క్యూసెక్కులకు పెంచుతూ ప్రణాళికలు సిద్ధం చేసే పనిని ఏపీజెన్కోకు అప్పగించింది. దీనిపై జల వనరులు, జెన్కో ఉన్నతాధికారులతో ఆ శాఖ ప్రత్యేక సీఎస్ జి.సాయిప్రసాద్ వెలగపూడి సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు, డైరెక్టర్ సుజయ్, కృష్ణా డెల్టా సీఈ రాంబాబు, అంతర్రాష్ట్ర జల వ్యవహారాల చీఫ్ ఇంజనీరు సుగుణాకరరావు పాల్గొన్నారు. బుడమేరు విస్తరణ బాధ్యతలను జెన్కోకు సాయిప్రసాద్ అప్పగించారు.

పక్కా ప్రణాళికతో...

కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టుల్లోకి వస్తున్న ఎగువ వరద ప్రవాహం నియంత్రణలోనే ఉన్నదని రాష్ట్ర జల వనరుల శాఖ చెబుతోంది. ఆలమట్టి నుంచి క్రమంగా వరద ప్రవాహం తగ్గుతోంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్, అక్కడ నుంచి పులిచింతల, ప్రకాశంబ్యారేజీకి నాలుగు లక్షల క్యూసెక్కుల మేర వరద వస్తోంది. ఈ వరదనంతటినీ వచ్చింది వచ్చినట్లుగా సముద్రంలోకి వదలేస్తున్నారు. ఎక్కడికక్కడ నీటి యాజమాన్య నిర్వహణ చర్యలను జల వనరుల శాఖ చేస్తోంది.

రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు (టీఎంసీల్లో) ఇలా

ప్రాజెక్టు	గరిష్ఠ నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)
శ్రీశైలం	215.81	198.36	3,61,654	4,43,004
నాగార్జున సాగర్	312.05	296.28	4,10,000	4,10,000
పులిచింతల	45.77	33.76	3,98,087	41,4186
ప్రకాశం బ్యారేజీ	3.07	3.07	4,60,339	4,60,339
సుంకేశుల	1.2	0.55	1,40,000	1,24,480
ధవళేశ్వరం	2.93	2.93	7,63,310	7,63,310
ఆలమట్టి	129.72	118.44	56,126	1,35,880
జూరాల	9.66	7.41	1,97,115	2,10,820
తుంగభద్ర	105.79	74.61	89,411	1,17,156

అప్రమత్తంగా ఉండండి

- విద్యుత్తు సంస్థలకు సీఎస్ విజయానంద్ ఆదేశం

అమరావతి ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఇంధన సంస్థలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుదాఘాతంతో మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో, జేఎండీ, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీలను విజయానంద్ ఆదేశించారు. మంగళవారం ఏపీట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, డైరెక్టర్ (గ్రిడ్) భాస్కర్, డిస్కమ్‌ల సీఎండీలు పృథ్వీతేజ్, సంతోష్ రావు, పుల్లారెడ్డితో విజయానంద్ టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. భారీ వర్షాలతో విద్యుత్తు సంస్థలకు నష్టం వాటిల్లకుండా పటిష్ఠమంతమైన కార్యాచరణను సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యుత్తు అంతరాయం కలిగినప్పుడు తక్షణమే పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని పంపిణీ సంస్థలను ఆదేశించారు.

అవాంఛనీయ ఘటనలు జరక్కుండా చూడాలి: జయలక్ష్మి

కృష్ణా, గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి కలెక్టర్లను ఆదేశించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరక్కుండా చూడాలని స్పష్టం చేశారు. మంగళవారం కృష్ణా, గోదావరి పరివాహక జిల్లాల కలెక్టర్లతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అవసరమైతే ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను జిల్లాల్లో సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిత్యావసర వస్తువులు, మందులు, శానిటేషన్ మెటీరియల్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

తక్షణ ఖర్చులకు జిల్లాకు కోటి చొప్పున విడుదల

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సహాయ కార్యకలాపాల కోసం జిల్లాకు రూ.కోటి చొప్పున ప్రభుత్వం రూ.16 కోట్లు విడుదల చేసింది. విపత్తుల సమయంలో తక్షణ ఖర్చులు భరించడానికి టీఆర్ 27 కింద ఈ నిధులు తీసుకోవటానికి జిల్లా కలెక్టర్లను అనుమతించింది. ఈ మేరకు విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఈ నిధులు కేటాయించారు. వరద ప్రాంతాల నుంచి బాధితుల్ని పునరావాస కేంద్రాలకు తరలించడం, తాగునీరు, ఆహారం, పాలు అందించడం, పారిశుధ్యం, ఆరోగ్య శిబిరాల నిర్వహణకు ఈ నిధుల వినియోగంలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఖర్చు చేయని నిధుల్ని నెల రోజుల్లోపు తిరిగి జమ చేయాలని పేర్కొంది.

'ఇండియా' అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌సీపీ నేత శరద్ పవార్, శివసేన-యూబీటీ నేతలు అరవింద్ సావంత్, సంజయ్ రావత్, టీఎంసీ నేత డెరెక్ ఓ బ్రెయిన్, డీఎంకే నేతలు కనిమొళి, తిరుచ్చి శివ, ఎస్పీ నేత ధర్మేంద్ర యాదవ్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్‌తో పాటు కాంగ్రెస్ ఎంపీలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, ప్రమోద్ తివారీ పాల్గొన్నారు. సమావేశం బయట ఆమ్ ఆప్ తరఫున సంజయ్ సింగ్ కూడా మద్దతును ప్రకటించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ప్రతిపక్ష పార్టీ నేతల సమక్షంలో సుదర్శన్‌రెడ్డి పేరును ప్రకటించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి దేశంలో అత్యంత ప్రముఖ న్యాయ నిపుణుడని, ప్రగతిశీల భావాలు కలిగిన ఆయన ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించారని తెలిపారు. ఆయన నిరంతరం సామాజిక ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం పోరాడారని చెప్పారు. ఉప రాష్ట్రపతి ఎన్నికను ఒక సైద్ధాంతిక పోరుగా ఖర్గే అభివర్ణించారు. దేశ స్వాతంత్రోద్యమ విలువలు రాజ్యాంగంలోని ప్రజాస్వామిక స్ఫూర్తికి ప్రతీకగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నిలిచినందువల్లే ఆయనను ప్రతిపక్షాలు ఉమ్మడి అభ్యర్థిగా ఎంచుకున్నాయని చెప్పారు. 21న నామినేషన్ దాఖలు చేస్తారని ఖర్గే తెలిపారు

రేవంత్ కీలక పాత్ర

ఇండియా కూటమి సోమవారం అభ్యర్థి ఎంపికపై సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ ఒక నిర్ణయానికి రాలేక పోయింది. దక్షిణాది నుంచే అభ్యర్థిని ఎంపిక చేయాలని నిర్ణయించినప్పటికీ ఏ పార్టీ పేరును ప్రతిపాదించలేదు. డీఎంకే నేత తిరుచ్చి శివతో పాటు పలువురు పేర్లపై చర్చించారు. తెలంగాణ ప్రస్తావన వచ్చినపుడు ఖర్గే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడినట్లు తెలిసింది. ఇరువురూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరుపై చర్చించారు. ఆయనను ఒప్పించే బాధ్యతను రేవంత్‌కే అప్పగించారు. సోమవారం సాయంత్రం రేవంత్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో చర్చించి ఆయనను ఒప్పించారని, ఆయన ఓకే అన్న తర్వాత ఖర్గేకు తెలిపారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యమైన తటస్థులైన వారి పేర్లు చర్చించినపుడు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరు ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. బీజేపీ భావజాలాన్ని బలంగా వ్యతిరేకిస్తున్న మేధావి మాత్రమే కాక సామాజిక న్యాయానికి తోడ్పడుతున్న వ్యక్తిగా సుదర్శన్‌రెడ్డి కంటే మంచి అభ్యర్థి లభించరని కాంగ్రెస్ అభిప్రాయపడింది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఖర్గే స్వయంగా ఫోన్ చేసి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఢిల్లీకి వెంటనే రమ్మని అభ్యర్థించారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఎంపీలు స్వాగతం చెప్పారు. బుధవారం జరిగే కూటమి ఎంపీల సమావేశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పరిచయం చేస్తారు. అనంతరం నామినేషన్ పత్రాలపై సంతకాలు సేకరిస్తారు.

తెలుగువాడిని గెలిపించుకుందాం!: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం తెలుగు వారికి దక్కిన గౌరవమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'తెలుగు రాష్ట్రాలకు చెందిన 42 మంది లోక్‌సభ, 18 మంది రాజ్యసభ సభ్యులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ఆయన్ను గెలిపించాలి. సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సహా ఏ పార్టీతోనూ సంబంధం, అనుబంధం లేదు. తెలుగు భాషను ప్రాచీన భాషగా గుర్తించేందుకు అందరమూ ఒకటైనట్లుగానే తెలుగువాడైన సుదర్శన్‌రెడ్డిని గెలిపించడానికి పార్టీలకు అతీతంగా అందరూ ఒక్కటి కావాలి. టీడీపీ, బీఆర్ఎస్, వైసీపీ, ఎంఐఎం, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, కేసీఆర్, వైఎస్ జగన్, అసదుద్దీన్ ఒవైసీ, పవన్ కల్యాణ్... జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయం కోసం కృషి చేయాని విజ్ఞప్తి చేస్తున్నా. తెలుగు రాష్ట్రం నుంచి పీవీ నర్సింహారావు ప్రధాని అయినప్పుడు.. నంద్యాల లోక్‌సభకు జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన్ను గెలిపించేందుకు అప్పటి ప్రధాన ప్రతిపక్ష నేత, టీడీపీ అధినేత ఎన్టీఆర్ ముందుకు వచ్చారు. తెలుగువాడైన పీవీ ప్రధాని కావడం తెలుగువారందరికీ గర్వకారణమని చెప్పిన ఆయన.. ఉప ఎన్నికల్లో టీడీపీ తరపున అభ్యర్థిని పోటీకి పెట్టలేదు' అని గుర్తు చేశారు.

వ్యవసాయ కుటుంబంలో జన్మించి..

హైదరాబాద్/కందుకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ భూచిరెడ్డి సుదర్శన్‌రెడ్డి వ్యవసాయ కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఆకుల మైలారం గ్రామంలో 1946 జులై 8న ఆయన జన్మించారు. 1971లో ఉస్మానియా వర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పట్టా పొందారు. అదే ఏడాది డిసెంబరు 27న ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో సభ్యుడయ్యారు. 1988 ఆగస్టు 8న ఏపీ హైకోర్టులో ప్రభుత్వ ప్లీడరుగా నియమితులయ్యారు. 1993లో ఉమ్మడి ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అదే ఏడాది ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1995 మే 2న ఉమ్మడి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2005లో గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2007లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2011 జులై 8న పదవీ విరమణ అనంతరం గోవాకు మొట్టమొదటి లోకాయుక్త ఛైర్మన్‌గా పనిచేశారు.

పరిశ్రమలకు అనుమతుల్లో ఆలస్యం చేయొద్దు

- ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా చూడాలి: మంత్రి భరత్

అమరావతి/విశాఖపట్నం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి టీజీ భరత్ అన్నారు. పరిశ్రమలకు అనుమతుల విషయంలో ఆలస్యం ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేసేలా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏపీఐఐసీ కార్యాలయంలో పరిశ్రమల శాఖ మేనేజర్లతో మంగళవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఎస్ఐపీబీ ఆమోదించిన పెట్టుబడుల పురోగతిపై ఆరా తీశారు. జిల్లాల్లోని పారిశ్రామిక పార్కుల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. భూములు తీసుకున్న కంపెనీలు పనులు మొదలు పెట్టకపోతే.. కంపెనీల ప్రతినిధులతో మాట్లాడాలని, స్పందన లేకపోతే భూ కేటాయింపులు రద్దు చేయాలని చెప్పారు.



రష్యా ప్రతినిధులతో ఎంఓయూ.. చిత్రంలో కోన శశిధర్, గణేశ్‌కుమార్, రాజశేఖర్ ఉన్నారు

రష్యాలో ఉపాధి కల్పనకు ఒప్పందాలు

యువతకు రష్యాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆ దేశ ప్రతినిధులతో ప్రభుత్వం ప్రాథమిక ఒప్పందాలు చేసుకుంది. మంగళవారం విశాఖలో నిర్వహించిన కార్యక్రమానికి ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ జి.గణేశ్‌కుమార్, ఏయూ వీసీ రాజశేఖర్, ప్రభుత్వ సలహాదారు సీతా శర్మ హాజరయ్యారు. తమ దేశ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాల గురించి రష్యా అధికారి అనోవా వివరించారు. ఏపీలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల వివరాలను శశిధర్ తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.